# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

06.11.2025 గురువారం Thursday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 134 | పేజీలు : 8 Pages : 8 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


# ఆ పార్టీలు ఒక్కటే!

**త్వరలోనే బీజేపీలో బీఆర్ఎస్ విలీనం**

**ఈ రెండు పార్టీలు ఒక్కటే అని రుజువయ్యింది**



- గత పార్లమెంట్ ఎన్నికల్లో వీరి బంధం బట్టబయలు
- మైనార్టీలకు కాంగ్రెస్ అండ ఉంటుందన్న సీఎం రేవంత్‌రెడ్డి
- రేవంత్‌తో భేటీ అయిన క్రైస్తవ సంఘాల నేతలు

“కారు గుర్తుకు ఓటేస్తే కమలానికి వేసినట్టేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ జూబ్లీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. కాంగ్రెస్ కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. సీఎం మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ లో మైనార్టీలను మభ్యపెట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు.”

**హైదరాబాద్, నవంబర్ 5:** బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి మాజీ సీఎం కేసీఆర్ తాకట్టు పెట్టారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎనిమిది చోట్ల డిపాజిట్ కూడా రాకపోవడానికి కుమ్మక్కు రాజకీయాలే కారణమని విమర్శించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ఎంతోదూరం లేదన్నారు. ఈ మేరకు ఈ రెండు పార్టీలు ఒక్కటే అంటూ బీఆర్ఎస్, బీజేపీపై రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధామంత్రి నరేంద్రమోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్ తెలంగాణకి అత్యంత ప్రమాదకరమని ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటేస్తే కమలం గుర్తుకు వేసినట్లేనని ఆరోపించారు. జూబ్లీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సీఎం రేవంత్ రెడ్డిని బుధవారం కలిశారు. ఈ క్రమంలో సీఎంతో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

మిగతా 2 లో



# బీహార్‌లో ఎన్డీయే కూటమిదే విజయం

- మరోమారు ప్రజలు పట్టం కట్టబోతున్నారు
- ప్రజల్లో మార్పు గమనించానన్న ప్రధాని మోదీ

బిహార్‌లో 20 ఏళ్లలో కనీవినీ ఎరగని విజయాన్ని ఎన్డీయే కూటమి ఈసారి సాధించబోతోందని, ఓటర్లు ఆ మేరకు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. మరోమారు ఎన్‌డిఎదే బీహార్ అని అన్నారు. ప్రజల్లో కనిపిస్తున్న మార్పునకు ఇది సంకేతం అన్నారు. 'ఆటవిక రాజ్య' నేతలు చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు.

4



2

# హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ

**25 లక్షల ఓట్లు నకిలీవేనని గుర్తించాం: రాహుల్**

బిహార్ ఎన్నికల వేళ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి అధికార బీజేపీ, ఎలక్షన్ కమిషన్‌పై విరుచుకుపడ్డారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో భారీ స్థాయిలో ఓట్ల చోరీ జరిగిందని, 100శాతం పక్కా ఆధారాలతో ఈ ఆరోపణలు చేస్తున్నానన్నారు.



## కూతురి కులాంతర వివాహం

నమ్మించి కిడ్నాప్ చేయబోయిన తల్లిదండ్రులు

.. వివరాలు 2లో

## కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

నలుగురు సంగారెడ్డి జిల్లా వాసుల మృతి

.. వివరాలు 2లో



# కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు

**ఇంటింటి ప్రచారంలో కిషన్ రెడ్డి**

3

జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఏం చేస్తుందో చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ఏం చెప్పారో..ఏం జరిగిందో ప్రజలకు తెలిసిపోయిందని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్తితి లేదన్నారు.

# నువ్వు మగాడివైతే.. మగ పుట్టుక పుడితే..

**దమ్ముంటే అభివృద్ధిపై చర్చిద్దాం రా!**

- ఎవరి హయాంలో ఏం చేశామో వివరిద్దాం
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

వివరాలు 3లో





2

# ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

**ముగ్గురు మావోల హతం**

2

# కార్తీక పౌర్ణమి సందడి



- నదీతీరాల్లో పుణ్యస్నానాలు
- ఆలయాల్లో శైవరాధన..

తెలుగు రాష్ట్రాల్లో కార్తీకపౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి, అరటి డొప్పలలో దీపాలను నదిలో వదిలారు.

2



## దారుణం

రెండేళ్ల కూతురితో సహా హుస్సేన్ సాగర్‌లో దూకి తల్లి ఆత్మహత్య!

కుటుంబ కలహాలతో రెండున్నరేళ్ల కుమార్తెతో కలిసి ఓ తల్లి హుస్సేన్ సాగర్లో దూకి ఆత్మహత్య చేసుకుంది.

.. వివరాలు 2లో




# మల్టీప్లెక్స్‌లో మండుతున్న ధరలు

- ఇలా అయితే థియేటర్ల మూత తప్పదు
- హెచ్చరించిన సుప్రీం కోర్టు

కొన్ని మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్ ధర 100 రూపాయలు.. కాఫీ ధర 700 రూపాయలు ఉంటోంది. సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు మల్టీప్లెక్స్‌లకు వెళ్లే పరిస్థితి కనిపించటం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మల్టీప్లెక్స్‌లపై భారత అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది.

02



# ఆకాశంలో అద్భుతం

- సూపర్ మూన్ ఆవిష్కృతం

02

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

**ముగ్గురు మావోయిస్టుల హతం**

**ఖమ్మం, నవంబర్ 5:** ఛత్తీస్‌గఢ్ – తెలంగాణ సరిహద్దు బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం, మారిమల్ల అడవుల్లో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఆ ప్రాంతంలోని మావోయిస్టులను భద్రతా దళాలు చుట్టుముట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతమైనట్లు సమాచారం. భద్రతా దళాలు సంఘటనా స్థలంనుంచి పెద్ద సంఖ్యలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఇంకా అదే ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. అయితే, మావోయిస్టుల మృతిపై పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

# బకాయిలు చెల్లించాల్సిందే

**8న కళాశాలల అధ్యాపకులతో సభ**

**ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య వెల్లడి**

**హైదరాబాద్, నవంబర్ 5:** ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించే వరకు తమ ఆందోళన క ఒనసాగుతుందని ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య వెల్లడించింది. బకాయిలు చెల్లించకుండా బెదరింపులకు దిగడం సరికాదని, తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేవరకు బంద్ కొనసాగిస్తామని సమాఖ్య అధ్యక్షుడు రమేశ్‌బాబు అన్నారు. గత నాలుగు రోజులుగా బంద్ చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు బకాయిల్లో 50 శాతం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. మా డిమాండ్‌లను పరిష్కరించే వరకు బంద్ కొనసాగిస్తాం. ఎల్బీ స్టేడియంలో ఈనెల 8న కళాశాలల అధ్యాపకుల సభ నిర్వహిస్తాం. సుమారు 70వేల మంది దీనికి హాజరవుతారు. ప్రభుత్వం చర్చలకు పిలిచిందని చెప్పారు. జేఎన్‌టీయూ, ఉస్మానియా పరిధిలో నిర్వహిస్తున్న పరీక్షలను కళాశాలలు బహిష్కరించాయి. కళాశాల విద్య కమిషనర్ దేవసేన ఎంతగానో వేధిస్తున్నా భరిస్తూ వచ్చాం. ఆమెను ఆ విభాగం నుంచి బదిలీ చేయాలని ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల పరిష్కారానికి కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నాం. మూడు నెలలకు బదులు ఒక నెలలోనే కమిటీ రిపోర్టు అడగాలి. మార్చి నాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి. కాలేజీలపై విజిలెన్స్ దాడుల్లో నియంతృత్వ ధోరణి కనిపిస్తోందన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే 10లక్షల మంది విద్యార్థులతో భారీ సభ నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులతోనే తమ సమస్యలను చర్చిస్తామని అన్నారు.

# కూతురి కులాంతర వివాహం

**నమ్మించి కిడ్నాప్ చేయబోయిన తల్లిదండ్రులు**



**జగిత్యాల, నవంబర్ 5:** వాళ్లిద్దరు మనస్ఫూర్తిగా ఒకరినొకరు ఇష్టపడ్డారు. ఆరేళ్ల ప్రేమలో ఉన్న వారు కులాంతర వివాహం చేసుకొని పెళ్లిబంధంతో ఒక్కటయ్యారు. అయితే ఇది నచ్చని వధువు తల్లిదండ్రులు కూతురిని నమ్మించి కిడ్నాప్‌కు ప్రయత్నించారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం రాజక్కపల్లికి చెందిన మర్రి రాకేష్‌తో పెద్దపెల్లి జిల్లా పాలకుర్తికి చెందిన ప్రియాంక ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కాగా, కులాంతర వివాహానికి ప్రియాంక తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో వారు ఓ గుడిలో పెళ్లి చేసుకున్నారు. అయితే కొన్ని నెలల తర్వాత ప్రియాంకకు ఆమె తల్లి ఫోన్ చేసి మాట్లాడి కలిసిపోయినట్లు నటించారు. జరిగింది ఏదో జరిగిపోయిందని సొంత ఊరికి రమ్మని నమ్మబలికారు. వారి మాటలు నమ్మి వెళ్లగా మార్గమధ్యంలో ప్రియాంకను ఆమె తల్లిదండ్రులు, బావ కిడ్నాప్ చేయడానికి యత్నించారు. ఎలాగోలా స్థానికుల సహాయంతో తప్పించుకున్న ప్రియాకం తల్లిదండ్రులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

**నలుగురు మృతిసంగారెడ్డి జిల్లా వాసులు**

సంగారెడ్డి, నవంబర్ 5: కర్ణాటకలోని హల్లిఖేడ్‌లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వ్యాను, కారు ఢీకొన్న ఈ ఘటనలో నలుగురు తెలంగాణవాసులు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన నవీన్ (40), రాచప్ప (45), కాశీనాథ్ (60), నాగరాజు (40)గా గుర్తించారు. వీరంతా గానుగాపూర్ దత్తాత్రేయ ఆలయానికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది.

# బిడ్డతో సహా తల్లి ఆత్మహత్య

**హైదరాబాద్, నవంబర్ 5:** కుటుంబ కలహాలతో వివాహిత తన కుమార్తెతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే గుర్తు తెలియని శవంగా పోలీసులు భద్రపరిచారు. చివరకు దర్యాప్తులో ఆమెను కీర్తిక అగర్వాల్‌గా గుర్తించారు. లేక్ పోలీసుల వివరాల ప్రకారం..పాతబస్తీలో నివాసముంటూ వ్యాపారం చేస్తున్న పృథ్వీలాల్, చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న కీర్తిక అగర్వాల్(28) దంపతులు. వీరికి రెండేళ్ల కుమార్తె బియ్యారా ఉంది. దంపతుల మధ్య గొడవలతో ఆమె ఏడాదిన్నర కిందటే బహదూర్‌పురలో నివాసముంటున్న తల్లిదండ్రుల వద్ద కుమార్తెతో కలిసి ఉంటోంది. ఈనెల 2న హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోమవారం నెక్లెస్ రోడ్డులోని నీరా కేఫ్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలు లభ్యం కాకపోవడంతో మార్చురీకి తరలించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తమ కుమార్తె, మనుమరాలు కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆత్మహత్యకు పాల్పడిన మహిళ కీర్తిక అగర్వాల్‌గా గుర్తించిన ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆమె తన కుమార్తెతో కలిసి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావించి పరిశీలించగా మంగళవారం పాప మృతదేహాన్ని గుర్తించారు.

# బీజేపీలో త్వరలోనే బీఆర్ఎస్ విలీనం

మొదటి పేజీ తరువాయి



కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పని చేస్తామని వారు హామీ ఇచ్చారు. అలాగే, తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలపై సానుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. వారి సమస్యలని వెంటనే పరిష్కారిస్తానని మాటిచ్చారు. భారత్ జోడో పాదయాత్ర ద్వారా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలోని మైనార్టీలకు ఒక భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేసీఆర్ ఒక వైపు ఉన్నారని.. రాహుల్ గాంధీ, తాను మరోవైపు నిలబడ్డామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కేంద్రప్రభుత్వం ఎందుకు స్పందించలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ ఇప్పటి వరకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ కేసుల విషయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను ఎందుకు విచారణకు పిలవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అయ్యే పరిస్థితి ఉందని ఆరోపించారు. గతంలో కవితనే ఈ విషయాన్ని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసేందుకు జూబ్లీహిల్స్‌ను ప్రయోగశాలగా చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క దళితుడే మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. తమ మంత్రివర్గంలో నలుగురు దళితులకు అవకాశం కల్పించామని ఉద్ఘాటించారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌కి అవకాశం ఇచ్చామని అన్నారు. అత్యంత నిరుపేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నదే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలని ఈడీ ఆఫీసుకు పిలిచి విచారణ చేశారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో జరిగిన భేటీకి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, శ్రీ గణెలిష్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, ఏఐసీసీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు అనిల్ థామస్, తదితరులు పాల్గొన్నారు.



# మల్టీప్లెక్స్‌ల్లో మండుతున్న ధరలు

**ఇలా అయితే థియేటర్ల మూత తప్పదు • హెచ్చరించిన సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ, నవంబర్ 5:** దేశంలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు బాగా తగ్గిపోయాయి. మల్టీప్లెక్స్‌ల హవా నడుస్తోంది. అయితే, టికెట్ రేట్ల దగ్గరినుంచి తినే వస్తువుల వరకు మల్టీప్లెక్స్‌లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మినిమం టికెట్ ధర 200 రూపాయలు పైనే ఉంటోంది. కొన్ని మల్టీప్లెక్స్‌లలో వాటర్ బాటిల్ ధర 100 రూపాయలు.. కాఫీ ధర 700 రూపాయలు ఉంటోంది. సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు మల్టీప్లెక్స్‌లకు వెళ్లే పరిస్థితి కనిపించటం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మల్టీప్లెక్స్‌లపై భారత అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అత్యధిక ధరలు ఇలానే కొనసాగితే సినిమా హాళ్లు మూసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. మల్టీప్లెక్స్‌లలోని టికెట్ రేట్లు 200 రూపాయల వద్ద ఉండాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాతో పాటు మరికొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ప్రభుత్వ నిర్ణయంపై స్టే విధించింది. కానీ.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అమ్మే ప్రతీ టికెట్‌కు సంబంధించిన ఆడిటబుల్ రికార్డ్స్ మెయిన్‌టేన్ చేయాలని ఆదేశించింది. అంతేకాదు.. ఆఫ్‌లైన్‌లో టికెట్ కొనే వారి నుంచి ఐడీ ప్రూఫ్ తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు నిర్ణయంపై ఓ పిటిషన్ వేసింది. ఆ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహ్తా బెంచ్ తాజాగా విచారణ జరిపింది. విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్ మాట్లాడుతూ.. 'మీరు వాటర్ బాటిల్‌కు 100 రూపాయలు, కాఫీకి 700 రూపాయలు తీసుకుంటున్నారు' అని అన్నారు. ఇందుకు మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తరఫున కేసు వాదిస్తున్న అడ్వకేట్ ముకుల్ రోహత్గీ స్పందిస్తూ.. 'తాజ్ హోటల్‌లో కాఫీకి 1000 రూపాయలు తీసుకుంటున్నారు. మరి మీరు ఆ రేట్‌ను ఫిక్స్ చేస్తారా?' అని అడిగారు. ఇందుకు విక్రమ్ నాథ్ బదులిస్తూ.. 'ఈ రేట్లు స్థిరంగా ఉండాలి. సినిమా రంగం రోజురోజుకు దెబ్బ తింటోంది. ఇలాంటి సమయంలో జనం వచ్చి సినిమాను ఎంజాయ్ చేసేలా రేట్లు ఉండాలి. లేకపోతే సినిమా హాళ్లు ఖాళీగా ఉండాల్సి వస్తుంది' అని అన్నారు. ముకుల్ స్పందిస్తూ..'కర్ణాటక హైకోర్టు తీసుకున్న నిర్ణయం సరైనది కాదు. ఆఫ్‌లైన్‌లో టికెట్ కొనే వారి నుంచి ఐడీ ప్రూఫ్ తీసుకోమంటే ఎలా?. ఐడీ కార్డులు పెట్టుకుని థియేటర్లకు ఎవరు వస్తారు?' అని ప్రశ్నించారు.

# గతేడాది హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ

**25 లక్షల ఓట్లు నకిలీవేనని గుర్తించాం: రాహుల్**



**న్యూఢిల్లీ, నవంబర్ 5:** బిహార్ ఎన్నికల వేళ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి అధికార బీజేపీ, ఎలక్షన్ కమిషన్‌లపై విరుచుకుపడ్డారు. గతేడాది హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో భారీ స్థాయిలో ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. 100 శాతం పక్కా ఆధారాలతో ఈ ఆరోపణలు చేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ గెలుపును ఓటమిగా మార్చేందుకు వ్యవస్థాగత స్థాయిలో అవకతవకలు చోటుచేసుకున్నాయని అన్నారు. హర్యానాలో రెండు కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 25 లక్షల ఓట్లు నకిలీవే' అంటూ ఢిల్లీలో తాజాగా నిర్వహించిన పత్రికా సమావేశంలో సంచలన ఆరోపణలు చేశారు. తన బృందం 5.21 లక్షల డూప్లికేట్ ఓటన్లు గుర్తించిందని అన్నారు. హర్యానాలోని ప్రతి ఎనిమిది ఓట్లలో ఒకటి నకిలీనేనని స్పష్టం చేశారు. తన ఆరోపణలపై ఓ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ కూడా ఇచ్చారు. ఒక బ్రెజిల్ నటి ఫొటోతో, సీమా, స్వీటీ, సరస్వతి వంటి పలు పేర్లతో ఏకంగా 22 సార్లు నకిలీ ఓట్లు వేశారని అన్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఎలక్షన్ కమిషన్ వర్గాలు రాహుల్ గాంధీ ఆరోపణల్ని కొట్టిపారేశాయి. ఎన్నికల సమయంలో ఓటర్ జాబితాపై ఒక్క అప్పీల్ కూడా రాలేదని గుర్తు చేశాయి. హర్యానాలో 90 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అయితే, పంజాబ్ హర్యానా హైకోర్టులో మాత్రం కేవలం 22 ఎన్నికలకు సంబంధించిన పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అంటే, ఎన్నికల ఫలితాలకు న్యాయపరమైన సవాళ్లు పరిమితమ నేందుకు ఇది సూచన అని ఈసీ వర్గాలు కామెంట్ చేస్తున్నాయి.

# ఆకాశంలో అద్భుతం




**హైదరాబాద్, నవంబర్ 5:** కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆకాశంలో అద్భుతం ఆవిష్కృతమైంది. నవంబర్ 5వ తేదీ ఆకాశంలో చంద్రుడు సాధారణంగా కంటే పెద్దగా.. మరింత ప్రకాశవంతంగా కనిపించాడు. బుధవారం సాయంత్రం సరిగ్గా 6.49 గంటలకు చందమామ ఈ కనువిందు చేశాడు. దీనినే బీవర్ సూపర్ మూన్ అని పిలుస్తారు. పౌర్ణమి సమయంలో చంద్రుడు తన కక్ష్యలో తిరుగుతూ భూమికి అత్యంత సమీపంలోకి చేరడంతో ఈ అద్భుతం జరిగింది. ఈ సూపర్ మూన్ వేళ.. చంద్రుడు మాములు కంటే 13 శాతం పెద్దగా.. 30 శాతం ప్రకాశవంతంగా కనిపించాడు. ఈ సారి భూమికి చంద్రుడు మరింత దగ్గరగా వచ్చాడు. ఈ సూపర్ మూన్ ఈ ఏడాదిలో ఏర్పడిన రెండోది. చంద్రుడు.. భూమి చుట్టూ తిరిగే కక్ష్య పూర్తిగా వృత్తాకారంలో ఉండదు. కానీ కక్ష్యలో తిరిగే సమయంలో భూమికి చంద్రుడు దగ్గరగా.. దూరంగా వెళ్తుంటాడు. ఈ పౌర్ణమి వేళ.. చంద్రుడు తన కక్ష్యలో భూమికి సమీపానికి వచ్చినప్పుడు సూపర్ మూన్ అని పిలుస్తారు. ఈ సమయంలో భూమికి చంద్రుడు దాదాపు 3,57,000 కిలోమీటర్ల దూరంలో ఉంటారు. ఈ నేపథ్యంలో సాధారణ పౌర్ణమి కంటే చంద్రుడు పెద్దగా కనిపించాడు. చంద్రుడు చేరుకునే సమయంలో భూమి చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యకు సమీపంలో ఉన్న పెరజీ వద్ద సూపర్ మూన్ సంభవిస్తోంది.

# రాహుల్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన ఎన్నికల సంఘం

**సర్‌కు అనుకూలమో.. వ్యతిరేకమో చెప్పాలని వ్యాఖ్య**

**న్యూఢిల్లీ, నవంబర్ 5:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో తీర్పును బీజేపీ తారుమారు చేసిందని, 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఎన్నికల కమిషన్ తోసిపుచ్చింది ఆయన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని పేర్కొంది. హర్యానాలో ఓటర్ల జాబితాపై ఒక్క అప్పీల్ కూడా రాలేదని వివరించింది. హర్యానా ఎన్నికల ఫలితాన్ని బీజేపీ చోరీ చేసిందని, గెలుపు కోసం ఎన్నికల కమిషన్‌తో ఆ పార్టీ కుమ్మక్కయిందని రాహుల్ చేసిన ఆరోపణల నేపథ్యంలో ఈసీ తాజా వివరణ ఇచ్చింది. హర్యానాలో కాంగ్రెస్‌కు దక్కాల్సిన అద్భుత విజయాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడం ద్వారా 'ఆపరేషన్ సర్కార్ చోరీ' జరిగిందని రాహుల్ ఆరోపించారు. ఎన్నికల కమిషనర్లు బీజేపీతో కుమ్మక్కయ్యారని అన్నారు. దీనిపై ఈసీ స్పందిస్తూ, 90 అసెంబ్లీ స్థానాలకు గాను కేవలం 22 ఎలక్షన్ పిటిషన్లు మాత్రమే హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపింది. బూత్‌లలో ఉన్న కాంగ్రెస్ పోలింగ్ ఏజెంట్ల పాత్రను ఈసీ నిలదీసింది. ఆ పార్టీ పోలింగ్ ఏజెంట్లు ఏం చేస్తున్నట్టు? ఓటరు ఎవరైనా అప్పటికే ఓటు వేసినట్టు అనుమానం వచ్చినా, ఓటరు ఐడెంటిటీపై అనుమానం వచ్చినా అప్పుడే అభ్యంతరం వ్యక్తి చేసి ఉండొచ్చని పేర్కొంది. పౌరసత్వ వెరిఫికేషన్‌తో పాటు డూప్లికేట్లను, చనిపోయిన వారిని, చిరునామా మార్చుకున్న ఓటర్లను తొలగించేందుకు చేపట్టిన ఎస్ఐఆర్‌ను రాహుల్ గాంధీ సపోర్ట్ చేస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా? అని ఈసీ ప్రశ్నించింది. కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లు ఎందుకు అభ్యంతరాలు లేవనెత్తలేదని ప్రశ్నించింది. ఒకే పేరు పదేపదే రాకుండా నిరోధించేందుకు రివిజన్ జరిగినప్పుడు కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లు అభ్యంతరం చెప్పి ఉండవచ్చని పేర్కొంది. అక్టోబర్ 1 నుంచి అక్టోబర్ 15 వరకూ బిహార్‌లో ఎస్ఐఆర్ సమయంలో కూడా కాంగ్రెస్ ఎందుకు అప్పీల్ చేయలేకపోయిందో చెప్పాలని పేర్కొంది. హర్యానాలో 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని, టాప్-5 ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ విజయం సాధిస్తుందని చెప్పినప్పటికీ బీజేపీ గెలిచిందని న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాహుల్ తెలిపారు. ఒక నియోజకవర్గంలో ఒక ఫోటోతో వంద ఓట్లున్నాయని, అనేక బూతులలో ఫేక్ ఓట్లున్నాయని, అక్రమాలు బయటకు రావద్దని ఎన్నికల సంఘం సీసీటీవీ ఫుటేజ్‌ను డిలీట్ చేసిందని ఆరోపించారు. బ్రెజిలియన్ మోడల్, యూపీ బీజేపీ ఓటర్లు, డూప్లికేట్ ఓటర్లు, ఓటర్ల తొలగింపుతో హర్యానాలో గెలిచారని అన్నారు. యూపీ, హర్యానాలో వేల సంఖ్యల్లో డూప్లికేట్ ఓటర్లున్నారని, యూపీలో ఓటు వేసే వ్యక్తికి హర్యానాలో కూడా ఓటు ఉందని తెలిపారు. బిహార్‌లోనూ ఓట్ల చోరీ జరుగుతుందని, అక్కడ ఎన్నికల తరువాత ఓట్ల చోరీ అంశాన్ని బయటపెడతామని అన్నారు.

# మగాడివైతే.. మగ పుట్టకపుడితే.. చర్చిద్దాం రా!

- దమ్ముంటే అభివృద్ధిపై చర్చిద్దాం
- ఎవరి హయాంలో ఏం చేశామో వివరిద్దాం
- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్




**హైదరాబాద్, నవంబరు 5:** రేవంత్‌రెడ్డి నువ్వు మగాడివి అయితే.. మగ పుట్టుక పుడితే.. రా అభివృద్ధిపై చర్చిద్దాం.. ఎవరి నిజాయితీ పరుడో.. ఎవరు దొంగనో దేశం మొత్తం తెలుస్తది' అని సీఎం రేవంత్‌ను ఉద్దేశించి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. హైదరాబాద్ అభివృద్ధి పై తనతో చర్చకు రావాలని సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ సవాల్ విసిరారు. హైదరాబాద్ అభివృద్ధి ఎవరి హయాంలో ఏం జరిగిందో వివరిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కౌంటర్ ఇచ్చారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓటమి ఖాయమని రేవంత్‌కు అర్థమైందని సెటైర్లు గుప్పించారు. అందుకే తనపై రేవంత్‌రెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగారని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తప్పదని భావించి.. రేవంత్‌రెడ్డి తనపై విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఆయన కంటే గట్టిగా తాను మాట్లాడగలనని... రేవంత్‌రెడ్డికి సమాధానం చెప్పే సత్తా తనకు ఉందని స్పష్టం చేశారు. కానీ తమ అధినేత కేసీఆర్ సూచనల తోనే రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత దూషణలకు తాను దిగటం లేదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు చెప్పాలని కేసీఆర్ తనకు చెప్పారని పేర్కొన్నారు. తనను వ్యక్తిగతంగా విమర్శించిన.. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి రేవంత్‌రెడ్డిని తాను గౌరవిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్, జూబ్లీహిల్స్ అభివృద్ధిపై రేవంత్‌రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి హయాంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్.. చెత్త సిటీ, క్రైం సిటీగా మారిందని విమర్శించారు. అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు కేసీఆర్ హయాంలోనే నిర్మించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టారో చెప్పాలని సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో వంద లింకు రోడ్లు నిర్మించామని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోడ్లపై ఉన్న ఒక గుంత కూడా ఎందుకు పూడ్చలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. హైదరాబాద్ సిటీలో మళ్లీ తాగునీటి కష్టాలు తెచ్చింది కాంగ్రెస్ సర్కార్‌నేనని విమర్శించారు. చెత్త సమస్య పరిష్కారానికి స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి తాము శ్రీకారం చుట్టామని నొక్కిచెప్పారు. మెట్రో నిర్మించిన ఎల్అండ్ టీని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించారని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో విద్యుత్ వెలుగులు నిండాయని, గ్రీన్ సిటీ ఆఫ్ ది వరల్డ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామన్నారు. 16వేల నర్సరీలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశామన్నారు. హెచ్‌సీయూలో జీవవైవిధ్యాన్ని నాశనం చేసిన ఘనత రేవంత్‌రెడ్డిదని అన్నారు. రేవంత్ బెదిరింపులకు ఎన్నో పరిశ్రమలు తరలిపోతున్నాయని, రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వాన్నంగా మారాయని విమర్శించారు. మహారాష్ట్ర పోలీసులు వచ్చి ఇక్కడ డ్రగ్స్ దందాను పట్టుకున్నారని, రూ.12వేల డ్రగ్స్ దొరికితే పట్టింపులేదా?.. తెలంగాణ ముఖ్యమంత్రి, పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి రిపోర్ట్‌ను ఇంటింటికీ పంపిస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.5,328 కోట్లు ఖర్చు చేశామని.. మెట్రోపై రూ.1,722 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. స్ఆర్‌డీపీ కింద రూ.333కోట్లతో షేక్‌పేట ఫ్లై ఓవర్‌ను నిర్మించామని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశామన్నారు. ఎర్రగడ్డలో రూ.900 కోట్లతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించామన్నారు. వెయ్యి పడకలతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించింది వాస్తవం కాదా? అంటూ ప్రశ్నించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో లక్ష డబుల్ బెడ్‌రూంలు కట్టామని, రెహ్మత్‌నగర్‌లో కట్టిన 3600 డబుల్ బెడ్‌రూంలను పంపిణీ చేశామన్నారు. ప్రైవేట్ వాళ్లు కడితే ఒక్కో డబుల్ బెడ్‌రూంకు రూ.కోటి ఛార్జ్ చేసేవారన్నారు. ఆసరా పెన్షన్, కళ్యాణలక్ష్మి కింద దాదాపు రూ.600 కోట్లు అందించామన్నారు. 106 మందికి దళితబంధు అందించామన్నారు. పండుగల కోసం 14కోట్లు అందించామని, అన్నపూర్ణ భోజనాల కోసం రూ.2కోట్లు చెల్లించినట్లు వివరించారు. మైనారిటీల కోసం 204 గురుకులాలను ఏర్పాటు చేశామని, రూ.51కోట్లతో గురుకులాలన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బోరబండలో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.87కోట్లు ఖర్చు చేశామని, రూ.17కోట్లతో ఫంక్షన్ హాలు నిర్మించినట్లు తెలిపారు. రూ.455 కోట్లతో పది సబ్‌స్టేషన్లను కట్టామని, జూబ్లీహిల్స్‌లో విద్యుత్ నిర్వహణ కోసం రూ.505కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఇంటింటికీ తాగునీరు ఇచ్చేందుకు రూ.30కోట్లు ఖర్చు చేశామన్న కేటీఆర్.. రూ.180కోట్లు మంచినీటి కోసం ఖర్చు చేసినట్లు చెప్పుకొచ్చారు. పార్కుల నిర్వహణకు రూ.20కోట్లు, డీఆర్ఎఫ్ పెట్టి ప్రజలకు సహాయక చర్యలు అందించామన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.5328 కోట్లు ఖర్చు చేస్తే.. రెండేళ్ల రేవంత్ పాలనలో ఎంత ఖర్చు చేశారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రెండేళ్లలో చేసిన అభివృద్ధిని చూపించి రేవంత్ ఓట్లు అడగాలని, గోపీనాథ్ వేసిన శిలాఫలకం జూబ్లీహిల్స్‌లో ఎక్కడికి పోయినా కనిపిస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో 34 అవార్డులు వచ్చాయని.. రేవంత్ పాలనలో ఎన్ని వచ్చాయని ప్రశ్నించారు. ప్రజలే న్యాయనిర్ణేతలని.. జూబ్లీహిల్స్‌లో సరైన జవాబిస్తారన్నారు.

## పత్తి కొనుగోళ్లలో సీసీఐ నిబంధనలు

**బీజేపీ ఎంపీ నగేశ్ ఇంటిని ముట్టడించిన బీఆర్ఎస్**



**ఆదిలాబాద్, నవంబర్ 5:** పత్తి కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ వైఖరిని నిరసిస్తూ బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన బీజేపీ ఎంపీ నగేష్ ఇంటి ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతలకు దారితీసింది. మాజీ మంత్రి జోగు రామన్నతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎంపీ నగేశ్ ఇంటి ముందు బైఠాయించారు. పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అక్కడి నుంచి తొలగించే ప్రయత్నం చేయడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఆందోళనకు దిగిన మాజీ మంత్రి తోపాటు బీఆర్ఎస్ నాయకులు పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. సీసీఐ తేమ పేరిట పత్తి కొనుగోళ్లను నిరాకరిస్తూ రైతులకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. తేమతో సంబంధం లేకుండా సీసీఐ పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వర్షాలకు కారణంగా రైతులు పత్తి పంటను నష్టపోగా సీసీఐ పరిమితులు విధించడం సరికాదని అన్నారు. ఎకరాకు 7 క్వింటాళ్ల కాకుండా 12 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న పత్తికి సుంకం తగ్గించి కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని తీవ్రంగా ఖండించారు. ల్గ÷తుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

## కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు

**ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కిషన్ రెడ్డి**



**హైదరాబాద్, నవంబర్ 5:** జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఏం చేస్తుందో చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ఏం చెప్పారో..ఏం జరిగిందో ప్రజలకు తెలిసిపోయిందని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్తితి లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా యూసఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు, భారత రాష్ట్ర సమితికి మధ్య ఎలాంటి అవగాహనా ఒప్పందం జరగలేదని తేల్చిచెప్పారు. కేసీఆర్ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారని.. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి మధ్యనే అవగాహన కుదిరిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంతో పాటు జూబ్లీహిల్స్‌లోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు.

## మహిళా క్రికెట్ జట్టుకు మోడీ ఆతిథ్యం

**వారిని మనసారా అభినందించిన ప్రధాని**



**న్యూఢిల్లీ,నవంబర్5:** మహిళల వన్డే ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత క్రికెట్ జట్టును ప్రధాని మోడీ అభినందించారు. మీరు భారత పతాకను ఎగరేసారని ప్రశంసలు కురిపించారు. అసమాన ప్రతిభను పరదర్శించారని ప్రశంసించారు. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీని మహిళా క్రికెట్ జట్టు కలిసింది. దిల్లీలోని ప్రధాని నివాసంలో టీమ్‌ఇండియాకు మోదీ ఆతిథ్యం ఇచ్చారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో జట్టు సభ్యులు సాయంత్రం ప్రధాని నివాసానికి చేరుకున్నారు. వరల్డ్ కప్ విశేషాలను టీమ్ ఇండియా క్రీడాకారిణులు మోదీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా వరల్డ్ కప్ ఛాంపియన్లకు ప్రధాని అభినందనలు తెలిపారు. వరుసగా మూడు ఓటములు, సోషల్ మీడియాలో ఎదురైన ట్రోలింగ్‌ను సైతం ఎదుర్కొని గొప్ప విజేతగా నిలిచారంటూ ప్రశంసించారు. 2017 వరల్డ్ కప్ గ÷నైల్‌లో భారత్ చివరి వరకు పోరాడినా విజయం సాధించకలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. అప్పుడు మిథాలీ రాజ్ నేతృత్వంలోని జట్టు నరేంద్ర మోదీని కలిసింది. తాజాగా ఆ విషయాన్ని ప్రధాని గుర్తు చేసుకున్నారు. అనంతరం భారత ప్లేయర్లు ప్రధానికి వరల్డ్ కప్ ట్రోఫీతోపాటు 'నమో 1' జెర్సీని అందజేశారు. ఈ సందర్భంగా వారితో ప్రధాని గ్రూప్ ఫోటో దిగారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## రియాజ్‌తో నాకు సంబంధం లేదు

**సోషల్ మీడియా వార్తలను ఖండించిన ఆసిఫ్**



**నిజామాబాద్, నవంబర్ 5:** నిజామాబాద్‌లో కానిస్టేబుల్ ప్రమోద్‌ను దారుణంగా హత్య చేసిన కరుడుగట్టిన నేరస్థుడు రియాజ్‌ను పోలీసులు ఎన్ కౌంటర్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఎన్ కౌంటర్ మృతుడు రియాజ్ తో తనకు ఎలాంటి పరిచయం లేదని రియాజ్‌ను పట్టుకున్న ఆసిఫ్ వెల్లడించారు. కానిస్టేబుల్‌ను హత్య చేసిన నిందితుడు పారిపోతుంటే పట్టుకున్నానని తెలిపారు. నాపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. దొంగ నోట్ల కేసు, వాహనాల దొంగతనానికి కేసులు ఉన్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నా పేరుపై ఒక్క వాహనం లేదు, ఒక్క పోలీస్ కేసు లేదు అని ఆసిఫ్ వెల్లడించారు. తాను మెకానిక్‌ని కాదని.. తనది వెల్డింగ్ షాప్ అని, వెల్డింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాని తెలిపారు. రియాజ్ ఎన్‌కౌంటర్‌పై ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ నాపై దుష్ప్రచారం చేస్తుంది అని ఆసిఫ్ మండిపడ్డారు.



## కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మరింతగా అభివృద్ధి

**అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ఎందుకు నొప్పి**

**కాంగ్రెస్ అంటే ముస్లింలు..ముస్లింలు అంటే కాంగ్రెస్**

**మైఆనర్టీల మద్దతుతోనే తాను కొడంగల్‌లో గెలిచా**

**జూబ్లీహిల్స్‌లో మరోమారు సిఎం రేవంత్ ప్రచారం**

**హైదరాబాద్, నవంబర్ 5 :** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. నాలుగు వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా షేక్‌పేట్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. భారత రాష్ట్ర సమితి పేరుతో భాజపా ఓట్లు అడుగుతోందని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు కట్టకూడదో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే ఎందుకు బాధో చెప్పాలన్నారు. కిషన్‌రెడ్డికి సవాల్ విసిరితే ఎందుకు స్పందించడం లేదు. నిన్న నేను మాట్లాడిన మాటలను వక్రీకరించారు. మొదటి నుంచి నేను సెక్యులర్ భావాలు ఉన్న వ్యక్తిని. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు అనేక అవకాశాలు కల్పించింది. కొడంగల్‌లో నేను 3 సార్లు గెలవడానికి మైనార్టీల సహకారం ఉంది. 20 నెలల కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు ఇబ్బందులు లేకుండా చూశాం. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఎలా ఇచ్చారని కిషన్‌రెడ్డి అడుగుతున్నారు. ఎందుకు ఇవ్వొద్దో.. కిషన్‌రెడ్డి చెప్పాలన్నారు.. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్‌రెడ్డికి ఏం ఇబ్బంది. ప్రధాని మోదీ, మాజీ సీఎం కేసీఆర్ ఒక్కటేనన్నారు. ముస్లింలను భారత రాష్ట్ర సమితి మోసం చేస్తోంది. సవాల్ విసిరి పారిపోవడం కేటీఆర్‌కు అలవాటుగా ఉంది. కేసీఆర్ పదేళ్లలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారా అని సీఎం ప్రశ్నించారు. కాళేశ్వరం కేసులో సీబీఐ విచారణ ఎందుకు జరిపించడం లేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్ అభివృద్ధిపై చర్చలకు రావాలని సవాల్ విసిరారని.. ఆయనకు సవాల్ విసరడం పారిపోవడం అలవాటేనని సెటైర్లు గుప్పించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తాను సవాల్ విసిరితే ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదో ఢిల్లీలో తేల్చుకోవాలని ఛాలెంజ్ చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు కట్టకూడదో కిషన్‌రెడ్డి చెప్పాలని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బరిలో అసలు బీజేపీనే లేదని దెప్పిపొడిచారు. ఇక్కడ బీఆర్ఎస్ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందని పేర్కొన్నారు. ముస్లింలను బీఆర్ఎస్ మోసం చేస్తోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సెంటిమెంట్ పనికి రాదని విమర్శించారు. ఒకవేళ సెంటిమెంట్ అయితే పీజేఆర్‌పై పోటీ పెట్టింది బీఆర్ఎస్ కాదా..? అని అన్నారు. పదేళ్లుగా బీఆర్ఎస్ జూబ్లీహిల్స్‌కి ఏం ఇచ్చిందని నిలదీశారు. కాంగ్రెస్ అంటే ముస్లిం.. ముస్లిం అంటే కాంగ్రెస్ అని అభివర్ణించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామని ఉద్ఘాటించారు.

## సంగారెడ్డి జిల్లా వద్ద అదుపుతప్పిన బస్సు

**బ్రేకులు ఫెయిల్ అయి విద్యుత్ స్తంభానికి ఢీ**

**ప్రమాదం నుంచి బయటపడ్డ ప్రయాణికులు**



**సంగారెడ్డి, నవంబర్ 5:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల బస్సు ప్రమాదం ఘటన ఎంతటి విషాదాన్ని నింపిందో అందరికీ తెలిసిందే. బస్సును టిప్పర్ లారీ ఢీకొట్టడంతో అందులోని కంకర బస్సులో పడి దాదాపు 19 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మరువక ముందే మరో ప్రమాదం చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లాలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. అయితే ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. జాతీయ రహదారి 65 సమీపంలో పటాన్‌చెరు మండలం ముత్తంగి వద్ద ఆర్టీసీ బస్సుకు ప్రమాదం జరిగింది. ముందు ఉన్న కారును తప్పించబోయి బ్రేక్ ఫెయిల్ కావడంతో బస్సు డివైడర్‌పైకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ప్రయాణికులు ఎవరూ కూడా గాయపడకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గురైన బస్సు మేడ్చల్ డిపోకు చెందింది. మేడ్చల్ నుంచి ఇస్నాపూర్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే పటాన్‌చెరు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకున్నారు. బస్సులో సాంకేతిక లోపం కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. అయితే ఆర్టీసీ బస్సులకు వరుసగా జరుగుతున్న ప్రమాదాలతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్న పరిస్థితి.

# నేటి సాక్షి

TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలు...







సంపాదకీయం

# అభినందనలు కాదు.. ప్రోత్సాహం కావాలి!

మనదేశంలో క్రీడల్లో గెలిచాకనే అభినందనలు, ప్రశంసలు వెల్లువెత్తుతాయి. కానీ ఆడుకోవడానికి పాఠశాల స్థాయిలో లేదా కాలేజీ స్థాయిలో ప్రోత్సాహం మాత్రం అంతంత మాత్రమే. ఏ ప్రభుత్వం వచ్చినా క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం అంటుందే తప్ప..ఆచరించి చూపడం లేదు. ఈ విధానం మారలి. క్రీడలకు ప్రత్యేక పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలి. ఆర్థికంగా వారికి అండగా నిలవాలి. క్రీడ ఏదైనా నేర్చుకునేం దుకు అవసరమైన వసతులు కల్పించాలి. అప్పుడే భారత్ ప్రపంచస్థాయిలో సగర్వంగా నిలబడగలుగు తుంది. క్రీడాకరులు అందుకు సిద్దంగా ఉన్నారు. ఇటీవలి మహిళా క్రికెట్ కప్ విజేతల ప్రయాణమే ఇందుకు ఉదాహరణ. ఇందులో ఆడిన వారంతా దేశం కోసం చెమటోడ్చారు. తాము పడ్డ కష్టాన్ని మరచిపోయి, దేశ కీర్తిపతాకను రెపరెపలాడించారు. ఈ క్రమంలో ఐదు దశాబ్దాల కలను భారత మహిళలు సాకారం చేశారు. ఆకాశమే హద్దుగా అద్భుత ప్రదర్శనతో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని అమ్మాయిల జట్టు ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచింది. అడ్డంకులన్నీ అధిగమించి, బలమైన దక్షిణాఫ్రికా జట్టును 52 పరుగులతో ఓడించడం ద్వారా భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించింది. దీంతో దేశం గర్వించింది. అయితే దీని వెనక ఒక్కో అమ్మాయి వ్యథాభరిత జీవితం ఉంది. క్రికెట్‌లో తాము రాణించడానికి వ్యక్తిగతంగా ఎంతో శ్రమించారు. ఎన్నో ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. 1973లో మనదేశంలో మహిళా క్రికెట్ సంఘం ఏర్పడిన తర్వాత అంతర్జాతీయ పోటీల్లో భారత మహిళల ప్రస్థానం మొదలైంది. తొలితరం క్రికెటర్లు సొంత బ్యాటు, కిట్టు లేకపోయినా, జనరల్ బోగీల్లో ప్రయాణిస్తూ సొంత డబ్బులపైనో, చందాల పైనో ఆధారపడి దేశం తరపున ఆడారు. ఆ తరువాత స్పాన్సర్లు ముందుకు రావడం, 2005లో బిసిసిఐ పరిధిలోకి రావడం జరిగాయి. 2022లో పురుషుల, మహిళల జట్ల మధ్య వేతన సమానత్వాన్ని, మహిళల ప్రీమియర్ లీగ్‌ను ప్రవేశపెట్టడం,అంతర్జాతీయ క్రికెటర్లతో ఆడే అవకాశం లభించడం, ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి రావడం వంటి పరిణామాలతో మహిళల క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్లాయి. ఈ క్రమంలో వారు ఎదుర్కొన్న కష్టనష్టాలు అన్నీ దేశం కోసమే అని చెప్పక తప్పదు. తమ వ్యక్తిగత ప్రతిష్ట కోసమో లేదా డబ్బు సంపాదన కోసమో వారు ఆడలేదు. వారు భారత పతకాను ఎగరేయడం వెనక ఉన్న కష్టాలను తెలుసుకుని ప్రోత్సాహనికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాలి. అవసరమైతే కేంద్రమే క్రీడలకు సంబంధించి ప్రోత్సాహక కమిటీని ఏర్పాటు చేసి ఇలాంటి కష్టాలను అధిగమించేలా చేయాలి. ఇకపోతే వరుసగా రెండుసార్లు అండర్- 19 అమ్మాయిల జట్టు ప్రపంచకప్ నెగ్గడం, తాజాగా సీనియర్ జట్టు విజయం సాధించడం మహిళా క్రికెట్‌లో ఉజ్వల భవితకు పునాది. ప్రపంచకప్‌లో వరుసగా మూడు పరాజయాలతో డీలాపడిన జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో అమోల్ మజుందార్ కోచ్‌గా, మెంటార్‌గా అందించిన ప్రోత్సాహం ఆటగాళ్లలో మానసిక దృఢత్వాన్ని తీసుకొచ్చింది. వన్డే ప్రపంచకప్ టైటిల్ కొట్టడంలో ఆటగాళ్ల పాత్ర ఎంత కీలకమో.. తెర వెనుక కోచ్ పాత్ర అంతకుమించి ఉంటుంది. ఈ విజయంలో అతనిదీ ప్రత్యేక పాత్ర అని చెప్పక తప్పదు. మజుందార్ దేశవాళీ క్రికెట్ ఆడే క్రమంలో భారత క్రికెట్ జట్టులో మరో సచిన్ అవుతాడని భావించారు. దేశవాళీ క్రికెట్లో ముంబయి తరఫున పరుగుల వరద పారించాడు. 'ది వాల్'గా పేరు తెచ్చు కున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 171 మ్యాచుల్లో 11,167పరుగులు చేశాడు. ఇందులో 30సెంచరీల, 60అర్ధసెంచరీలు ఉన్నాయి. ఇక 113 లిస్ట్-ఎ క్రికెట్ మ్యాచుల్లో 3,286 పరుగులు కొట్టా డు. 3సెంచరీలు, 26అర్ధసెంచరీలు చేశాడు. కానీ ఆయనకు ఒక్కసారి కూడా టీమిండియా తరఫున ఆడే అవకాశం దక్కలేదు. అయినా నిరుత్సాహానికి గురికాలేదు. భారత మహిళలజట్టుకు కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాక తన పూర్వ వైభవాన్ని రంగరించి క్రీడాకారిణులను మెరికల్లా తీర్చిదిద్దాడు. దీంతో భారత మహిళల జట్టు వన్డే వరల్డ్ కప్ గెలవడంలో కోచ్‌గా కీలక పాత్ర పోషించాడు. కడపజిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల నల్లపురెడ్డి శ్రీచరణి లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌గా 9 మ్యాచ్‌లు ఆడి, 14 వికెట్లు తీయడం ద్వారా ప్రపంచకప్‌లో నాలుగో స్థానంలో నిలవడం ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లుసైతం ఆమె బౌలింగ్‌ను ఎదుర్కోవ డానికి ఆపసోపాలు పడటం ఆమె నైపుణ్యానికి నిదర్శనం. 22 వికెట్లతో మన దేశానికే చెందిన దీప్తిశర్మ మొదటిస్థానాన్ని దక్కించుకుని, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌ను సొంతం చేసుకుంది. అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా వైస్ కెప్టెన్ స్మృతి మందాన నిలిచింది. గ్రూప్ దశలో బ్యాటింగ్‌లో స్మృతీ మంధాన, ప్రతీకా రావల్, అమన్‌జోత్, రిచా ఘోష్, బౌలింగ్‌లో దీప్తి శర్మ, క్రాంతిగౌడ్, రేణుకాసింగ్ సత్తా చాటారు. ఫైనల్స్ లో షఫాలీ వర్మ సూపర్ ఇన్నింగ్స్, దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షో, హర్మన్ ప్రీత్‌కౌర్ కెప్టెన్సీ ఇలా అందరి సమిష్టి కృషే జగజ్జేతగా నిలిపింది. జట్టులోని చాలామంది దిగువ మధ్యతరగతివారే. శ్రీచరణి తండ్రి రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో చిన్న ఉద్యోగి. గ్రామీణ నేపథ్యం నుంచి కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్ ఎదిగారు. మూడేళ్ల వయసులోనే తండ్రిని కోల్పోయి, ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొన్న రేణుక, పోలీస్ కానిస్టేబుల్ కుమార్తె క్రాంతిగౌడ్, తన తండ్రి చెక్కిన బ్యాట్‌తో కెరీర్ మొదలు పెట్టిన అమన్‌జోత్ లాంటి వారంతా అనేక కష్టాలను ఎదురొడ్డి నిలిచిన వారే. ఇన్ని కష్టాల మధ్య కుటుంబ సభ్యులు, కోచ్‌లు లేదా ఇంకెవరైనా ప్రోత్సాహంతో రాణిస్తున్నారే తప్ప ప్రభుత్వ తోడ్పాటు, ప్రోత్సాహం కరువవుతున్నాయి. క్రీడలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు, క్రీడాకారులు రాణించడానికి కావలసిన ప్రోత్సాహం ప్రభుత్వాల నుంచి రావాలి. వారిని రంగం మీద నిలిపి గెలుపుగుర్రాలుగా మలచాలి.

# కెనడాలోనూ తిరోగమన చర్యలు

- భారతీయులకు తాత్కాలిక వీసాల రద్దు
- విద్యార్థులకు కూడా భారీగా కోత విధింపు



**న్యూఢిల్లీ, నవంబర్ 5:** భారతీయులకు జారీచేసిన తాత్కాలిక వీసాలను మూకుమ్మడిగా రద్దు చేయాలని కెనడా ప్రభుత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అమెరికా తరవాత అంతో ఇంతో ఆశగా ఉన్న కెనడాలో సైతం ఈ మధ్యజాత్యహంకారం పెరగింది. దీంతో పార్లమెంట్ ఆమోదం కోసం ఎదురుచూస్తున్న ఓ బిల్లు ప్రకారం కొవిడ్-19 వంటి మహమ్మారి లేదా యుద్ధ సమయాలలో విదేశీయులకు మంజూరు చేసే తాత్కాలిక వీసాలను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. అయితే కెనడా ప్రభుత్వం మాత్రం ప్రత్యేకించి కొన్ని దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ అధికారాలను ప్రయోగించాలని భావిస్తున్నట్లు సీబీసీ న్యూస్ వెల్లడించింది. విధానంలోని లోపాలను ఉపయోగించుకుని మోసపూరితంగా తాత్కాలిక వీసాలు పొందకుండా అడ్డుకునే అధికారాలను కూడా ఈ బిల్లులో పొందుపరచాలని కెనడా ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజెన్‌షిప్ కెనడా(ఐఆర్‌సీసీ), కెనడియన్ బార్డర్ సర్వీసెస్ ఏజెన్సీస్(సీబీఎస్‌ఏ) నివేదికలను ఉటంకిస్తూ సీబీసీ తెలిపింది. కెనడా ప్రభుత్వం ప్రత్యేకంగా భారత్, బంగ్లాదేశ్‌లను లక్ష్యంగా చేసుకుని ఈ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొంది. తాత్కాలిక నివాసులలో ఉద్యోగులు, అంతర్జాతీయ విద్యార్థులతోపాటు సందర్శకులు కూడా ఉంటారు. కెనడా సరిహద్దులను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంట్‌కు సమర్పించింది. సంబంధిత మంత్రికి అపారమైన అధికారాలను కట్టబెట్టే స్ట్రాం÷-రగ్ బార్డర్స్ బిల్లుకు లిబరల్ ప్రభుత్వం ఆమోదించిన పక్షంలో వీసా దరఖాస్తులు భారీ స్థాయిలో రద్దయ్యే అవకాశం ఉందని ఇమిగ్రేషన్ న్యాయవాది సుమిత్ సేన్ గతంలోనే ఆందోళన వ్యక్తం చేశారు. శాశ్వత, తాత్కాలిక వలసలకు అడ్డుకట్ట వేయాలని కెనడా ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో ఈ బిల్లు పార్లమెంట్ ఆమోదం కోసం వేచి ఉంది. కెనడా కళాశాలల్లో చదువుకునేందుకు పర్మిట్ల కోసం వచ్చిన భారతీయ దరఖాస్తులలో దాదాపు 74 శాతం దరఖాస్తులు ఈ ఏడాది ఆగస్టులో తిరస్కరణకు గురైనట్లు రాయిటర్స్ వెల్లడించింది. దశాబ్ద కాలంగా కెనడాలో చదివే అంతర్జాతీయ విద్యార్థులలో అత్యధికులు భారతీయులే ఉంటున్నారు. అయితే ఈ ఏడాది ఆగస్టులో వీసా దరఖాస్తుల తిరస్కరణకు గురైన విద్యార్థులలో కూడా భారతీయులే అత్యధికంగా ఉండడం గమనార్హం. 2023 ఆగస్టులో సుమారు 32 శాతం దరఖాస్తులు మాత్రమే తిరస్కరణకు గురయ్యాయి. కెనడా ప్రభుత్వం ఈ నెలలోనే తన ఇమిగ్రేషన్ ప్రణాళికను వెల్లడించనున్నది. దేశంలోకి విదేశీయుల ప్రవేశాన్ని తగ్గించాలని ప్రభుత్వంపై దేశీయంగా ఒత్తిడి పెరుగుతున్నది. జారీ అయిన తాత్కాలిక వీసాలను మూకుమ్మడిగా రద్దు చేసేందుకు ప్రభుత్వానికి అధికారాలు కట్టబెట్టే బిల్లుపై 300కి పైగా పౌర సంఘాలు తీవ్ర నిరసన తెలియచేశాయి. మూకుమ్మడిగా వీసాలను రద్దు చేయడం ద్వారా కెనడా ప్రభుత్వానికి దేశంలో ఉంటున్న విదేశీయులందరినీ ఇక్కడి నుంచి తరలించే అధికారాలు లభిస్తాయని ఆ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మూకుమ్మడిగా వీసాలను రద్దు చేసే అధికారాన్ని పొందడం ద్వారా ప్రభుత్వం పెరిగి పోతున్న పెండింగ్ వీసా దరఖాస్తుల సంఖ్యను తగ్గించాలని భావిస్తోందని ఇమిగ్రేషన్ న్యాయవాదులను ఉటంకిస్తూ బీబీసీ తెలిపింది. ఆశ్రయం కోరుతూ భారతీయులు సమర్పిస్తున్న దరఖాస్తులు భారీగా పెరిగిపోవడమే భారతీయులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకోవడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. 2023 మేలో కేవలం నెలకు 500 లోపలే ఈ దరఖాస్తుల సంఖ్య ఉండగా 2024 జూలైలో ఇది దాదాపు 2,000కి పెరిగిపోయింది. భారత్ నుంచి వచ్చే తాత్కాలిక వీసా దరఖాస్తులను తనిఖీ చేయడం వల్లే దరఖాస్తుల ప్రాసెసింగ్ కుంటుపడుతున్నట్లు ప్రభుత్వం భావిస్తోంది. 2023 జూలై చివరి నాటికి వీసా దరఖాస్తుల ప్రాసెసింగ్ సగటు సమయం 30 రోజులు ఉండగా మరుసటి సంవత్సరానికి అది 54 రోజులకు పెరిగింది. ఈ కారణంగా వీసా ఆమోదాలు 2024లోనే బాగా తగ్గిపోయాయి. జనవరిలో 63 వేల దరఖాస్తులను ఆమోదించగా జూన్‌లో అది 48 వేలకు పడిపోయింది.

# బీహార్‌లో ఎన్డీయే కూటమిదే విజయం

## మరోమారు ప్రజలు పట్టం కట్టబోతున్నారు

## ప్రజల్లో మార్పు గమనించానన్న మోడీ



**న్యూఢిల్లీ, నవంబర్ 5:** బిహార్‌లో గత ఇరవై ఏళ్లలో కనీవినీ ఎరగని విజయాన్ని ఎన్డీయే కూటమి ఈసారి సాధించబోతోందని, ఓటర్లు ఆ మేరకు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. మరోమారు ఎన్‌డిఎదే బీహార్ అని అన్నారు. ప్రజల్లో కనిపిస్తున్న మార్పునకు ఇది సంకేతం అన్నారు. 'ఆటవిక రాజ్య' నేతలు చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. బిహార్లో తాను ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నప్పుడు ప్రతిచోటా మునుపటి సభ కంటే భారీగా ప్రజలు వస్తున్నారని, ముఖ్యంగా మహిళలు పెద్దఎత్తున పాల్గొంటున్నారని చెప్పారు. బిహార్‌లో భాజపా-ఎన్డీయే మహిళా కార్యకర్తల్ని ఉద్దేశించి మంగళవారం ఆయన నమో యాప్ ద్వారా ప్రసంగించారు. 'మేరే బూత్.. సబ్‌సే మజ్‌బూత్' అనే సంకల్పంతో భాజపా మహిళా కార్యకర్తలు అమోఘమైన కృషి చేస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. బిహార్ ఎన్నికలను నేనెంతో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాను. అందువల్ల ఎన్డీయేదే గెలుపు అని ఖాయంగా చెప్పగలను. విజయంపై నాకెలాంటి సందేహం లేదు. పోలింగ్ మాత్రం ఇంకా పెరగాలని కోరుకుంటున్నాను. మహిళల సులభతర జీవనాన్ని మెరుగుపరడానికి, వారికి సాధికారత కల్పించడానికి ఎన్డీయే సర్కారు కట్టుబడి ఉంటుందని ఆయన చెప్పారు. ఎన్డీయే విజయం కోసం బిహార్ ప్రజలు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారని చెప్పిన ఓ మహిళతో మోదీ మాట్లాడుతూ- పేదలు, దళితులు, మహాదళితులు, బీసీలు, అత్యంత వెనుకబడిన వర్గాల్లోనూ ఇదే భావన ఉందని అన్నారు.

# యూపీలో పట్టాలు దాటుతుండగా ఘోరం

## రైలు ఢీకొని నలుగురు యాత్రికుల దుర్మరణం

**లక్నో, నవంబర్ 5:** ఉత్తరప్రదేశ్‌లో రైలు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. మిర్జాపుర్‌లో బుధవారం రైల్వే పట్టాలు దాటుతున్న యాత్రికులను ఓ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందినట్లు తెలుస్తోంది. కార్తిక పౌర్ణమి నేపథ్యంలో యాత్రికులు గంగానదిలో పవిత్ర స్నానాలు ఆచరించడానికి చోపాన్ ప్రాంతం నుంచి వారణాసికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. యాత్రికులు చోపాన్-ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ రైలులో చునార్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం వారు ప్లాట్‌ఫాం వైపు దిగకుండా మరోవైపు ఉన్న పట్టాలపై దిగారు. అక్కడి నుంచి ఎదురుగా ఉన్న ప్లాట్‌ఫాం పైకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ట్రాక్ పైకి వచ్చిన హౌరా-కల్కా నేతాజీ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొట్టింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు.






# తెలుగు రాష్ట్రాల్లో కార్తీక పౌర్ణమి సందడి

## నదీతీరాల్లో పుణ్యస్నానాలు ● ఆలయాల్లో శైవరాధన..కార్తీక దీపాల వెలిగింపు



**హైదరాబాద్/విజయవాడ,నవంబర్ 5:** తెలుగు రాష్ట్రాల్లో కార్తీకపౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామునే సముద్ర, నదీస్నానాలు ఆచరించారు. దగ్గరలోని ఆలయాలకు వెళ్లి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. గోదావరి, కృష్ణానదుల్లో స్నానం చేయడంతో పాటు, తీరప్రాంతాల్లో ఆలయాల్లో సందడి నెలకొంది. ఇకపోతే శివాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు జరిగాయి. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి, అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నదిలో వదిలారు. భక్తులు దానధర్మాలు, నదీ స్నానాలు చేసారు. వరంగల్ వేయిస్తంబాల దేవాలయం, కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, రామప్ప దేవాలయం, కురవి వీరభద్రస్వామి, పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ కొనసాగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు జరిగాయి. యాదాద్రి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో భక్తుల రద్దీ కనిపించింది. స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. శివనామస్మరణంతో శివాలయాలు మారుమోగాయి. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. సంగారెడ్డి సోమేశ్వర ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా భద్రాచలం వద్ద గోదావరి నదిలో భక్తుల పుణ్య స్నానాలు ఆచరించారు. కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేసారు. ధర్మపురి,బాసర, కాళేశ్వరంల వద్ద గోదావరి స్నానాలకు భక్తుల రద్దీ పెరిగింది. అనంతరం ఆలయాల్లో దీపారాధాన చేపట్టారు.








నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
గురువారం 6 నవంబర్ 2025
కరీంనగర్



# కార్తీక పున్నమి వేళలో

## శోభాయమానంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

### గోదావరిలో పవిత్ర స్నానాలు • తులసి కోటల ముందు ఉసిరి దీపాలతో పూజలు

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)**

'శివ-కేశవులకు' ప్రీతిపాత్రమైన 'కార్తీక పౌర్ణమి' వేడుకలు బుధవారం భక్తి, శ్రద్ధలతో శోభాయమానంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు గోదావరి తీరాలకు చేరుకుని పవిత్ర స్నానాలు ఆచరించారు. 'గోవిందా... గోవిందా... ఓం నమశ్శివాయ' నినాదాలతో వాతావరణం మార్మోగిపోయింది. వయోభారాన్ని మరిచి స్త్రీ, పురుషులు, చిన్నారులు గోదావరి జలాల్లో స్నానం చేసి భగవంతునికి దీపాలు సమర్పించారు. పండితుల నేతృత్వంలో గంగా పూజలు, స్నానదానం, పంచాంగ పఠనాలు నిర్వహించారు.

### గోదావరి ఘాట్లలో భక్తజనాల తాకిడి

జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్, ధర్మపురి గోదావరి నదీతీర ప్రాంతాలతో పాటు మెట్ పల్లి, కోరుట్ల, జగిత్యాల పట్టణాల్లోని ఆలయాల్లో దర్శనాల కోసం మహిళా భక్తులు తరలివచ్చారు. కుటుంబ సభ్యులతో, బంధువులతో కలిసి స్నానమాచరించిన భక్తులు గోదావరి తీరం వద్ద దీపదానం చేశారు.'కార్తీక పున్నమి'రోజు స్నానం చేస్తే యుగయుగాల పుణ్యం లభిస్తుంద'నే విశ్వాసంతో వందలాది మంది గోదావరిలో పాపక్షాళనం చేసుకున్నారు.

### తులసి కోటల ముందు ఉసిరి దీపాల శోభ

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటి ముందు తులసి కోటల వద్ద మహిళలు ఉసిరి దీపాలను వెలిగించారు. సాయంత్రం వేళ ఉసిరి దీపాలతో ప్రకాశవంతమైన తులసి కోటలు కనువిందు చేశాయి. సాంప్రదాయ పద్ధతిలో మహిళలు పసుపు, కుంకుమ, చందనం తో తులసి పూజలు నిర్వహించి కుటుంబ శాంతి, సుఖసమృద్ధి కోసం ప్రార్థించారు. భక్తి గీతాలు, హరికథలు, భజనలతో వాతావరణం భక్తిరసమయంగా మారింది.

### దివ్య కాంతులతో దేవాలయాలు..

మెట్‌పల్లి, కోరుట్ల,జగిత్యాల పట్టణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, రాజరాజేశ్వరస్వామి, హనుమాన్ దేవాలయంతో పాటు పలు శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. ఆలయాల పరిసరాల్లో వేలాది దీపాలు వెలిగించడంతో పట్టణాలు మొత్తం కాంతుల సముద్రంలా మారింది. రాత్రంతా జ్యోతిర్లింగ భజనలు, దీపారాధనలు, సత్సంగాలు కొనసాగాయి.

### సామాజిక సేవలతో మరింత విశిష్టం

పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీలు, స్థానిక సేవా సంస్థలు అన్నదానం నిర్వహించాయి. కొంతమంది యువత సంఘాలు భక్తులకు తాగునీరు,



వైద్య సహాయం, పుణ్యస్నానానికి సదుపాయాలు కల్పించాయి. అధికారులు ఘాట్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు.

### భక్తి, ప్రకృతి, సంస్కృతి సమ్మేళనం

గోదావరి తీర స్నానాలు, తులసి పూజలు, దీపదానాలతో ఈ కార్తీక పౌర్ణమి భక్తి, ప్రకృతి, సంస్కృతి కలయికగా నిలిచింది. పౌర్ణమి చంద్రుడు ఆకాశంలో మెరిసిపోతుండగా దీపాల కాంతి భూమిని భాసిల్లజేసింది. భక్తులు 'దీపం వెలిగించడం అంటే మన అంతరంగాన్ని వెలిగించడం' అంటూ ఆధ్యాత్మిక సందేశంతో 'కార్తీక పౌర్ణమి'ని ఘనంగా జరుపుకున్నారు.















నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా...


# విద్యార్థుల ఆత్మహత్యాయత్నం కేసుపై ఉత్కంఠ!

- మైనర్ విద్యార్థులకు గడ్డి మందు విక్రయంపై ఆరా
- జమ్మికుంట ఫెర్టిలైజర్ దుకాణదారులపై అధికారుల ఫైర్
- చర్చనీయాంశంగా మారిన విద్యార్థుల ఘటన
- విద్యార్థులకు గడ్డి మందు విక్రయంపై కలెక్టర్ సీరియస్





**నేటి సాక్షి, జమ్మికుంట :** జమ్మికుంట పట్టణంలోని స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరిగిన ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య ఘటనపై సీరియస్ విచారణ కొనసాగుతోంది. వీణవంక మండలానికి చెందిన చరణ్ కుమార్, రాంచరణ్ తొమ్మిదో తరగతి చదువుతూ హాస్టల్ లో ఉంటున్నారు. వీరితో పాటు హాస్టల్లో ఉంటున్న మరో విద్యార్థి కలిసి ఆదివారం రాత్రి రహస్యంగా సిగరెట్ తాగుతున్నట్లు గమనించిన వార్డెన్ సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ సమాచారం అందించడంతో ప్రిన్సిపాల్ ముగ్గురుని మందలించి వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా విషయం ఇంట్లో తెలుస్తుందేమోనన్న భయంతో చరణ్ కుమార్, రాంచరణ్ జమ్మికుంటలోని ఓ ఫెర్టిలైజర్ షాపులో గడ్డి మందు విక్రయంచి సోమవారం రాత్రి తాగడంతో గమనించిన హాస్టల్ సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టగా విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు.

## విద్యార్థులకు గడ్డి మందు ఎక్కడిది?

ఎస్వీ పాఠశాలలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన చరణ్ కుమార్, రాంచరణ్‌కు అసలు విషపూరిత గడ్డి మందు ఎలా వచ్చింది అనే అంశంపై సీరియస్ విచారణ కొనసాగుతోంది. చికిత్స పొందుతున్న విద్యార్థులు పట్టణంలోని ఓ ఫెర్టిలైజర్ దుకాణంలో గడ్డి మందు కొనుగోలు చేసినట్లు స్టేట్మెంట్ ఇవ్వడంతో అధికారులు ఆ దిశగా విచారణ చేపట్టారు. మైనర్ విద్యార్థులకు గడ్డి మందు ఎలా విక్రయించారంటూ ఆరా తీస్తున్నారు. ఇదిలా ఉంటే అసలు విద్యార్థులు బయటకు ఎలా వెళ్లారు అనే కోణంలో విచారణ జరుగుతుంది. విద్యార్థులు స్వయంగా గడ్డి మందు కొనుగోలు చేశారా.. ఎవరైనా ఇచ్చారు? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఒకవేళ స్వయంగా కొనుగోలు చేసినా.. మైనర్ విద్యార్థులకు ఎలా విషపూరిత మందులు ఇస్తారు అనే అంశంపై వ్యవసాయ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అంతేకాకుండా హాస్టల్ నుండి బయటకి ఎలా వెళ్లారు అనే అంశంపై పోలీసులు, అధికారులు విచారణ చేపడుతున్నారు. విద్యార్థుల ఆత్మహత్యాయత్నం ఘటనపై జిల్లా కలెక్టర్ సీరియస్ గా ఉన్నట్లు తెలిసింది. గురువారం కలెక్టర్ జమ్మికుంటకు రానున్నట్లు సమాచారం. ఏదీ ఏమ్కెనా విద్యార్థుల ఆత్మహత్యాయత్నం ఘటన జమ్మికుంటలో చర్చనీయాంశంగా మారింది.



# జూబ్లీహిల్స్‌లో బీజేపీదే విజయం

## బీజేపీ సీనియర్ నాయకులు చింతల రామచంద్రారెడ్డి

**నేటి సాక్షి, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ఉపఎన్నికల్లో ప్రజలు నిజమైన మార్పునకు ఓటేస్తారని, బీజేపీ విజయం ఖాయమని, కమలం వికసిస్తుందని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ బీజేపీ సీనియర్ నాయకులు చింతల రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం సోమజిగూడ ప్రెస్ క్లబ్‌లో బీజేపీ, జనసేన పార్టీల నాయకులు సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ జనసేన పార్టీ ఇన్‌చార్జి శంకర్ గౌడ్ తో కలిసి చింతల రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఎన్డీఏలో జనసేన పార్టీ చాన్నాళ్లుగా కొనసాగుతోందని, ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఉప ముఖ్యమంత్రిగా సేవలు అందిస్తున్నారని చింతల పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు పలకాలని తెలంగాణ జనసేన కార్యకర్తలను కోరగా, వారి నాయకుడి ఆదేశాల మేరకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డితోనూ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావుతో సమావేశమై జనసేన పార్టీ నేతలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జనసేన మద్దతుతో బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్ విజయం సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలపై చింతల రామచంద్రారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎప్పుడూ మతోన్మాద మజ్లిస్ (ఎంఐఎం) పార్టీతో చెట్టాపట్టాలేసుకుంటాయని విమర్శించారు. తెలంగాణ వద్దన్న, రాయలసీమ కలిపితేనే తెలంగాణ ఇవ్వాలన్న ఎంఐఎం ఒక మతోన్మాద పార్టీ అని ఆరోపించారు. ఏఐఎంఐఎం ఎప్పుడూ అధికారంలో ఉన్న వారి పాటే పాడుతుందని, సమాజం ఏమైనా ఫరవాలేదు కానీ మా మతం పెరగాలి, మా మత రాజకీయాలు కొనసాగాలి అనుకుంటుందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అప్పట్లో కాసు బ్రహ్మానందరెడ్డితో కుమ్మక్కై తెలంగాణ ఉద్యమాన్ని అడ్డుకునేందుకు మజ్లిస్ సహకరించి ఉద్యమకారుల ప్రాణాలు తీసిందనేది నిజం కాదా? అని ప్రశ్నించారు. తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, ఏ మతానికి కులానికి వ్యతిరేకం కాదని బీజేపీ స్పష్టం చేసిందని, మతాలను, కులాలను రెచ్చగొట్టేది బీజేపీ కాదని, మిగిలిన పార్టీలన్నీ అవే చేస్తాయని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ స్వచ్ఛమైన రాజకీయాలు, అభివృద్ధి ఆధారిత రాజకీయాలకు అంకితభావంతో పనిచేస్తోందని తెలిపారు. బీజేపీ శక్తి క్రమశిక్షణ, ప్రజల నమ్మకం, అభివృద్ధి పట్ల అంకితభావం అని అన్నారు. ఈ ఉపఎన్నికల్లో ప్రజలు నిజమైన మార్పునకు ఓటేస్తారని, జూబ్లీహిల్స్‌లో భారతీయ జనతా పార్టీ విజయం ఖాయమని, కమలం వికసిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# షరతుల్లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

## బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ



**నేటి సాక్షి, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఐకేపీ కేంద్రాల్లో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని షరతుల్లేకుండా కొనుగోలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ ఆధ్వర్యం లో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ మాట్లాడుతూ వ్యవసాయానికి వాతావరణం అనుకూలించక రైతన్నలు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఒకవైపు ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో నిలిచిపోయిన ధాన్యం సేకరణ, మరోవైపు మొలకెత్తిన ధాన్యంతో మొర పెట్టుకుంటున్న రైతుల గోస ప్రభుత్వానికి పట్టడం లేదని మండిపడ్డారు. మ్యాచర్ పేరిట రైతులు ఐకేపీ సెంటర్లలో పడరాని పాట్లు పడుతుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మాత్రం జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో మునిగిపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు కళ్లు తెరిచి ఎలాంటి నిబంధనలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, పట్టణాధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, వివిధ మండలాల అధ్యక్షులు బూర శేఖర్, మిరియాల్ కార్ బాలాజీ, సొల్ల క్రాంతి కుమార్, రేపాక రామచంద్రం, పరమేశ్, మొకిలి విజేందర్, కోడె రమేశ్, లక్పతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కుటుంబాన్ని ఆదుకుంటాం

## ప్రమాద బాధితులతో సిఎంను కలుస్తా

## పరిహారం చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే

**నేటి సాక్షి, తాండూరు:** బస్సు ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి హామీ ఇచ్చారు. త్వరలోనే బాధితులతో సీఎం రేవంత్‌ను కలిసి చర్చిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.7 లక్షల చొప్పున మొత్తం రూ. 42 లక్షలు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ వారి గ్రామాలకు వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు. చేవెళ్ల మండలం మీర్జాపూర్ వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే చెక్కులను అందించారు. యాలాల మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన కురుగుంట లక్ష్మి, బందెప్ప దంపతులు, లక్ష్మీనారాయణ పురం గ్రామానికి చెందిన విద్యార్థిని అఖిలారెడ్డి, పేర్ కంపల్లి గ్రామానికి చెందిన సాయి ప్రియ, నందిని, తనూష ప్రమాదంలో మరణించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హాజీపూర్ గ్రామానికి చెందిన కురుగుంట బందప్ప, లక్ష్మి దంపతులు అక్కడికక్కడే మరణించారు. వాళ్ల పిల్లలు శివలీల, భవానీ అనాథలు కావడంతో వారికి తన సొంత డబ్బులతో ఇల్లు కట్టిస్తానని, వారి పూర్తి బాధ్యతను ప్రభుత్వమే చూసుకుంటుందన్నారు. త్వరలోనే వారిని సీఎం రేవంత్ రెడ్డి దగ్గరికి తీసుకెళ్తానని చెప్పారు. లక్ష్మీనారాయణపూర్, పేరుకంపల్లిలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను ఆర్థిక సహాయం చేయడంతో పాటు, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీలత ఉన్నారు.



హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రగడ్డ డివిజన్‌లో బుధవారం జరిగిన గురునానక్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'సర్వ మత సౌహార్దం, సేవాభావం, సమానత్వం వంటి విలువలను బోధించిన శ్రీ గురు నానక్ దేవ్ జీ ఉపదేశాలు ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలుస్తాయని, గురు నానక్ జీ బోధనలు సమాజం అభివృద్ధికి మార్గదర్శకాలు' అని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

\- నేటి సాక్షి, వేములవాడ



# వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

## హాజరైన బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనరసింహా రావు

**నేటి సాక్షి, చందుర్తి:** కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని చందుర్తి మండలం రామన్నపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో వెలిసిన శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ వేంకటేశ్వరుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలు, శాంతి సౌభాగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ చందుర్తి మండల శాఖ అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, కేడీసీసీ డైరెక్టర్ జలగం కిషన్ రావు, తిప్పని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిలక పెంటయ్య, మాజీ సర్పంచ్ దుమ్మ ఆనంద్ నాయకులు ఆయిల్నేని కమలాకర్ రావు, వీర్లపల్లి రాజు, ఎండీ ఇస్మాయిల్, బైరగోని రమేశ్, రాపల్లి గంగాధర్, పెగ్గర్ల రమేశ్ రావు, మాదాసు ప్రసాద్, పోతరాజు నగేశ్, తిప్పని అజయ్, పోతరాజు తిరుపతి, గుడిసె రమేశ్, ఏరెడ్డి రాజిరెడ్డి, లింగాల మల్లయ్య, సిరికొండ మల్లయ్య, మార్త గంగాధర్, రాజూరి రవీందర్, కపిల శంకర్ తదితరులు పాల్గొన్నారు.





# రాజన్న నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

**నేటి సాక్షి, వేములవాడ:** హైదరాబాద్ వాస్తవ్యులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కోశాధికారి ముత్యాల సత్యనారాయణ గౌడ్, మాలతి దంపతులు కుటుంబ సమేతంగా బుధవారం శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1 లక్ష విరాళం అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు సంజీవ్ కుమార్‌కు ఈ విరాళాన్ని అందజేశారు. వీరి వెంట సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలుగా..
గురువారం 6 నవంబర్ 2025 కరీంనగర్


# తిరిగి టీంలోకి రిషబ్ పంత్



## దక్షిణాఫ్రికాతో టెస్ట్ జట్టు ప్రకటన

దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ సిరీస్ కోసం టీమ్ ఇండియాను ప్రకటించింది. రిషబ్ పంత్ తిరిగి జట్టుకు వైస్ కెప్టెన్‌గా వచ్చాడు. 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్‌లో భారత్ ఆడుతున్న మూడో టెస్ట్ సిరీస్ ఇది. బుధవారం నాడు ప్రెస్ రిలీజ్ విడుదల చేస్తూ బీసీసీఐ జట్టును ప్రకటించింది. నేషనల్ టీమ్‌తో పాటు, బోర్డు దక్షిణాఫ్రికా 'ఎ'తో 3 వన్డే మ్యాచ్‌ల సిరీస్ కోసం ఇండియా 'ఎ' జట్టును కూడా ప్రకటించింది. దీనికి తిలక్ వర్మ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఇంగ్లాండ్ పర్యటనలో నాల్గో టెస్ట్‌లో పంత్‌కు గాయమైంది, ఇందులో అతని కాలి వేలికి ఫ్రాక్చర్ అయింది. ఆ తర్వాత అతను ఆసియా కప్, వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్ ఆస్ట్రేలియా పర్యటనలకు దూరమయ్యాడు. 100 రోజులకు పైగా తర్వాత అతను తిరిగి వచ్చాడు. ఆకాష్ దీప్ కూడా జట్టులోకి తిరిగి వచ్చాడు. పంత్ రాకతో ఎన్ జగదీశన్ జట్టు నుంచి బయటకు వెళ్లవలసి వచ్చింది. ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో ఆకాష్ దీప్ వచ్చాడు.

**దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ కోసం భారత్ జట్టు**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వికెట్ కీపర్, వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, ఆకాష్ దీప్.

# అభిషేక్, గిల్‌పై యువరాజ్‌సింగ్ ఫైర్




అభిషేక్ శర్మ, శుభ్‌మాన్ గిల్ భారత క్రికెట్ భవిష్యత్తుగా మారిపోయారు. ఈ ఇద్దరు ఆటగాళ్లకు చాలా సారూప్యతలు ఉన్నాయి. ఒకటి వీరిద్దరు చిన్ననాటి స్నేహితులు కాగా, దాదాపు 13-14 సంవత్సరాల వయస్సు నుంచే కలిసి క్రికెట్ ఆడుతున్నారు. స్నేహితులుగా ఉండటమే కాదు, ఇద్దరు ఒకే గురువు దగ్గర చిట్కాలు నేర్చుకున్నారు. వీరి గురువు యువరాజ్ సింగ్. అయితే, తాజాగా వీరికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. ఆస్ట్రేలియా నుంచి వచ్చిన తన ఇద్దరు శిష్యుల ఫొటోలను చూసిన యువరాజ్ సింగ్ కోపంగా ఉన్నాడు. భారత జట్టు ప్రస్తుతం టీ20 సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రస్తుతం 1-1తో సమంగా ఉంది. నాల్గవ టీ20 నవంబర్ 6న గోల్డ్ కోస్ట్‌లో జరగనుంది. కానీ దానికి ముందు, అభిషేక్, శుభ్‌మాన్ సముద్రాన్ని ఆస్వాదించడానికి గోల్డ్ కోస్ట్‌కు వెళ్లారు. వారు బీచ్‌లో సరదాగా గడపడమే కాకుండా సముద్రంలోకి చొక్కా లేకుండా కూడా వెళ్లారు. అభిషేక్ శర్మ శుభ్‌మాన్ గిల్‌తో బీచ్‌లో సరదాగా గడిపిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినప్పుడు, యువరాజ్ సింగ్ కోపంగా ఉన్నాడు. అభిషేక్ పోస్ట్‌పై వ్యాఖ్యానిస్తూ, అతను పంజాబీలో "జుటి లావన్ దోనా దే" అని రాసుకొచ్చాడు. అంటే, "నేను మీ ఇద్దరినీ నా బూట్లతో కొడతాను" అంటూ ఫైర్ అయ్యాడు. యువరాజ్ సింగ్ తన శిష్యులను సరదాగా షూలతో కొడతానంటూ కామెంట్ చేశాడు. అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఇద్దరూ జట్టులో స్టార్ బ్యాటర్స్. ఆస్ట్రేలియాతో జరిగిన టీ20 సిరీస్‌లో ఇన్నింగ్స్‌ను ప్రారంభించే బాధ్యత వారిపై ఉంది. సిరీస్‌లోని మొదటి మూడు టీ20లలో, అభిషేక్ శర్మ ఒక మ్యాచ్‌లో అర్ధ సెంచరీ సాధించాడు. మరోవైపు శుభ్‌మన్ గిల్ అంతగా రాణించలేదు. టీ20 సిరీస్ గెలవాలంటే భారత్ చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ గెలవాలి. ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టుకు కూడా ఇదే లక్ష్యం అవుతుంది. ఒక గురువుగా, యువరాజ్ సింగ్ కూడా తన శిష్యుడు సరదాగా గడపాలని కోరుకుంటాడు. కానీ అతను గతంలో ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిచినట్లుగానే, భారత జట్టు తరపున సిరీస్ విజయంతో తిరిగి రావాలని కోరుకుంటున్నాడు.

# హారిస్ రౌఫ్ మూల్యాన్ని చెల్లించుకున్నాడు

సెప్టెంబర్ లో జరిగిన ఆసియా కప్ సమయంలో క్రికెట్ ప్రతిష్టకు భంగం కలిగించినందుకు ఐసీసీ చర్యలు చేపట్టింది. భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, పాకిస్తాన్ ఫాస్ట్ బౌలర్ హారిస్ రౌఫ్ లపై ఐసీసీ చర్యలు తీసుకుంది. ఆసియా కప్ టోర్నమెంట్ సమయంలో 4 డీమెరిట్ పాయింట్లు రావడంతో హారిస్ రౌఫ్‌ను 2 వన్డే మ్యాచ్‌ల నుండి సస్పెండ్ చేసినట్లు ప్రకటించింది. పాక్ పేసర్ రౌఫ్ కు భారత్ తో జరిగిన 2 వేర్వేరు ఘటనలకుగాను 30-30 శాతం జరిమానా విధించారు. దీనితో పాటు దక్షిణాఫ్రికాతో మంగళవారం ప్రారంభమైన వన్డే సిరీస్ లో 2 మ్యాచ్ ల నుండి హారిస్ రౌఫ్‌ను నిషేధించారు. నవంబర్ 6న జరిగే రెండో మ్యాచ్ లో కూడా అతను ఆడేందుకు అవకాశం లేదు. హారిస్ రౌఫ్ కు ఈ 2 ఘటనలకు గాను నాలుగు డీమెరిట్ పాయింట్లు వచ్చాయి. వీటిని ఐసీసీ నిబంధనల ప్రకారం 2 సస్పెన్షన్ పాయింట్లుగా మార్చింది. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ పై మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించింది ఐసీసీ. సూర్య సైతం క్రీడల ప్రతిష్టకు భంగం కలిగించినట్లు భావించింది. భారత కెప్టెన్ పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు సంఘీభావం తెలుపుతూ భారత సాయుధ దళాలకు మద్దతు ఇచ్చాడు. జస్ప్రీత్ బుమ్రాపై కూడా ఒక డీమెరిట్ పాయింట్ విధించారు. ఎందుకంటే పాక్‌తో జరిగిన ఫైనల్లో రౌఫ్ ను ఔట్ చేసిన తర్వాత అతను 'విమానం కూలిపోయింది' అని సైగ చేశాడు. సూర్యకుమార్ చేసిన వ్యాఖ్యలపై 30 శాతం జరిమానా విధించింది. ఈ వార్తను మొదట సెప్టెంబర్ 26న పిటిఐ రిపోర్ట్ చేసింది. సెప్టెంబర్ 14న జరిగిన మ్యాచ్ లో విమానం కూలిపోవడాన్ని సూచించే అభ్యంతరకరమైన సంజ్ఞలు చేసినందుకు హారిస్ రౌఫ్ తప్పు చేసినట్లు ఐసీసీ తేల్చింది. రౌఫ్ ఆపరేషన్ సింధూర్ లో భారత సైనిక చర్యను ఎగతాళి చేశాడు. ఈ ఘర్షణలో 6 భారత యుద్ధ విమానాలను కూల్చివేసినట్లు పాకిస్తాన్ చేసిన వాదనకు మద్దతు తెలిపాడు.




సెప్టెంబర్ 28న బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు భారత అభిమానులను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తూ, రౌఫ్ అదే సంజ్ఞను మరోసారి చేశాడు. పాకిస్తాన్ బ్యాటర్ సాహిబ్జాదా ఫర్హాన్ కు కూడా ఒక డీమెరిట్ పాయింట్ ఇచ్చారు. భారత ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్ ను ఎలాంటి జరిమానా లేదా డీమెరిట్ పాయింట్ విధించలేదు. ఫర్హాన్ భారత్ పై హాఫ్ సెంచరీ చేసిన తర్వాత బ్యాట్ తో తుపాకీని కాల్చినట్లు సంజ్ఞ చేస్తూ సంబరాలు చేసుకున్నాడు. సెప్టెంబర్ 14, 2025న 'సూర్యకుమార్ యాదవ్ (భారత్) ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని నిబంధన 2.21 ను ఉల్లంఘించాడు. ఇది క్రీడల ప్రతిష్టకు భంగం కలిగించే ప్రవర్తనకు సంబంధించినది. సూర్య మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధిస్తున్నాం. 2 డీమెరిట్ పాయింట్లు ఇస్తున్నామని' ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. దీని ప్రకారం 'సాహిబ్జాదా ఫర్హాన్ (పాకిస్తాన్) కూడా ఇదే తప్పిదానికి పాల్పడినట్లు తేలింది. అతనికి ఒక డీమెరిట్ పాయింట్ విధించాం' అని పేర్కొంది. 'హారిస్ రౌఫ్ (పాకిస్తాన్) కూడా ఇదే తప్పిదానికి పాల్పడినట్లు తేలింది. రౌఫ్ మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించాం. ఫలితంగా అతనికి 2 డీమెరిట్ పాయింట్లు వచ్చాయని' ఐసీసీ పేర్కొంది. అర్షదీప్ విషయం సోషల్ మీడియా క్లిప్ నకు సంబంధించినది. అతను పాకిస్తాన్ అభిమానులను ఎగతాళి చేస్తూ కనిపించాడు. అయితే ఐసీసీ మ్యాచ్ రిఫరీకి ఇది అభ్యంతరకరంగా అనిపించలేదు. సెప్టెంబర్ 21న భారత్, పాకిస్తాన్ సూపర్ 4 మ్యాచ్ కు సంబంధించినది. సెప్టెంబర్ 28న జరిగిన ఫైనల్ లో చేసిన చర్యలకు విధించిన ఆంక్షలపై ఐసీసీ ఇలా స్పందించింది. 'జస్ప్రీత్ బుమ్రా (భారత్) క్రీడల ప్రతిష్టకు భంగం కలిగించే ప్రవర్తనకు సంబంధించిన నిబంధన 2.21 కింద మోపబడిన ఆరోపణను, ప్రతిపాదిత అధికారిక హెచ్చరికను అంగీకరించాడు. ఫలితంగా అతనికి ఒక డీమెరిట్ పాయింట్ విధించాం' అని తెలిపింది. మునుపటి విచారణ సమయంలో తనను తాను నిర్దోషిగా చెప్పుకున్న రౌఫ్, భారత ప్రేక్షకులకు మళ్లీ అభ్యంతరకరమైన సంజ్ఞలు చేస్తూ కనిపించాడు. 'ఐసీసీ మ్యాచ్ రిఫరీ రిచీ రిచర్డ్సన్ నిర్వహించిన విచారణ తర్వాత హారిస్ రౌఫ్ (పాకిస్తాన్) మళ్లీ నిబంధన 2.21 ను ఉల్లంఘించాడని తేలింది. అతనికి మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధించగంతో పాటు 2 అదనపు డీమెరిట్ పాయింట్లు వచ్చాయని' తెలిపింది.



## ట్రోఫీని టాటూ వేయించుకున్న హర్మన్

ఇండియా ఉమెన్స్ టీమ్ మొదటిసారి వన్డే ప్రపంచకప్‌ను ముద్దాడింది. నవంబర్ 2న నవీ ముంబై వేదికగా జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్ 2025 ఫైనల్ మ్యాచ్‌లో.. దక్షిణాఫ్రికాను ఓడించి హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలోని టీమిండియా విశ్వ విజేతగా నిలిచింది. దీంతో సర్వత్రా భారత్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. అయితే ఈ గెలుపును ఎప్పటికి గుర్తుంచుకునేలా.. టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ఓ నిర్ణయం తీసుకుంది. ప్రపంచకప్ ట్రోఫీని టాటూగా తన చేయిపై వేయించుకున్నవిషయాన్ని.. సోషల్ మీడియా వేదికగా తన ఫ్యాన్స్‌తో పంచుకుంది. వరల్డ్ కప్ ట్రోఫీతో పాటు గెలిచిన సంవత్సరం (2025), ఎన్ని పరుగుల తేడాతో (52 పరుగుల) గెలిచిందనే విషయాలు తెలియజేసేలా నెంబర్స్ టాటూలో ఉన్నాయి. నా చర్మంలో, నా మనసులో ఎప్పటికీ చెక్కు చెదరదు. ఫస్ట్ డే నుంచి నీ కోసం వేచి చూస్తున్నాను. ఇక ఇప్పుడు ప్రతి రోజు లేవగానే మార్నింగ్ నిన్ను చూస్తూ ఉంటానంటూ.. టాటూను పంచుకుంటూ హర్మన్ క్యాప్షన్ పెట్టింది. ప్రస్తుతం ఈ కెప్టెన్ షేర్ చేసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ మెగాటోర్నీలో హర్మన్ అటు బ్యాటర్‌గా, ఇటు కెప్టెన్‌గా అద్భుతంగా రాణించింది. ముఖ్యంగా ఫైనల్ మ్యాచ్‌లో కీలకమైన సమయంలో ప్రత్యర్థి జట్టును ఆశ్చర్యానికి గురిచేస్తూ.. ఓపెనర్ షెఫాలీ వర్మకు బంతిని ఇచ్చింది. హర్మన్ తీసుకున్న ఈ నిర్ణయం భారత్‌కు బాగా కలిసి వచ్చింది. ఇక కెప్టెన్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. షెఫాలీ వర్మ కూడా వరుస ఓవర్లలో రెండు వికెట్లు తీసి మ్యాచ్‌లో భారత్ పుంజుకునేలా చేసింది. హర్మన్ ఈ టోర్నీలో 8 ఇన్నింగ్స్‌ల్లో 32.50 సగటు 89.4 స్ట్రైక్‌రేట్‌తో 260 పరుగులు చేసింది.

## సమష్టి ప్రదర్శనతోనే చిరస్మరణీయ విజయం

### మహిళల విజయంపై ఐసీసీ ఛైర్మన్ జై షా



మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో టీమిండియా విజేతగా నిలిచింది. అద్వితీయమైన ప్రదర్శనతో అర్ధశతాబ్దపు కలను సాకారం చేసుకుంది. 2005, 2017 ఫైనల్లో తృటిలో టైటిల్ చేజారగా.. ఈసారి మాత్రం భారత మహిళల జట్టు ఏ తప్పు చేయలేదు. ఒత్తిడిని చిరునవ్వుతో ఛేదిస్తూ తొలిసారి ఫైనల్ చేరిన సౌతాఫ్రికాను మట్టికరిపించింది. 1983 ప్రపంచకప్‌లో కపిల్ సేన సాధించిన విజయం భారత క్రికెట్ గతిని మార్చినట్టే.. హర్మన్ సేన సాధించిన తాజా విజయం మహిళల క్రికెట్‌ను మరో మెట్టిక్కించనుంది. ఫైనల్లో షెఫాలీ వర్మ, దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షోతో పాటు అమన్‌జోత్ కౌర్ మ్యాచ్ విన్నింగ్ క్యాచ్ టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్నందించాయి. తెలుగు తేజం శ్రీచరణి టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శన కనబర్చగా.. ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీకా రావల్‌తో బ్యాట్‌తో సత్తా చాటారు. ఈ విజయం నేపథ్యంలో భారత మహిళా క్రికెటర్లపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. తాజాగా భారత మహిళల విజయంపై స్పందించిన ఐసీసీ ఛైర్మన్ జై షా.. సమష్టి ప్రదర్శనతోనే ఈ చిరస్మరణీయ విజయం దక్కిందని చెప్పాడు. 'నాకు మహిళల క్రికెట్ అంటే చాలా ఇష్టం. భారత మహిళల జట్టు ఐసీసీ ట్రోఫీని నెగ్గడం సంతోషంగా ఉంది. ఇలాంటి విజయం, మహిళల క్రికెట్ అభివృద్ధి కావడం వంటి పరిణామాలన్నీ మన కళ్ల ముందే కార్యరూపం దాల్చాయి. అందుకోసం ప్రత్యక్షంగా, తెర వెనుక పనిచేస్తోన్న కష్టానికి ఇదే నిదర్శనం.'అని జైషా పేర్కొన్నాడు.

## ఉత్కంఠ భరితంగా తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలు





హైదరాబాద్, క్రీడా ప్రతినిధి, నవంబర్ 5: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న "తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్-2025" బ్యాడ్మింటన్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. వివిధ దేశాల నుండి అగ్రశ్రేణి షట్లర్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో మెయిన్ డ్రా మ్యాచ్‌లు బుధవారం క్రీడాభిమానులను ఆకట్టుకుంటున్నాయి. రాజకీయ నేతలు, క్రీడా ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆటగాళ్లను ఉత్సాహపరుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా ప్రోత్సాహక విధానాల ఫలితంగా హైదరాబాద్ అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా అవతరిస్తోందని బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రముఖులు పేర్కొన్నారు. పురుషుల, మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో భారత్ తో పాటు ఇతర దేశాల క్రీడాకారుల మధ్య పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి.






# పెద్దిలో చికిరి చికిరి స్టెప్పులు



రామ్ చరణ్ బుచ్చిబాబు సానా కాంబోలో వస్తున్న పెద్ది సినిమాపై ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. జాన్వీ కథానాయిక కాగా ఆస్కార్ విన్నర్ రెహామాన్ సంగీతం అందిస్తున్నాడు. అయితే.. ఈ సినిమా నుంచి అప్డేట్ ఎప్పుడు వస్తుందా అని మెగా అభిమానులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ షాట్ వీడియో ప్రపంచ వ్యాప్తంగా తెగ వైరల్ అయింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శర వేగంగా జరుగుతుండగా ఇటీవలే శ్రీలంకలో ఓ పాట సైతం చిత్రీకరణ పూర్తి చేసుకుని టీం తిరిగి వచ్చింది. వచ్చే మార్చిలో ఈ మూవీ ప్రేక్షకులకు ఎదుటకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ చిత్రం నుంచి ఒక్కొక్కటిగా అప్డేట్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఈ సినిమా నుంచి పాట రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించిన డైరెక్టర్ బుచ్చి బాబు సానా పాటకు సంబంధించి బుధవారం చిన్న గ్లిమ్స్ రిలీజ్ చేసి నవంబర్ 7, శుక్రవారం రోజున పూర్తి పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం బుచ్చిబాబు ఏకంగా ఈ సినిమా సంగీత దర్శకుడు రెహామాన్ నే రంగంలోకి దింపాడు. ఆయనతో తన ఫస్ట్ ఇంటరాక్షన్ గురించి వివరించి చివరకు ఈ సినిమా సాంగ్ సిట్యూవేషన్ చెప్పి ఓ ట్యూన్ అడగడం అయన వెంటనే చికిరి చికిరి అంటూ ఓ ట్యూన్ ఇవ్వడం అంతా చకచకా జరిగిపోయినట్లు చూపించారు. చివర్లో పాట ట్యూన్‌కు తగ్గట్టు రామ్‌చరణ్ వేసిన స్టెప్స్ ను సైతం చూపించి ఒక్క సారిగా పాటపై హైప్ పెంచేశారు. ఈ వీడియో బయటకు వచ్చిన క్షణాల్లోనే రామ్ చరణ్ హుక్ స్టెప్ సోషల్ మీడియాను కమ్మేపింది. రామ్ చరణ్ , మెగా అభిమానులే కాక చాలామంది నెటిజన్లు సైతం ఈ వీడియోకు, ఆ స్టెప్పులకు ఫిదా అవుతున్నారు. రానున్న నెలరోజులు ఈ పాట ఇంటర్నెట్‌ను షేక్ చేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎక్కడ చూసినా రామ్ చరణ్ స్టెప్పులే దర్శణమివడం గ్యారంటీ.

## రాహుల్ తాళి వ్యాఖ్యలపై దుమారం



అందాల రాక్షసి'తో హీరోగా, చి ల సౌ సినిమాతో దర్శకుడిగా మంచి పేరు సంపాదించుకున్న రాహుల్ రవీంద్రన్ ఇటీవల మంగళ సూత్రం విషయంలో చేసిన కామెంట్లు పెద్ద రచ్చ చేస్తున్నాయి. చూస్తూ ఉంటే సమస్య అంతకంతకు పెరిగేలానే ఉంది. ఇప్పటికే ఆయన భార్య, గాయని చిన్మయి తరుచూ పలు కామెంట్లతో నిత్యం వార్తల్లో నిలుస్తూ ఉన్న సంగతి తెలిసిందే. ఆ ఇష్యూలు అలా ఉండగానే ఇప్పుడు రాహుల్ మాట్లాడిన మాటలు పెద్ద దుమారమే రేపుతున్నాయి. గీతా ఆర్ట్స్ సమర్పణలో రష్మిక మందన్నా కథానాయికగా రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' మరో రెండు రోజుల్లో 7న) విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న రాహుల్, ఇటీవల ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పెళ్లి తర్వాత మహిళలు తప్పనిసరిగా మంగళసూత్రం ధరించాలనే ఆచారాన్ని నేను సమర్థించను. అది పూర్తిగా నా భార్య చిన్మయి ఇష్టం. నేను ఎప్పుడూ ఆమెపై బలవంతం చేయలేదు. ఒక మహిళ మెడలో తాళి ఉంటేనే ఆమె పెళ్లయిందని ఎందుకు గుర్తించాలి? మగవాడికి అలాంటి గుర్తు ఉండదు కదా? ఇది లింగ వివక్షలోకి వస్తుంది. సమాన హక్కులు రావాలంటే ఇలాంటి పాత ఆచారాలను ప్రశ్నించాలని చెప్పారు. ఈ వ్యాఖ్యలు వైరల్ అవ్వడంతో సోషల్ మీడియాలో విపరీతమైన స్పందన వస్తోంది. కొంతమంది నెటిజన్లు రాహుల్-చిన్మయి దంపతులను తీవ్రంగా విమర్శిస్తున్నారు. నీ భార్య తాళి వేసుకోదు.. నువ్వు జంధ్యం వేసుకున్నావా?, హిందూ సంప్రదాయాలను ఎందుకు అవమానిస్తున్నావు? అంటూ కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు మాత్రం రాహుల్ అభిప్రాయాన్ని సమర్థిస్తూ.. ప్రతి ఒక్కరికీ తమ ఆలోచన స్వేచ్ఛ ఉంది. సమాజం మారాలంటే ఇలాంటి అభిప్రాయాలు రావాలి అని చెబుతున్నారు. ఇక చిన్మయి కూడా తన భర్తకు మద్దతుగా స్పందించింది. ఒక నెటిజన్ మంగళసూత్రం స్త్రీకి భద్రత ఇస్తుందని రాయగా, చిన్మయి సమాధానంగా.. మంగళసూత్రం లైంగిక దాడులు లేదా వేధింపులను ఆపలేదు. పుట్టిన పిల్లలపైనా దారుణాలు జరుగుతున్నాయి కదా అప్పుడు తాళి ఎలా రక్షిస్తుంది?అని కౌంటర్ ఇచ్చింది. ఈ వ్యాఖ్యలతో రాహుల్,చిన్మయి దంపతులపై సోషల్ మీడియాలో చర్చ కొనసాగుతోంది.



## బోర్డర్-2 నుంచి వరుణ్ ధావన్ లుక్ విడుదల

వరుస సినిమాలతో సూపర్ హిట్లు అందుకున్న బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం బోర్డర్ 2. ఈ సినిమాకు సినిమాకు అనురాగ్‌సింగ్ దర్శకత్వం వహించనుండగా.. భూషణ్‌కుమార్, కృష్ణన్ కుమార్, జేపీదత్తా, నిధిదత్తా కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వరుణ్ ధావన్, దిలిజిత్ దోసాంజే, అహాన్ శెట్టి, సోనమ్ బజ్వా తదితరులు కీలక పాత్రల్లో నటించబోతున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ మూవీ నుంచి చిత్రబృందం తాజాగా వరుణ్ ధావన్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. వరుణ్ ధావన్ ఇందులో హోషియర్ సింగ్ దాహియా అనే పాత్రలో కనిపించబోతుండగా ఈ ఫస్ట్ లుక్‌లో వరుణ్ ధావన్ గన్ పట్టుకుని శత్రువులను కాల్చుతున్నట్లు కనిపిస్తుంది.

## మగాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాధ తెలుస్తుంది

### టీవీ షోలో రష్మిక మందన్న సంచలన కామెంట్స్

ఈ ఏడాది ఇండియన్ సినీ పరిశ్రమలో రష్మిక మందన్నా సందడి ఎక్కువగా కనిపిస్తోంది. నెల, రెండు నెలల గ్యాప్‌లో ఓ సినిమా విడుదల చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇప్పటివరకు ఆమె నటించిన నాలుగు సినిమాలు థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని సాధించాయి. గత ఏడాది డిసెంబర్‌లో విడుదలైన 'పుష్ప 2' తో రష్మిక తన సత్తా చాటుకోగా, ఈ ఏడాది 'ఛావా', 'సికందర్', 'కుబేర', 'థామా' చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు రష్మిక నటించిన తాజా చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్' ఈ నెల 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో రష్మిక పలు ప్రమోషనల్ కార్యక్రమాల్లో బిజీగా ఉంది. షోలు, ఇంటర్వ్యూలలో పాల్గొంటూ అభిమానులను అలరిస్తోంది. తాజాగా ఆమె జగపతిబాబు హోస్ట్‌గా రన్ అవుతున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' టాక్ షోలో పాల్గొని సందడి చేసింది. ఈ సందర్భంగా రష్మిక తన చిన్ననాటి అనుభవాలను పంచుకుంటూ, స్కూల్ రోజుల్లో జరిగిన ఒక సంఘటనను గుర్తుచేసింది. జగపతిబాబు అడిగిన ప్రశ్నలకు రష్మిక ఇచ్చిన సరదా సమాధానాలు ప్రేక్షకులను అలరించాయి. అంతేకాకుండా, షోలో రష్మిక మహిళలకు సంబంధించిన సమస్యలపై మాట్లాడింది. 'మగాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుండని అనిపించింది. ఆ సమయంలో మహిళలు ఎదుర్కొనే నొప్పి, బాధ ఎలా ఉంటుందో అబ్బాయిలు కూడా అనుభవిస్తే వారికి అర్థం అవుతుందని చెప్పి అందర్నీ ఆకట్టుకుంది. ఆమె మాటలకు జగపతిబాబు, ఆడియెన్స్ ఇద్దరూ చప్పట్లు కొట్టారు. ఇక రష్మిక నటించిన 'ది గర్ల్ ఫ్రెండ్' ఒక ఇంటెన్స్ లవ్ స్టోరీగా తెరకెక్కింది. దీక్షిత్ శెట్టి హీరోగా నటించిన ఈ చిత్రానికి రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించగా, ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహరించారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రంలో ప్రేమకథలోని కొత్త కోణాన్ని చూపించబోతున్నట్లు దర్శకుడు తెలిపారు. ఈ సినిమా చూసిన తర్వాత అమ్మాయిలు తమ లవర్స్ గురించి ఆలోచించేలా ఉంటుందని ఆయన చెప్పడం విశేషం. ప్రస్తుతం రష్మిక మందన్నా 'మైసా' అనే లేడీ ఓరియెంటెడ్ మూవీలో నటిస్తోంది. అదనంగా బాలీవుడ్‌లో ఒక కొత్త ప్రాజెక్ట్‌లోనూ భాగమవుతోంది. అంతేకాకుండా విజయ్ దేవరకొండతో కలిసి రాహుల్ సాంక్రిత్యాన్ దర్శకత్వంలో ఒక పీరియాడిక్ యాక్షన్ ఎంట్టంలనర్‌లో నటిస్తోంది. పలు క్రేజీ ప్రాజెక్టులపై చర్చలు కొనసాగుతున్నాయని సినీ వర్గాల సమాచారం.

## మోహన్ లాల్ తనయుడు ప్రణవ్ లాల్ మూవీ డిఎస్ ఈరే

మలయాళ స్టార్ నటుడు మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ లాల్ చాలా రోజుల తర్వాత నటిస్తున్న తాజా చిత్రం 'డీయస్ ఈరే'. ఈ సినిమాకు బ్రహ్మయుగం దర్శకుడు రాహుల్ సదశివన్ దర్శకత్వం వహించగా మలయాళంలో ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఇదే చిత్రం తెలుగులో నవంబర్ 07న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రాబోతుంది.



## అనగనగా ఒక రాజులో పాట పాడిన నవీన్

మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా తర్వాత జాతి రత్నాలు ఫేం నవీన్ పొలిశెట్టి నటిస్తోన్న చిత్రం అనగనగా ఒక రాజు. ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ప్రీ వెడ్డింగ్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమాను జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నారు. మ్యాడ్ ఫేం కళ్యాణ్ శంకర్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయాల్సి ఉండగా.. మారి చేతుల్లోకి వెళ్లింది. ఈ సినిమా కోసం నవీన్ పొలిశెట్టి సింగర్‌గా మారిపోయాడన్న వార్త మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. తాజా సమాచారం ప్రకారం నవీన్ పొలిశెట్టి పాడిన ఈ పాట నవంబర్ మూడో వారంలో లాంచ్ కానుంది. ఇప్పటిదాకా విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ కామిక్ టచ్‌తో సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్‌లో నవీన్ పొలిశెట్టి లుంగీ, బనియన్ వేసుకుని, మెడలో రుమాలు వేసుకొని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకుపై వెళ్తూ క్యూరియాసిటీ పెంచుతున్నాడు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో ఈ చిత్రంలో మీనాక్షిచౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. రాజుగారి పెళ్లి విందులో చమ్మక్ చంద్ర అరేయ్ ఇది రాజుగారి పెళ్లి.. గెస్టులందరికీ గోల్డ్ ప్లేట్స్ మాత్రమే పెట్టండి.. అంటూ చెప్పే డైలాగ్స్‌తో మొదలైంది ప్రీ వెడ్డింగ్ వీడియో. అతిథుల్లో ఓ వ్యక్తి ఏంటండి వీళ్లు ప్లేటు గోల్డ్.. స్వీటు గోల్డ్ అంటున్నారు.. ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా అని అడుగుతుంటే.. మరో వ్యక్తి ఏవండి ఇది మా రాజుగారి పెళ్లండి అని అంటున్నాడు. నవీన్ పొలిశెట్టి ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెడ్డింగ్ క్యాసెట్ చూస్తూ.. ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి.. ముఖేశ్ మామయ్యా ఈవెంట్‌కు వచ్చిన సెలబ్రిటీల ఫోన్ నంబర్లు పెట్టు చెబుతా.. ఈ ఇయర్ అంతా అంబానీ పెళ్లి.. వచ్చే ఏడాదంతా రాజుగారి పెళ్లి అంటున్నాడు. జాతి రత్నాలు హీరో స్టైల్ ఆఫ్ హ్యూమర్ టచ్‌తో సాగుతున్న వీడియో సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది.




Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 966605221**

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..


# కొండగట్టు గిరి ప్రదక్షిణకు అపూర్వ స్పందన


- కార్తీకపౌర్ణమి సందర్భంగా వేలాదిమంది పాల్గొన్న భక్తులు

**నేటి సాక్షి జగిత్యాల (పూరెళ్ల బాపు) :** ప్రతి పౌర్ణమికి కొండగట్టు ఆంజనేయస్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహిస్తుండగా కార్తీకపౌర్ణమి పురస్కరించుకొని బుధవారం గిరిప్రదక్షిణలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లానుండే కాకుండా హైదరాబాద్ నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనగా గిరి ప్రదక్షిణకు అపూర్వస్పందన లభించింది. జగిత్యాల జిల్లాలోని మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం చేసుకుంటే కోరిన కోర్కెలు తిరుతాయని భక్తుల నమ్మకం. బుధవారం జరిగిన ప్రదక్షిణను హైదరాబాద్ లోని చిలుకూరి బాలాజీ టెంపుల్ పూజారి ప్రారంభించి ప్రవచనం చేశారు. కొండగట్టు అంజన్న ఆశీర్వాదం తోనే భక్తుల గిరిప్రదక్షిణ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగు తుందన్నారు. కార్యక్రమంలో బత్తిని శ్రీనివాస్ గౌడ్, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, నాల్గవ తరగతి ఉద్యోగుల



సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షురాలు క్యారంగుల అరుణ, వేముల కేశవరెడ్డి, ఎన్. ఉమా, కే.దివ్య,బి. రాజు, కే. పద్మ, గంద్ర మల్లారెడ్డి,సంకిటి రవీందర్ రెడ్డి, ,బాపు, శ్రీకాంత్, జనార్ధన్, గిరిదర్, సచిన్, హన్మంత్ రెడ్డి, వేణు తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ పరిపాలనకు మూలస్తంభం వీఆర్ఏ వ్యవస్థ



- విఆర్ఎ వ్యవస్థ పునరుద్ధరణకు జీవన్‌రెడ్డిని కలిసిన ప్రతినిధులు
- ధరణి వల్ల భూ రికార్డులు తారుమారు
- మాజీ మంత్రి జీవన్‌రెడ్డి వ్యాఖ్యానం
- భూభారతి చట్టం అమలుకు రెవెన్యూ యంత్రాంగం బలోపేతం అవసరం

**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డిని విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు (విఆర్ఎ లు) కలిసి, రద్దయిన విఆర్ఎ వ్యవస్థను పునరుద్ధరించాల్సిందిగా వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి గ్రామీణ పరిపాలనలో రెవెన్యూ యంత్రాంగం ప్రాధాన్యాన్ని విశదీకరించారు.

### గ్రామీణ పరిపాలనకు మూల స్తంభం రెవెన్యూ యంత్రాంగం

ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాలనకు రెవెన్యూ శాఖే పునాది అని గుర్తు చేశారు.'గ్రామస్థాయిలో ప్రభుత్వం అంటే ప్రజల కళ్లముందు కనబడేది రెవెన్యూ అధికారి లేదా వీఆర్ఏ. అకాల వర్షాలు, తుఫాన్లు, పంటనష్టాలు వచ్చినా ప్రజలతో మొదటగా ఉండేది రెవెన్యూ సిబ్బందే. వారు కేవలం అధికారులు కాదు.. ప్రభుత్వానికి ప్రజల మధ్య ఉన్న జీవరేఖ'అని ఆయన అన్నారు.

### ధరణితో భూ రికార్డులు గందరగోళం

గత ప్రభుత్వ పాలనలో ప్రవేశపెట్టిన ధరణి వ్యవస్థ వల్ల భూ రికార్డులు పూర్తిగా తారుమారయ్యాయని జీవన్ రెడ్డి పేర్కొన్నారు.'ఎవరి యాజమాన్యం ఎవరికో స్పష్టత లేకుండా పోయింది. పాత రికార్డులు తొలగించబడటం, కొత్త రికార్డులు తప్పుగా నమోదవడం వల్ల రైతులు తమ హక్కులు కోల్పోయారు. ధరణి వల్ల గ్రామస్థాయిలో రెవెన్యూ బాధ్యతలు కూడా తగ్గిపోయాయి' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### వీఆర్ఏ వ్యవస్థ రద్దు - పాలనలో లోటు

'గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వాన్ని ప్రజలకు ప్రతినిధి చేసే వ్యక్తి వీఆర్ఏ. కానీ పోస్టులు రద్దు చేయడంతో ప్రభుత్వం గ్రామస్థాయిలో కనబడటం లేదు. పేదల ఇబ్బందులు తెలుసుకునే వారు లేకుండా పోయారు. ఇది పాలనలో పెద్ద లోట'ని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు.

### భూభారతి చట్టం - రైతుల హక్కుల పునరుద్ధరణకు నూతన మార్గం

'ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం రైతుల హక్కుల పునరుద్ధరణకు ఒక సానుకూల అడుగు. ధరణి వల్ల నష్టపోయిన రైతులు తమ యాజమాన్య హక్కులను తిరిగి పొందే అవకాశం ఉంది. అయితే ఈ చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే, గ్రామస్థాయిలో రెవెన్యూ యంత్రాంగం బలపడాలి. వీఆర్ఏ వ్యవస్థను తిరిగి ప్రవేశపెట్టడం అత్యవసరం'అని తెలిపారు.

### ప్రతినిధులకు హామీ ఇచ్చిన జీవన్‌రెడ్డి

మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, వీఆర్ఏ ప్రతినిధుల డిమాండ్లను శ్రద్ధగా విన్నారు. 'రెవెన్యూ శాఖ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వీఆర్ఏ వ్యవస్థ పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వం సమీక్షిస్తుందని, తాను ఈ అంశాన్ని ఉన్నత స్థాయిలో తీసుకెళ్తానని' హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వీఆర్ఏ సంఘ ప్రతినిధులు, రెవెన్యూ ఉద్యోగులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఇందిరా భవన్‌లో జరిగిన ఈ సమావేశం సందర్భంగా పలువురు నేతలు 'గ్రామీణ పరిపాలనలో వీఆర్ఏల పాత్ర తిరిగి రావాలంటే, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల'ని అభిప్రాయపడ్డారు.

# కోదండరామాలయంలో మాజీమంత్రి జీవన్‌రెడ్డి



- మాజీ జడ్పీ ఛైర్ పర్సన్ వసంత సురేష్ ప్రత్యేక పూజలు
- కార్తీక పౌర్ణమి వేడుకల్లో ఘనంగా స్వాగతం
- వెండి ఆభరణాలు స్వామివారికి సమర్పణ
- భక్తి పారవశ్యంలో భక్తులు

**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ కోదండ రామాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత సురేష్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డికి భక్తులు ఘనంగా స్వాగతం పలికారు.

### మేళతాళాలతో..'జై శ్రీరామ్.!'

మేళతాళాల మధ్య 'జై శ్రీరామ్!'అంటూ ఆలయ ప్రాంగణంలో నినాదాలు మార్మోగాయి. భక్తులు సేకరించిన విరాళాలతో తయారు చేసిన వెండి ఆభరణాలు..స్వామివారి కిరీటం, ధనుస్సు, ఖడ్గం, సీతమ్మవారికి హారంను మంగళహారతులతో



సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు.

### 'రాముడు సమాజానికి ఆదర్శ పురుషుడు' ( మాజీమంత్రి జీవన్‌రెడ్డి )

ఆ తరువాత మాజీ మంత్రి జీవన్‌రెడ్డి మాట్లాడుతూ..'జగిత్యాల కోదండ రామాలయం జిల్లా ప్రజల ఆధ్యాత్మిక కేంద్రం. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు స్వామివారికి ఆభరణాలు సమర్పించడం ఎంతో హర్షించదగ్గ విషయం. యావత్ సమాజానికి ఆదర్శ పురుషుడు శ్రీరాముడు. మనమంతా ఆయనను ఆదర్శంగా తీసుకొని ఏ విభేదాలు, కలహాలు లేకుండా శాంతియుత సమాజం నిర్మించాలి. మన హిందూ మత ప్రాచుర్యాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత' అని అన్నారు.

దేవాలయ ఆస్తుల పరిరక్షణలో భక్తుల కృషి ప్రశంసనీయం

'కోదండ రామాలయం ఆస్తులు ఒక దశలో అన్యాక్రాంతం అవుతున్నప్పుడు భక్తులు రాజకీయాలకు అతీతంగా వాటిని రక్షించడంలో విశేష కృషి చేశారు.

అలాగే విద్యానగర్ రామాలయం ఆస్తులను కూడా భక్తులు కాపాడారు. విద్యానగర్ రామాలయం పునర్నిర్మాణం భక్తులే విరాళాలతో పూర్తి చేశారు. ఈ దేవాలయం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచింది. ఇది జగిత్యాల ప్రజల భక్తి, నిబద్ధతకు ప్రతీక' అని తెలిపారు.

### రెండు రామాలయాలకు రూ.40 లక్షల నిధులు మంజూరు

'జగిత్యాల కోదండ రామాలయానికి రూ. 20 లక్షలు, విద్యానగర్ రామాలయానికి రూ. 20 లక్షలు, మొత్తం రూ. 40 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాను .దేవాలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని' అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయం అంతా "జై శ్రీరామ్" నినాదాలతో మార్మోగింది. భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. కార్తీక పౌర్ణమి వేడుకలతో కోదండరామాలయం ఆధ్యాత్మిక క్షేత్రంగా మారిపోయింది.


# శ్రీ పౌలస్తేశ్వరాలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

### భక్తుల రద్దీతో శివనామస్మరణతో మారుమోగుతున్న ఆలయం



**నేటి సాక్షి జగిత్యాల (పూరెళ్ల బాపు) :** జగిత్యాల్ జిల్లా నుండి 7 కిలోమీటర్ల దూరంలో ధర్మపురి రోడ్డులో ఉన్న పొలాస గ్రామంలో పౌలస్తేశ్వరాలయం చాలా ప్రసిద్ధి చెందింది. వ్యవసాయ పొలాలతో చుట్టుముట్టబడిన ఈ ఆలయం NH-16 కి సమీపంలో ఉంది, ఇది మంచి ప్రార్థనా స్థలం మరియు మంచి సందర్శనా స్థలం. ఇక్కడ పూజించబడే శివలింగం (స్వయం భూ) దాని ఆవిర్భావం నుండి అన్ని వర్గాల ప్రజలను ఆకర్షిస్తుంది. శ్రీ పౌలస్తేశ్వరాలయంలో కార్తీకపౌర్ణమిని ఘనంగా జరుపుకుంటున్నారు. శివాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన, భక్తులు దానధర్మాలు చేస్తూ పుణ్యం సంపాదించుకుంటున్నారు.

# గుట్ట రాజేశుని సన్నిధిలో - టౌన్ సిఐ కరుణాకర్ పూజలు



**నేటి సాక్షి జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** జగిత్యాల గుట్ట రాజేశ్వర స్వామి సన్నిధిలో బుధవారం జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా గుట్టపై కొలువైన శివుడికి సిఐ కరుణాకర్ అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారి గుంటి జగదీశ్వర్ గోత్ర నామాధులతో సీఐ కరుణాకర్ పేరిట అర్చన చేసి ఆశీర్వధించారు. ఆలయం పక్షాన సీఐ ని పూజారి జగదీశ్వర్ సన్మానించారు.

# శ్రీ కంఠమహేశ్వర స్వామికి కార్తీక పౌర్ణమి పూజలు



**నేటి సాక్షి చిలుకూరు మండలం :** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలో గల శ్రీ శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో కౌండిన్య మహర్షి జయంతిని ఈరోజు ఘనంగా నిర్వహించడం జరిగింది . గ్రామ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు అందించి చల్లగా చూడాలని ఆ దేవునికి దీపారాధన చేసి మొక్కారు..ఇట్టి కార్యక్రమంలో గీత పనిమారుల సంఘం జిల్లా అధ్యక్షులు. కొండ కోటయ్య గౌడ్ గారు మరియు జై గౌడ్ ఉద్యోగ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సురగాని లింగయ్య గౌడ్ మరియు చిలుకూరు గౌడ సంఘ సొసైటీ అధ్యక్షులు మరీదు సైదులు గారు మరియు గుడి చైర్మన్ బెల్లంకొండ నాగయ్య గారు కొండా శేషయ్య గారు కొండ వెంకయ్య గారు కొండా శ్రీనివాస్ బాలిబోయిన వెంకట్ గారు కొండ వెంకటేశ్వర్లు గారు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కుండే కుమార్

**బిజెపిపార్టీ రంగారెడ్డిజిల్లా ఓబీసీమోర్చా ప్రధానకార్యదర్శి కుండే.కుమార్**



**నేటిసాక్షిప్రతినిధి మహేశ్వరం సెప్టెంబర్ 05 :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం పెద్దపులి నాగారం గ్రామానికి చెందిన.. బండారి రాజు, కళ్యాణ మహొూత్సవ వేడుకలో.. పాల్గొన్న రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కుండే కుమార్, మరియు బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు శివకుమార్ గౌడ్ పాల్గొనడం జరిగింది.. అనంతరం కుండే కుమార్ మాట్లాడుతూ.. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో దంపత జీవితం ఆనందంగా కొనసాగాలని పిల్లాపాపలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో కుండే కుమార్ అభిమానులు.. పెద్ద ఎత్తున వివాహ కల్యాణ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది

## జూబ్లీహిల్స్ ప్రచారంలో మహేశ్వరం నియోజకవర్గం సమత ప్రకాష్



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం సెప్టెంబర్ 05:** జూబ్లీహిల్స్ ప్రచారంలో మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షురాలు సమతా ప్రకాష్ తో పాటు కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా.. నియోజకవర్గం మహిళలు పాల్గొని గడపగడపకు ప్రచారం చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో సమత ప్రకాష్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల నుండి జరగని అభివృద్ధి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలలో ఉచిత బస్ తో పాటు 500 కే గ్యాస్ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 10 సంవత్సరాల నుండి నిరుద్యోగులకు జాబులు ఇస్తామని ఇవ్వలేకపోయింది కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హుల అందరికీ ఉద్యోగాలు అందించడం జరిగింది కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ ఇందిరమ్మ రాజ్యంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందంటూ.. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ప్రజలకు తెలియజేశారు

## కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అభివృద్ధి దిశగా జూబ్లీహిల్స్

**జూబ్లీహిల్స్ లో భారీ మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది**

**సిహెచ్ యాదయ్య**



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం సెప్టెంబర్ 05:** జూబ్లీహిల్స్ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని 10 సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి ఇందిరమ్మ రాజ్యంలో.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు 500 కు గ్యాస్ 200 యూనిట్ల ఉచిత కరెంట్ లాంటివి మరెన్నో సంక్షేమ పథకాలు ఇందిరమ్మ రాజ్యంలోనే పేదోడికి న్యాయం జరుగుతుందని తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే అభివృద్ధి దిశగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పేదలకు మరిన్ని అవకాశాలు కల్పించవచ్చని మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య తెలియజేశారు

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. కాంగ్రెస్ కు ప్రతిష్టాత్మకం



- **ఉపఎన్నికల హీట్ పెరిగింది**
- **కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం**
- **షేక్‌పేట్ డివిజన్ ఇంచార్జీలతో కీలక సమీక్షా సమావేశం**
- **భట్టి విక్రమార్క, మహేష్ గౌడ్, వివేక్ వెంకటస్వామి, జువ్వాడి నర్సింగరావు సూచనలు**

**నేటి సాక్షి - హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారం చివరి దశకు చేరుతుండగా, కాంగ్రెస్ పార్టీ వేగం పెంచింది. రానున్న నాలుగు రోజులు గెలుపు సాధనలో కీలకమని పార్టీ అగ్రనాయకులు స్పష్టంగా తెలిపారు. డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు నేతృత్వంలో ఈరోజు షేక్‌పేట్ డివిజన్ ఇన్‌ఛార్జీలతో సమావేశం జరిగింది.

### ప్రతి ఓటరుతో మమేకం
### ( భట్టి విక్రమార్క పిలుపు )

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ, "ఇంకా నాలుగు రోజులు మాత్రమే మిగిలాయి. ప్రతి ఓటరిని వ్యక్తిగతంగా కలవాలి. ప్రజల మనసు గెలుచుకోవడమే అసలు విజయం" అన్నారు. ఆయన పేర్కొంటూ, కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు..ఇందిరమ్మ హౌసింగ్, మహాలక్ష్మి, రైతు రుణ మాఫీ,కార్యక్రమాలను ఇంటింటికి చేరవేయాలని సూచించారు.

### బీసీ బిడ్డ గెలుపే లక్ష్యం
### ( టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ )

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ మాట్లాడుతూ, "ఈ ఉపఎన్నిక కేవలం జూబ్లీహిల్స్ కోసమే కాదు, తెలంగాణ సమాజం మొత్తం కోసం. ఒక బీసీ బిడ్డ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడాలి. ప్రజల ఆత్మవిశ్వాసం మన విజయం అవుతుంది" అని అన్నారు. ఆయన అన్ని డివిజన్ ఇన్‌ఛార్జీలను ఉద్దేశించి, బూత్ స్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలించి, డోర్ టు డోర్ క్యాంపెయిన్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు.

### ప్రజా సంక్షేమమే బలం
### ( మంత్రి వివేక్ వెంకటస్వామి )

మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చి నెరవేర్చే పాలనను చూపించింది. ప్రజా సంక్షేమం మీదే మన గెలుపు ఆధారం. ప్రతి ఓటరికి ఈ విషయం స్పష్టంగా తెలియజేయండి" అన్నారు. ఆయన 'హైదరాబాద్ మార్పు కాంగ్రెస్ చేతిలోనే సాధ్యం' అని పేర్కొన్నారు.

### స్థానిక బలాన్ని సమన్వయం చేయాలి
### ( కోరుట్ల ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు )

కోరుట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ, "ప్రచారం కేవలం పతాకాలు, పోస్టర్లు కాదు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి మన మాట చెప్పాలి. స్థానిక నేతలు, యువత, మహిళలతో సమన్వయం చేస్తే విజయం మన సొంతం అవుతుంది" అన్నారు. ఆయన పార్టీ శ్రేణులకు జాగ్రత్తగా ప్రచారం నిర్వహించాలని, ప్రత్యర్థుల ప్రాచారానికి తగిన సమాధానం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో షేక్‌పేట్ డివిజన్ కోఆర్డినేటర్లు, బూత్ కమిటీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నేతలు, యువజన నాయకులు, కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ప్రచార వ్యూహంపై చర్చ జరిపి, రానున్న నాలుగు రోజుల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

# సబితా ఇంద్రారెడ్డి అవగాహన లోపం వల్లే నీట మునిగిన మహేశ్వరం

- **సబితా ఇంద్రారెడ్డి అవగాహన లోపం వల్లే నీట మునిగిన మహేశ్వరం మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం మరియు అగ్నిమాపక కేంద్రం - శ్రీరాములు అందెల**



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం సెప్టెంబర్ 05:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలో కురిసినటువంటి భారీ వర్షాలకు రామచంద్ర గూడెం లోని చెరువుకు గండిపడడంతో గ్రామంలోకి నీరు భారీగా పోటెత్తడం ఇళ్లలోకి నీరు చేరి భయాందోళనకు గురయ్యారు అలాగే కస్తూర్బా బాలికల పాఠశాల, మోడల్ స్కూల్ మరియు అగ్నిమాపక కేంద్రం లోకి వరద ముంచెత్తింది..విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు అట్టి స్థలాలకు చేరుకొని స్థానిక బిజెపి నాయకులతో కలిసి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ కేవలం సబితా ఇంద్రారెడ్డి అవగాహన లోపం వల్లే ఈ దుస్థితి నెలకొందన్నారు...మహేశ్వరంలో అనేక చెరువులు, కుంటలు, కాలువలు మాయమవుతున్న తాను పట్టించుకోవడంలేదని తన హయాంలోనే మోడల్ స్కూల్ గాని, కస్తూర్బా పాఠశాల గాని, అగ్నిపాపక కేంద్రం గాని నిర్మించారని...కనీసం ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించకుండా ఇట్టి స్థలాలలో ఈ నిర్మాణాలు పూర్తి చేశారని గుర్తు చేశారు. ప్రైవేట్ కంపెనీలకు ఎత్తు స్థలాలు కేటాయించి నిరుపేదలు చదువుకునే పాఠశాలలకు లోతట్టు ప్రాంతాలలో భూమిని కేటాయిం చడం, నిర్మాణం చేపట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే హైడ్రా అధికారులు కూడా గ్రామాలలో పర్యటించి అన్యాక్రాంతం అవుతున్న చెరువులను, కాలువలను గుర్తించి ఇక్కడి ప్రజలకు మునుముందు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుండే వెంకటేష్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ సభ్యులు పోతర్ల సుదర్శన్ యాదవ్, జిల్లా బిజెపి కార్యదర్శి యాదయ్య గౌడ్, మండల బిజెపి ప్రధాన కార్యదర్శి వనంపల్లి శ్రవణ్, ఉపాధ్యక్షులు చెన్నా రెడ్డి, నరసింహ, మండల కార్యదర్శి దేవేందర్, మాజీ ప్రజాప్రతినిధులు సురేష్, శ్రీరాములు యాదవ్, రఘువీర్, జాపాల సుధాకర్, బీజేవైఎం నాయకులు దేవేందర్, సీనియర్ నాయకులు కాకి పరమేష్, పాండు నాయక్, గణేష్ నాయక్, వెంకటేష్ నాయక్, శ్రీకాంత్ నాయక్, నరేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ ఒక్క సాధనం కాదు-అది భవిష్యత్తును నిర్మించే శక్తి





- **అపోలో యూనివర్శిటీ విసి డా. హెచ్. వినోద్ భట్**

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) చిత్తూరు, నవంబర్ 5 :** ది ఆపోలో యూనివర్శిటీలో యునిసెఫ్, స్కిల్ రూట్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన "ఉచిత కృత్రిమ మేధస్సు –చాట్‌జిపిటి శిక్షణా కార్యక్రమం" బుధవారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరగనున్న ఈ శిక్షణా తరగతులను వైస్ చాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ డా. వినోద్ భట్ మాట్లాడుతూ "కృత్రిమ మేధస్సు (ఏఐ) ఇప్పుడు ప్రతి రంగంలో విస్తరిస్తోంది. విద్యార్థులు దీనికి అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. ఏఐ కేవలం ఇంజనీరింగ్ విభాగానికి మాత్రమే పరిమితం కాకుండా, వైద్య రంగం సహా అన్ని రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. భవిష్యత్తులో ప్రతి రంగంలోనూ ఏఐ ప్రాధాన్యం మరింతగా పెరుగుతుంది. ఈ తరహా శిక్షణా కార్యక్రమాలు విద్యార్థుల కెరీర్ అభివృద్ధికి తోడ్పడటంతో పాటు, గ్లోబల్ స్థాయిలో పోటీకి సిద్ధం కావడంలో కూడా ఎంతో సహాయపడతాయి" అని తెలిపారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ డా. డి. జగదీశన్ మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల ప్రత్యక్ష బోధన శిక్షణ కార్యక్రమంలో, వివిధ పరిశ్రమల నుండి వచ్చిన ఆరుగురు నిపుణులు విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ), జనరేటివ్ ఏఐ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు కృత్రిమ మేధస్సు యొక్క మూల సూత్రాలు, దాని పారిశ్రామిక వినియోగాలు, భవిష్యత్తు ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై సమగ్ర అవగాహన పొందనున్నారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు యునిసెఫ్ ధృవపత్రాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో స్కిల్ రూట్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ భూపతి, ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్లు ప్రొఫెసర్ మురళీకృష్ణ, డా. సుదీర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అదనపు అంతస్థులపై చర్యలుండవా..?



**నేటి సాక్షి నవంబర్.5:** రాజేంద్రనగర్ సర్కిల్,పద్మశ్రీ హిల్స్ హరితవనం కాలనీల్లో జోరుగా అక్రమ అంతస్థుల భవనాలు వెలుస్తున్నాయి. అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించేది లేదని రాష్ట్ర ప్రభుత్వం ఓ పక్క తెగేసి చెబుతున్న రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అందుకు భిన్నంగా పనిచేస్తున్నారు. అంతస్తుకు ఒక రేటు ఏర్పాటు చేసుకుని పెద్ద మొత్తంలో ఆమ్యామ్యాలు తీసుకొని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీధర్ కు,ఈ అక్రమ అంతస్తులపై పలుమార్లు ఫిర్యాదులు అందాయి. ఈ అక్రమ అంతస్తుపై శ్రీధర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తుందని హరితవనం కాలనీ నివాసితులు ఆరోపిస్తున్నారు. లంచాల మోజులో పడి అధికారులు అక్రమ నిర్మాణాలపై ఎన్ని ఫిర్యాదులు అందినా కూడా చర్యలు తీసుకోకుండా మిన్నకుండి పోతున్నారని బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు గతంలో మ్యాన్ పవర్ లేదని చెప్పుకుంటూ కాలం ఎల్లధీశారని ఇప్పుడు మ్యాన్ పవర్ పెరిగినా కూడా అక్రమ నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో బహిర్గతం చేయాలని ప్రజల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని అలాగే టౌన్ ప్లానింగ్ అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# ఆధ్యాత్మిక ప్రవచనంతోనే మానవాళి మనుగడ

- కార్తీక పౌర్ణమి వేడుకల్లో మాతానందగిరి స్వామి సందేశం



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** రామచంద్రాపురం: కార్తీక పౌర్ణమి వేడుకల్లో భాగంగా సందర్భంగా గొల్లపల్లి సమీపంలో ఉన్న శ్రీ శాంతి ఆశ్రమంలో బృహద్వాశిష్ఠ పీఠంలో భక్తి పారవశ్యంతో నిండిపోయింది, ఆధ్యాత్మిక వాతావరణంలో శ్రీమతాంగా మహా పీఠాధిపతి మాతానందగిరి స్వామి భక్తులకు ఆధ్యాత్మిక బోధన చేశారు. మానవజాతి మనుగడకు ధర్మం, శాంతి, సేవ అనే మూడు మూలాధారాలు అవసరమని స్వామిజీ పేర్కొన్నారు. ముందుగా స్వామివారికి ఉభయదారులైన మోమిడి శ్రీదేవి,మోమిడి లీలా కృష్ణ దంపతుల స్వగృహమునందు ప్రత్యేక పూజలు చేసి మేళా తాళాలు మంగళ వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా తిమ్మరాజు పల్లి నుంచి రేణుకా పురం శివాలయం వరకు వచ్చారు అనంతరం శివుడికి గణపతి పూజతో ప్రారంభమై విభూదాభిషేకం, జలాభిషేకం, ఘనంగా గురుపూజ చేసి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం ఆధ్యాత్మిక ప్రార్థన, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి ఈ సందర్భంగా పీఠాధిపతి మానవాళికి ఉపయోగపడే సూక్తులు చేశారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి ఆలోచన శుభ్రమైతే ప్రపంచం పావనమవుతుంది. ఆధ్యాత్మికత మనసును మలుస్తుంది, మనుగడను కాపాడుతుందని మాతానందగిరి స్వామి భక్తులకు ఉపదేశించారు. ఈ కార్యక్రమాన్ని ఉభయ దారులు ముమ్మిడి శ్రీదేవి%-%లీలాకృష్ణ దంపతులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు దీపమాలలు వెలిగించి, పూజలు, హారతలతో పౌర్ణమి వేడుకలను ఆరాధనాత్మకంగా జరుపుకున్నారు. ఆశ్రమ ప్రాంగణం నిండా ఓం నమో నారాయణాయ, శివ శివ శివాయ నమః ధ్వనులతో మార్మోగింది. అనంతరం ఉభయ దారులు పీఠాధిపతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సామాజిక సమ-రసత వేదిక ఆల్ ఇండియా కన్వీనర్ శ్యాం ప్రసాద్ , డిప్యూటీ సొలిసిటర్ జనరల్ హైకోర్టు ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ పున్నారావు , శ్రీ శాంతి ఆశ్రమ ఆర్గనైజర్ వెంకట్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ రిటైర్డ్ రాష్ట్ర అధ్యక్షులు సామాజిక సమరసత వేదిక మన్మధరావు, న్యాయవాది ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు గరిక ముక్కు సుబ్బయ్య, రిటైర్డ్ ఆర్మీ ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుటుకుల జాషువా, నిర్భయానంద మోహన స్వామి, కరస్పాండెంట్ డాక్టర్ పెనుబాల ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ గీతాదేవి, ప్రముఖ గాయకులు పామూరు సుబ్రహ్మణ్యం, విరాళం ఇచ్చిన దాతలు, రైల్వే కాంట్రాక్టర్ మురళీ కృష్ణారెడ్డి, వికేర్ ఆర్ గ్యాస్ ఎండి మనోజ్ కుమార్ రెడ్డి, మన్మధరావు, సీజయంత్ నాగరాజు తదితరులు, అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు మాతంగి పీఠాధిపతి శాలువాలు కప్పి ఆశీర్వాదాలు అందించారు, భక్తులకు అన్నదానం తోపాటు దేవుని ప్రసాదం అందించారు

# డాక్టరేట్ పొందిన లయన్ రెడ్డి శ్రీనివాస్ రావు కు ఘన సన్మానం



**నేటి సాక్షి ఉప్పల్, నవంబర్ 05 :** సామాజిక సేవలో విశేషమైన కృషి చేస్తున్న రెడ్డి శ్రీనివాస్ రావు కు మాలేసియా మాస్ట్రో గ్లోబల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేసి, ఆయన చేస్తున్న అపారమైన సేవ కార్యక్రమాలను గుర్తిస్తూ ఈ అరుదైన గౌరవ దక్కిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో శాలువలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాతు బడుగుల హక్కుల కోసం పోరాటం, ఖమ్మం జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించిన శ్రీనివాస్ రావు ఉన్నంత చదువుల కోసం హైదరాబాదుకు వచ్చి తొలి దశలో విద్యార్థి ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నారని అనంతరం ఆయన దృష్టి సామాజిక సేవా కార్యక్రమాల వైపు మళ్లిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ లో చేరిన శ్రీనివాస్ రావు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున వైద్య శిబిరాలు, సహాయ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలిండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్లో కీలక పాత్ర పోషించి, దాదాపు 15 ఏళ్ల పాటు హైదరాబాద్ జంటనగారల అధ్యక్షులుగా పనిచేస్తూ, ఈ హోదాలో ఆయన బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడరు. ఆయన నిస్వార్థమైన సేవ, సమాజ అభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపుగా మాస్ట్రో గ్లోబల్ యూనివర్సిటీ ఈ గౌరవ డాక్టరేట్ అందించడం అభినందనీయమన్నారు. సామాజిక సేవకు శ్రీనివాస్ రావు జీవితాన్ని అంకితం చేయడం ఎందరికో ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తిప్పారపు లక్ష్మణ్ మాదిగ ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఇంచార్జి. కేశపాగ రామచందర్ మాదిగ ఎంఎస్ పి జిల్లా అధ్యక్షుడు. మనోహర్ ఎంజేఫ్ రాష్ట్ర నాయకులు, అంజి మాదిగ జిల్లా అధికార ప్రతినిధి ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఏళ్ళ సంతోష్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇదపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బయో ఇన్పుట్స్ తయారీ కేంద్రాం ప్రారంబం

- బయో ఇన్పుట్స్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన టిడిపి అధ్యక్షులుమేకల తిరుమలరెడ్డి



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) రామచంద్రపురం :** మండలం సికేపల్లి పంచాయితీ గొల్లపల్లి గ్రామంలో సి నాగమణి రైతుకు సంబంధించిన శ్రీ నాగాలమ్మ బయో ఇన్పుట్స్ తయారీ కేంద్రాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేకల తిరుమలరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయ సహకారాలతో ప్రకృతి వ్యవసాయ విస్తరణలో భాగంగా మన మండలంలో ప్రతి పంచాయతీలోనూ ఒక బయో ఇన్పుట్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని ప్రతి ఒక్క రైతు రసాయనక ఎరువులకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయంగా పశువుల, ప్రకృతి వనరులతో సహజ సిద్ధంగాతయారు చేసే ఇన్పుట్స్ వినియోగించాలని సూచించారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్సి సెంటర్ యజమాని సి . నాగమణి మాట్లాడుతూ తిరుపతి జిల్లా డిపిఎం ఏ . షణ్ముగం ఆదేశాలతో ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన జీవ ఉత్ప్రే రకాలు ఘనజీవామృతం, ద్రవ జీవమృతం, పంటలో తెగుళ్ళకు నివారణకు వాడే కషాయాలు దశపర్ని, బ్రహ్మాస్త్రం, వావిళ్ళకు, వేప గింజల ద్రావణం. పంట ఎదుగుదలకు, దిగుబడి కి వినియోగించే పంచగవ్య, పుల్లటి మజ్జిగ, చేప బెల్లం ద్రావణం ప్రతి ఒక్కటి ఈ కేంద్రంలో లభించునని తెలిపారు. దేశీయ విత్తనాలు, పిఎండిఎస్ కిడ్స్, వ్యవసాయ పరికరాలు అందుబాటులో తెచ్చామన్నారు. భావితరాల మనుగడ కొరకు ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేస్తేనే భూమి ఆరోగ్యం, మన అందరి ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మమత, సంఘమిత్ర మునీశ్వరి, గ్రామస్తులు కుప్పారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాగమ్మ, లాలమ్మ, సుమతి, నాగరాజు,కపిలేశ్వరయ్య, సుబ్రహ్మణ్యం రెడ్డి, డ్వాక్రా మహిళలు, రైతులు పాల్గొన్నారు

# ముంపు ప్రాంతాలలో పర్యటించిన మాజీమంత్రి



- మహేశ్వరం మండల పరిధిలోని పలు గ్రామాలలో కుండపోత వర్షం

నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం సెప్టెంబర్ 05: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మండల కేంద్రంలో పలు గ్రామాలలో ఉదయం 6 గంటలకే వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి. నిన్న కురిసిన భారీ వర్షానికి జలమయమైన రామ్ చంద్రగూడ, మరియు పలు విద్యాలయాల పరిశీలన.. చెరువు అలుగు నీళ్లను ఊర్లోకి రాకుండా నాళాలు నిర్మించి బయటికి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.. నాళాలు బురదతో కూరుకు పోవడంతో "కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో" భారీగా చేరిన వర్షపు నీళ్లు.. దగ్గరుండి జేసీబీ ల సహాయంతో కూరు కుపోయిన బురదను శుభ్రం చేయించిన ఎమ్మెల్యే ..సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ :- ఈ హఠాత్పరిణామానికి చింతిస్తూ ముందెన్నడూ లేని విధంగా కురిసిన భారీ వర్షం కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారాన్ని అందించాలని కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడనన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

# పేదల శ్రేయస్సే పరమావధిగా ముందుకు సాగుతున్న నిజామ్

**అనారోగ్యంతో తో బాధపడుతున్న వ్యక్తికి సాయం చేసిన నిజామ్**



**నేటి సాక్షి, బాపట్ల జిల్లా (ఛందో లు) :** చందోలు గ్రామంలోని జుల్ఫా లాంఫా వీధిలో ఎం డి హనీఫ్ అనే వ్యక్తి దర్జీ(టైలర్) వృత్తి చేస్తూజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో జీవనం సాగిస్తూ కుటుంబ అవసరాల కోసం పనిచేస్తూ పేదరికంలో ఉన్నారు. ఈ సమయం లో మొన్న కురిసిన తుఫాన్ ప్రభావం తో ఇల్లు కూడా నీళ్ల తో నిండి ఇబ్బందులకు గురి అయ్యారు. విషయం తెలుసుకున్న టీడీపీ యువనాయకులు నిజామ్ ఈ రోజు ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తి కి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆకలి తో బాధపడ కుండ కడుపు నింపుకోవాలి అని నిజామ్ ఆశించి సాయం అందించారు. ఈ సందర్భంగా నిజామ్ మాట్లాడుతూ తన రాజకీయ గురువు అయిన శాసన సభ్యులు వేగేసిన నరేంద్రవర్మ రాజు చేసే సేవలు, ఆయన స్ఫూర్తి తో ఇలా సాయం చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ కె బాజి, అమీర,ఎం డి సైదా పాల్గొన్నారు.

# చిన్న రాజారెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించిన కోన



**నేటి సాక్షి, బాపట్ల జిల్లా (పిట్టలవాని పాలెం) :** వైఎస్ఆర్సిపి పార్టీ సీనియర్ నాయకులు,అల్లూరు గ్రామ వైఎస్ఆర్సిపి అధ్యక్షులు సొసైటీ మాజీ సభ్యులు అక్కల చిన్న రాజారెడ్డి అనారోగ్యంతో రాత్రి స్వగ్రామం అల్లూరు లో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైయస్సార్ సిపి బాపట్ల నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి గారు అల్లూరు గ్రామానికి వచ్చి చిన్న రాజారెడ్డి భౌతికాయంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పిట్టలవానిపాలెం మండల అధ్యక్షు లు ఉయ్యూరి లీలా శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు వాలి శివారెడ్డి, మండే విజయ్ కుమార్, బడుగు ప్రకాష్, శివకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

# శివ కేశవ అలంకరణలో అలరించిన వైష్ణవి మాత



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి నవంబర్ 5 :** చౌడేపల్లి మండలం పుదీపట్ల గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీ వైష్ణవి దేవి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శివ కేశవుల అలంకారంలో భక్తులను అలరించింది వైష్ణవి దేవి ఆలయ అర్చకురాలు శ్రావణి ఉదయమే అమ్మవారికి పంచామృత అభిషేక చేసి కార్తీక మాసం శివకేశవులు ఇద్దరికీ విశేషమని ఈ కార్తీకమాసంలో సకల దేవతలు పూజింపబడతారని ఎంతో పరమ పవిత్రమైన ఈ మాసంలో శివకేశవ అలంకారంలో దర్శన భాగ్యం కల్పించారు ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు ఉభయదారులుగా చింతామణికి చెందిన వెంకటేశ్వర్లు రజిత కాటి పేరికి చెందిన బోయకొండప్పలు ఉభయదారులు గా వ్యవహరించారు

# మంత్రి నారా లోకేష్ ను కలిసిన పతిరాజు

**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి నవంబర్ 5 :** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబును పుంగనూరు నియోజకవర్గ సీనియర్ తెలుగుదేశం నాయకుడు మాదిరాజు లక్ష్మణ రాజు (పతి రాజు) కలిశారు అమరావతి లోని ఆయన నివాసంలో కలిసి పుంగనూరు నియో జకవర్గంలో ప్రస్తుత పరిస్థితులను వివరించినట్లు పతి రాజు తెలిపారు అంతేకాకుండా ఎన్నికల సమయంలో నియోజకవర్గ కార్యకర్తలు ఎదుర్కొన్న సమస్యలను పేర్కొన్నట్లు ఆయన తెలిపారు



నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..


# పీలేరు రెవిన్యూ డివిజన్ కోసం మంత్రి నారా లోకేష్ కి వినతి



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** మంగళగిరి టీడీపీ కార్యాలయంలో నిన్న జరిగిన "ప్రజా దర్బార్" లో భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు మంత్రి లోకేష్ కు వినతిపత్రం సమర్పించి, ప్రజల సౌకర్యం కోసం – పరిపాలనా సౌలభ్యం కోసం.. పీలేరు కేంద్రంగా కొత్త రెవిన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ దీనిపై చర్చించి, త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారని భారతీయ అంబేద్కర్ సేన (బాస్) రాష్ట్ర నేత పాలకుంట శ్రీనివాసులు మీడియా కు తెలిపారు. మంత్రి లోకేష్ ను కలిసిన వారిలో పాలకుంట శ్రీనివాసులు తోపాటు పీలేరు రెవిన్యూ డివిజన్ సాధన సమితి కన్వీనర్ నడిమికండ్రిగ సుధాకర్ బాబు, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణి కుమార్ , మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ ,కాంగ్రెస్ పార్టీ పీలేరు మండల అధ్యక్షుడు దుబ్బ శ్రీకాంత్, డిబిఎస్ఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దె భాను ప్రకాష్ తదితరులు ఉన్నారు

# నేడు పేటలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు



**నేటి సాక్షి, నారాయణపేట,నవంబర్ 6 :** ఈ నెల 6న గురువారం మధ్యాహ్నం గం 1:00లకు ఎస్.ఆర్ .గార్డెన్ ఫంక్షన్ హాల్ నారాయణపేట, (పాత జిల్లా ఆసుపత్రి పక్కన) బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడుతుందనీ జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పూజారులు,పాస్టర్స్, ఖ్వాజీలు మరియు జిల్లా లోని ఫంక్షన్ హాల్ యజమానులు. టెంట్ హౌస్ యజమానులు. సౌండ్ సిస్టమ్స్ మరియు డీజే నిర్వాహకులు క్యాటరింగ్ యజమానులు. ప్రింటింగ్ ప్రెస్ యజమానులు మరియు ఫోటో అండ్ వీడియో గ్రాఫర్లు అందరు కూడా ఈ అవగాహన కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం జరిగినది.కావున పైన పేర్కొన్న వారందరు ఈ అవగాహన సమావేశానికి తప్పక హాజరు అయ్యి విజయవంతం చేయాలని తెలియజేయనైనది.

# అధ్వానంగా మారిన రోడ్లు

## గన్నేరువరం నుండి పొత్తూరు వరకు రోడ్డు నిర్మించండి

## బిజెపి స్టేట్ మాజీ కౌన్సిల్ మెంబర్ విలాసాగరం రామచంద్రం



**నేటి సాక్షి, గన్నేరువరం,( బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండల కేంద్రం నుండి పొత్తూరు వరకు డబల్ రోడ్డు నిర్మాణం చేసి ప్రజల కష్టాలు తీర్చాలని బిజెపి స్టేట్ మాజీ కౌన్సిల్ మెంబర్ విలాసాగరం రామచంద్రం అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గుండ్లపల్లి నుండి గన్నేరువరం మీదుగా పొత్తూరు వరకు అద్వాన స్థితిలో ఉన్న రోడ్డు తో ప్రయాణికులకు వాహనదారులకు యమ పాశం లాగా మారింది. వెంటనే డబుల్ రోడ్డు పనులు చేపట్టి రోడ్డు మొత్తం పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ప్రభుత్వానికి భారీ గుణపటం తప్పదని హెచ్చరించారు.

# వాహనాలను అతివేగంగా నడప వద్దు




**నేటి సాక్షి, బాపట్ల జిల్లా (కర్లపాలెం) :** మోటారు వాహనాలను నడిపేవారు పరిమిత వేగంతో నడపాలని ద్విచక్ర మోటార్ వాహనాలపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కర్లపాలెం ఎస్సై రవీంద్ర చెప్పారు. ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం కర్లపాలెం కూరగాయల మార్కెట్ వద్ద జాతీయ రహదారిపై ప్రజలకు అవగాహన కల్పించారు. రవీంద్ర మాట్లాడుతూ కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని అవగాహన కల్పించారు. పరిమిత వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలను చేరుకోవాలని చెప్పారు. ఆయన వెంట ట్రైనింగ్ ఎస్సై, కానిస్టేబుల్, పోలీస్ సిబ్బంది ,తదితరులు ఉన్నారు

# స్కాలర్ షిప్పులు, ఫీజు రీయంబర్ మెంట్ వెంటనే విడుదల చేయాలి

- విద్యార్థుల స్కాలర్ షిప్పులు, ఫీజు రీయంబర్ మెంట్ వెంటనే విడుదల చేయాలి-
- సాగబోయిన పాపారావు, ఆదివాసి స్టూడెంట్ యూనియన్ (ఏ ఏస్ యు) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు

**నేటి సాక్షి ఉప్పల్ నవంబర్ 5 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రత్యేకమైన దృష్టి పెట్టాలని, ఆదివాసీ విద్యార్థుల ఉన్నత విద్య అందుకునే విధంగా ఐటీడీఏలు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్పులకు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఆదివాసి విద్యార్థికి తక్షణమే అందించాలని ఆదివాసి స్టూడెంట్ యూనియన్ ( ఏ ఎస్ యు) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, ఓయూ పరిశోధక విద్యార్థి సాగబోయిన పాపారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రాథమిక విద్య పడకేసింది. ఉన్నత విద్య ఊసే లేదు అన్న చందంగా తయారైన తరుణంలో 2021-2022 విద్యా సంవత్సరం నుండి నేటి వరకు ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆదివాసి విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్పులు విడుదల చేయకపోవడంతో ఆదివాసి గూడెల నుండి హైదరాబాదుకు వచ్చి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న డిగ్రీ, పీజీ ఆదివాసి విద్యార్థులు ఫీజులు చెల్లించలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఒకవైపు ప్రభుత్వ కళాశాలలో ఫీజు రియంబర్ మెంట్ వస్తుందని ఆశతో చదువులు పూర్తిచేసుకుని ఎందరో నిరుపేద ఆదివాసి విద్యార్థులు సర్టిఫికెట్లు పొందుట కోసం చెప్పులు అరిగిపోయేటట్లు తిరిగినా ట్యూషన్ ఫీజులు, మెస్ బిల్లులు చెల్లిస్తేనే మాఫీ చేస్తామంటూ కఠినమైన నిబంధనలను అమలు చేస్తున్నారు. మరొక వైపు ప్రైవేటు విద్యాసంస్థలు ట్యూషన్ ఫీజులు చెల్లించలేని ఎడల పరీక్షలకు అనుమతించకుండా విద్యార్థులను వేధిస్తూ ముక్కు పిండి ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్పులు విడుదల చేయకపోవడంతో కాయ కష్టం చేసుకుని జీవనం కొనసాగిస్తున్న కన్న తల్లిదండ్రులపై పెను భారం పడుతుంది. ఫలితంగా ఆదివాసి విద్యార్థులు పై చదువులకు వెళ్లేందుకు ఫీజు రియంబర్స్ మెంట్ కట్టలేక కన్న తల్లిదండ్రులను కష్టపెట్టలేక ఉన్నత చదువులకు దూరమవుతూ ఊరిలో కూలీలుగా మారుతున్న మారుమూల ఆదివాసి విద్యార్థులు ఎందరో? ప్రైవేటు కళాశాలలో ఫీజులు చెల్లించే స్తోమత లేక ప్రభుత్వ కళాశాలలో చదువులను కొనసాగిద్దామన్న సకాలంలో ప్రభుత్వం ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్పులు విడుదల చేయకపోవడంతో ఉన్నత చదువులకు ఆదివాసి విద్యార్థులు దూరమవుతున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏల అధికారులు, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఆదివాసి విద్యార్థులకు అందించవలసిన ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్పులు బకాయిని వెంటనే విడుదల చేసి ఆదివాసి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు. లేనిపక్షంలో అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకొని ఆదివాసీ విద్యార్థుల న్యాయమైన డిమాండ్ సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధమవుతున్నామని హెచ్చరించారు.

# ఒక ప్రపంచం - ఒక ఆరోగ్యం' నినాదంతో భారీ ర్యాలీ




**నేటి సాక్షి తిరుపతి బాదూరు బాల చిత్తూరు, నవంబర్ 5:** "ఒక ప్రపంచం– ఒక ఆరోగ్యం అన్న సమగ్ర నినాదంతో అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ఓ (ఏఐఎంఎస్ఆర్), ది అపోలో యూనివర్శిటీ సంయుక్తంగా బుధవారం అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించాయి. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ అండ్ సోషియల్ మెడిసిన్ (ఐఏపీఎస్ఎమ్), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) సంస్థల సహకారంతో జరిగిన ఈ ర్యాలీ ద్వారా మానవుడు – జంతువు – పర్యావరణం అనే త్రిసంబంధ ఆరోగ్య భావనను ప్రజలకు చాటిచెప్పారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ ఏఐఎంఎస్ఆర్ పరిపాలనా భవనం వద్ద ప్రారంభమై మురకంబట్టు సర్కిల్ వరకు సాగింది. విద్యార్థులు ఆరోగ్య చైతన్య నినాదాలు చేస్తూ, ప్లేకార్డులు, ఫ్లెక్సీలు పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురకంబట్టు సర్కిల్‌లో విద్యార్థులు "మానవ హారం"గా నిలబడి మానవుడు– జంతువు–పర్యావరణం పరస్పర అనుసంధానం ద్వారానే స్థిరమైన ఆరోగ్య సమాజం సాధ్యమని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వీధి నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఆరోగ్యం, పరిశుభ్రత, జీవ వైవిధ్య పరిరక్షణ అంశాలపై సందేశాత్మకంగా రూపొందించిన ఈ నాటిక ప్రజల్లో చైతన్యం కలిగించింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ు "మానవ ఆరోగ్యాన్ని కాపాడాలంటే ప్రకృతితో సమతుల్యత తప్పనిసరి. పర్యావరణం, జంతువులు, మనుషుల ఆరోగ్యం ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయి. ఈ భావనతో ముందుకు సాగితేనే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం సాధ్యం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ డా. కె. అశోక్ కుమార్ రెడ్డి, నోడల్ ఆఫీసర్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. దేవికా పి.జె, అపోలో ఫిజియోథెరపీ కాలేజీ ప్రిన్సిపల్ డా. కిరణ్, అలాగే వైద్య విద్యార్థులు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, సీనియర్ రెసిడెంట్లు, నర్సింగ్, ఫిజియోథెరపీ, అలైడ్ హెల్త్ సైన్సెస్, పబ్లిక్ హెల్త్, అపోలో సోషల్ రెస్పాన్సిబిలిటీ క్లబ్, ఎకో క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈ క్రాప్ లో నమోదైన పంటను పరిశీలన

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్



**నేటి సాక్షి, బాపట్ల జిల్లా ప్రతినిధి :** ఈ క్రాప్ లో నమోదైన పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పలు సూచనలు చేశారు. ఈ క్రాప్ లో నమోదైన పంటను బుధవారం, కంకటపాలెం గ్రామంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూపర్ చెక్ చేశారు. ఈ సందర్భంగా సర్వే నెంబర్ 2 లో ఈ క్రాప్ 5.9 వర్షన్, ఈ పంట యాప్ లో ఆన్లైన్ ద్వారా నమోదు చేసిన మన్నెం నిమ్మి కి చెందిన 3 ఎకరాల 19 సెంట్ల పొలంలో వేసిన వరి పైరును ఆయన పరిశీలించారు. మన్నెం నిమ్మి కి ఆయన ఫోన్ చేసి పంట వివరాలను తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ గ్రామ సర్పంచ్ కి తెలిపారు. గ్రామంలో ఎవరు కూడా ఆరుబయట మలవిసర్జన చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. గ్రామంలో రెండు డొంకల్లో రోడ్డు ఏర్పాటు చేయాలని సర్పంచ్ జిల్లా కలెక్టర్ ను కోరగా, గ్రామంలో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటే, రోడ్ల నిర్మాణం చేపడతామని ఆయన వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మండల వ్యవసాయ అధికారి శారద, కంకటపాలెం సర్పంచ్ మద్దిరాల వందనం, వీఆర్ఓ సుధారాణి, వి ఏ ఏ షబీనా మరియు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆమడ దూరంలో బొమ్మన్ పాడ్ గ్రామం !?



## పట్టించుకోని అధికారులు....

**నేటి సాక్షి, నారాయణపేట నవంబర్ 5 :** పైన కనిపిస్తున్న గ్రామం నారాయణపేట మండలం బొమ్మను పాడు గ్రామం గత 25 సంవత్సరాలుగా బీసీ కాలనీలో అభివృద్ధికి నోచుకపోవడమే, కనీస సౌకర్యాలకు కూడా కరువైన దుస్థితి ఉన్నది, చెత్త చెదారంతో కంప చెట్లతో మురికి కాలువలతో 100 కుటుంబాలు నివసిస్తున్న పట్టించుకోని గత సర్పంచులు ఎంపీటీసీలు, ఆ గ్రామంలో గత ఐదు సంవత్సరాల కిందట వైస్ ఎంపీపీగా పనిచేసిన చరిత్ర గ్రామానికి ఉంది, రాజకీయంగా పోటీతత్వం ఉన్న అభివృద్ధిలో మాత్రం ఆమడ దూరంలో నిలిచి ఉన్నది బొమ్మను పాడు , ఎన్నికలు వస్తే లక్షలు లక్షలు ఖర్చు చేసే రాజకీయ నాయకులు ఉన్నారు కానీ గ్రామం అభివృద్ధికి చేసే నాయలు లేకపోయాడని ఆ గ్రామ యువకులు కి వారి బాధను తెలియజేశారు, అధికారం కోసం పాలకులు అది చేస్తాం ఇది చేస్తామని చెప్పే నాయకులు తప్ప గ్రామం అభివృద్ధిని పట్టించుకునే వారే కరువయ్యారని అన్నారు, గత ఎమ్మెల్యేకు ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యేకు జిల్లా కలెక్టర్ కు తమ సమస్యలను వివరించిన మా గ్రామ సమస్యలను పరిష్కారం కావడం లేదని అని అన్నారు, గ్రామపంచాయతీ కార్యాలయంలో 22 లక్షల అమౌంట్ ఉన్న గ్రామం అభివృద్ధి చెందడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు, ముఖ్యంగా బీసీ కాలనీలో రోడ్ దాటాలంటే మురికి కాలువ మురికి కంప చెట్లు అడవిలాంటి ప్రాంతంగా మారిపోయింది, కాబట్టి ఇప్పటికైనా ప్రజా పాలకులు ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ గ్రామపంచాయతీ అధికారులు గ్రామ లో నీ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు వారి ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

# రైస్ మిల్లులలో పారదర్శకమైన తనిఖీలను నిర్వహించాలి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖను కాపాడాలి.
- రైతు రాష్ట్ర నాయకులు 'ఆకుల రంజిత్' డిమాండ్



**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** రైస్ మిల్లు యజమానులు ప్రభుత్వాన్ని మోసం చేస్తూ..కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్నారని..వీళ్ల దోపిడీని అరికట్టాలంటే రైసుమిల్లులలో తనిఖీలు పారదర్శకంగా ఉండాలని రైతు రాష్ట్ర నాయకులు 'ఆకుల రంజిత్' డిమాండ్ చేశారు. బుధవారం కోరుట్ల పట్టణములోని అష్టలక్ష్మీ దేవాల యములో పాత్రికేయుల సమావేశం ఆకుల రంజిత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మధ్య కాలంలో పౌర సరఫరాల శాఖ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.40 వేల కోట్ల అప్పులు ఉన్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు పలుమార్లు పత్రిక ముఖంగా ప్రకటించారని గుర్తుచేశారు. రైస్ మిల్లులో ధాన్యం నిల్వలలో అవకతవకల గురించి సమగ్ర విచారణ పారదర్శకమైన వడ్ల నిల్వల తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రైస్ మిల్లుల మాఫియా వ్యాపారం గురించి అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. 2022-23 ఎండ కాలం (రబీ) సీజన్ యొక్క బకాయిలు రాబట్టుటలో రాష్ట్ర పౌరసరఫరాల యంత్రాంగం చాలా ఘోరంగా విఫలమైనదని విమర్శించారు. దీనితో ఈ ఒక్క సీజన్ కు గాను రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.4500 కోట్లు నుండి రూ. 5000 కోట్ల మేర బకాయిలు పేరుకపోయి ఉన్నాయన్నారు. ఈ బకాయిలు వసూల్ చేయడంలో విఫలానికి కారణం అధికారులకు, నాయకులకు ఎన్ని ముడుపులు ముట్టి ఉంటాయో స్పష్టమవుతుందన్నారు. 2022-23 ఎండాకాలం, 2024-25 వానాకాలం, 2024-25 ఎండాకాలం మూడు సీజన్ల యొక్క బియ్యం బకాయిలు ముట్టని రైస్ మిల్లులకు 2025-26 వానాకాలం వడ్లను అలాట్మెంట్ చేయడంలో గల అంతర్యం ఏమిటి? అని ఆయన ప్రశ్నించారు. బ్యాంక్ గ్యారెంటీలు రైస్ మిల్లుల టన్నేజి ప్రకారం ఇవ్వకుండా వడ్ల అలాట్మెంట్ చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లులలో ధాన్యం నిల్వలను పారదర్శకంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రెండు పంటలలో రైతులకు బకాయిలు ఉన్న రూ.500లు బోనస్ వరి ధాన్యం డబ్బులను కూడా వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఈ పాత్రికేయ సమావేశంలో ఆకుల రంజిత్ తోపాటు కలాల సాయిచంద్, పుల్లగుర్ల కొండల్ రెడ్డి, భీమనాతి శ్రీధర్, సదుల సుదర్శన్, కటుకం రాజేశం, బోయ నర్సారెడ్డి, బోదాసు మహేష్, శేఖర్ మరియు తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన కోటి సంతకాల ప్రజా ఉద్యమం



- 114 పంచాయతీల్లో సంతకాల సేకరణకు కదలిన పార్టీ శ్రేణులు
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం
- పిల్లల భవిష్యత్తుకు ఒక్క సంతకం పెట్టాలన్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

**నేటి సాక్షి తిరుపతి బాదూరు బాల :** 'గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేటు వ్యక్తులకు అప్పగించేలా కూటమి ప్రభుత్వ చేస్తున్న కుట్రలు, తెచ్చిన జీఓలను అడ్డకోవడానికి వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చంద్రగిరి నియోజకవర్గంలో బుధవారం ప్రారంభమైంది. చంద్రగిరి నియోజక వర్గం వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాకాల మండలం బందార్లపల్లి గ్రామం నుంచి సంతకాల సేకరణను ప్రారంభించారు. ముందుగా గ్రామ దేవతలకు పూజలు చేసిన ఆయన మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి కోటి సంతకాల సేకరణ ఎందుకు చేయాల్సి వచ్చిందన్న విషయాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్ముతో మెడికల్ కాలేజీలను జగన్మోహన్‌రెడ్డి నిర్మిస్తే వాటిని ప్రభుత్వ తరపున నడపాల్సింది పోయి 66ఏళ్ల పాటు ప్రయివేటు వ్యక్తులు నడుపుకునేలా ప్రభుత్వం అడ్డగోలుగా కట్టబెట్టి పబ్బం గడుబుకుంటోందన్నారు. మెడికల్ కాలేజీలు ప్రయివేటు పరం అవడం వల్ల మెడికల్ సీట్లు అమ్ముకుని సంబంధం లేని వ్యక్తులు కోట్ల రూపాయలు సంపాదించుకుంటారే తప్ప పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా పోతుందన్నారు. మెడికల్ కాలేజీలకు అనుబంధంగా వచ్చే ప్రభుత్వ ఆసుపత్రులు కూడా ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళతాయని, తద్వారా పేదలకు ఉచితంగా అందాల్సిన ఖరీదైన వైద్యం అందకుండా పోతుందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా వచ్చే ఆసుపత్రుల్లో ఒక నెలకు ఒక లక్ష మందికి వైద్యం అందుతుందని, ఆ లెక్కన 17 మెడికల్ కాలేజీలకు అనుబంధంగా వచ్చే ఆసుపత్రుల్లో 17లక్షల మందికి వైద్యం దొరుకుతుందని మహిళలకు అర్థమయ్యేలా వివరించారు. ఇంతపెద్ద ఎత్తున ప్రజలకు చెడు చేసేలా కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుంటే దానిని రాజ్యాంగ బద్ధంగా అడ్డుకోవడానికి జగనన్న కోటి సంతకాల సేకరణకు పిలుపునిచ్చారన్నారు.

### భవిష్యత్తు తరాలకోసం 'ఒక్క సంతకం..'

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణలో మరొక కుట్రకోణం దాగియుందని, ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 66 ఏళ్లకు ప్రయివేటు వ్యక్తులు ఆ మెడికల్ కాలేజీలను, వాటికి అనుబంధంగా వచ్చే ఆసుపత్రులను నిర్వహించుకనేలా ఈ ప్రభుత్వం జీఓలు తెచ్చిందన్నారు. అదే జరిగితే ఈ తరం ప్రజలకు ఉచిత వైద్యం, పేదలకు వైద్య విద్య అందకుండానే గడిచిపోతుందన్నారు. భవిష్యత్తు తరాల బాగుకోసం చేపడుతున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా పాల్గొని తమ సంతకాలతో మద్దతు తెలపాలని గడప గడపలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వివరించారు. కోటి సంతకాల సేకరణ గురించి తెలుసుకున్న మహిళలు తప్పకుండా ఈ ఉధ్యమంలో పాల్గొంటామని మద్దతు తెలుపుతూ తమ సంతకాలు పెట్టారు.

### కోటి సంతకాలకు నవంబరు 22 డెడ్‌లైన్

వైఎస్ఆర్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణకు నవంబరు 22వ తేదీ డెడ్‌లైన్ పెట్టినప్పటికీ అంతకంటే ముందుగా చంద్రగిరి నియోజకవర్గం నుంచి సంతకాల సేకరణను పూర్తి చేసి పంపించేందుకు పార్టీ క్యాడర్ సంసిద్ధులుకావాలని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సూచించారు. చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని 114 గ్రామ పంచాయతీల్లో సంతకాల సేకరణ జరగాలని, అందుకు పంచాయతీ పార్టీ అధ్యక్షులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి పంచాయతీ నుంచి సేకరించిన సంతకాల ప్రతులను రాష్ట్రపార్టీకి పంపించడం జరుగుతుందన్నారు.

### ప్రజా ఉద్యమంకు విశేష స్పందన

పాకాల మండలం బందార్లపల్లిలో జరిగిన కోటి సంతకాల ప్రజా ఉద్యమంకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. బందార్లపల్లికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేరుకోగానే అపూర్వ స్వాగతం పలికారు. గ్రామంలోని పిల్లలు, పెద్దలు, మహిళలు ఆయనతో ఆప్యాయంగా మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తమకు కష్టాలు తప్పడం లేదని దుమ్మెత్తి పోస్తూ సంకతాలు పెట్టేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. అలాగే పనపాకంపేట వద్దనున్న దళితవాడలో మహిళలు, యు-ువకులు సంతకాలు పెట్టి ప్రయివేటీకరణకు వ్యతిరేఖంగా తమ మద్దతును తెలిపారు. ఈ కార్యక్రమంలో పాకాల మండలం నుంచి మండల పార్టీ అధ్యక్షుడు నంగా నరేష్ రెడ్డి, ఎంపీపీ లోకనాథం, హరి ప్రసాద్ రెడ్డి, కపిలేశ్వర్ రెడ్డి, భాస్కర్‌నాయుడు, మున్నీర్‌బాయ్, గుండ్లూరి సురేష్, లోకనాథం రెడ్డి మధుబాబు, రహీంబాయ్, హసీన, మనోహర్‌రెడ్డి, వినాయక, హేమంత్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, నాగార్జున రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డీ, విష్ణురెడ్డి, మధురెడ్డి, కరుణాకర్, ఇమ్రాన్, అల్తాఫ్‌లతో పాటు వందలాదిగా కార్యకర్తలు తరలివచ్చారు.

# మోచి-నాయి బ్రాహ్మణ' సంఘాల భవనాలకు నిధులు



- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కు కృతజ్ఞతలు

**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** కోరుట్ల పట్టణంలోని రెండు వృత్తుల సంఘాలకు కేంద్ర నిధులతో అభివృద్ధి భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కోరుట్ల పట్టణ మోచి సంఘ భవన నిర్మాణ పనులకు రూ.3 లక్షలు, నాయి బ్రాహ్మణ సంఘ భవన నిర్మాణ పనులకు మరో రూ.3 లక్షలు మంజూరు చేసిన నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ కి సంఘాల సభ్యులు, స్థానిక బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

### అరవింద్ అభివృద్ధి పథంలో ముందుకు

### ( డా. రాచకొండ యాదగిరి బాబు )

ఈ రెండు భవనాల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలను కార్తీక పౌర్ణమి రోజున కోరుట్ల పట్టణంలోని ఝాన్సీ రోడ్ వద్ద జరిగాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ రాచకొండ యాదగిరి బాబు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో ఏ పార్లమెంటు సెగ్మెంట్ లో లేని అభివృద్ధి కార్యక్రమాలు నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎంపీ అరవింద్ చేపట్టారన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి నిధులు కేటాయిస్తూ ముందుచూపుతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల కోరుట్ల పట్టణానికి నవోదయ పాఠశాల మంజూరు కావడం ఇందుకు ఉదాహరణని పేర్కొన్నారు.

### స్థానిక నేతల సమిష్టి భాగస్వామ్యం

ఈ భవనాల నిర్మాణం పూర్తవడంతో రెండు వృత్తిజీవి సంఘాల కార్యకలాపాలకు స్థిరమైన వేదిక లభించనుందని బీజేపీ నేతలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాల్లో కోరుట్ల బీజేపీ పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎలేటి నరేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కస్తూరి లక్ష్మీనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేందర్, గిన్నెల శ్రీకాంత్, మేకల గణేష్, రాగంశెట్టి సాయి కృష్ణ, కొండ్లెపు రాజేంద్రప్రసాద్, అలాగే మోచి సంఘం మరియు నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

### ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య....



**నేటి సాక్షి,నారాయణపేట,నవంబర్ 5 :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించి సరియైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధిస్తూ వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణ చైతన్య మాట్లాడుతూ... వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు సరైన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో తప్పకుండా హెల్మెట్, సిట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపరాదు అని, రాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదు, వాహనాలకు సంబంధించిన ఆర్సి, లైసెన్స్ ఇన్సూరెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని ఎస్ఐ గారు తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించి పోలీసు వారికి సహకరించాలని ఎస్ఐ గారు తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని కోరారు

# భక్తి పారవశ్యంలో కొండాపురం అన్నదానం ధూప దీప నైవేద్యాలు



**నేటి సాక్షి జోగులాంబ గద్వాల కేటి దొడ్డి :** మండలంలోని కొండాపురం గ్రామంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆంజనేయ స్వామి గుడిలో కనివిని ఎరగని విధంగా ధూప దీప నైవేద్యాలు తో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు 1016 దీపాల తో గుడి ప్రాంగణంలో దీపాలంకరణ నిర్వహించారు అనంతరం సాయంత్రం ప్రముఖ గాయకుడు గట్టు నరేష్ భజన బృందంతో భజన కార్యక్రమం నిర్వహించి భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి మొట్టమొదటిసారిగా గ్రామ పెద్దలు యువకుల సహకారంతో అద్భుతంగా నిర్వహించారు పూజారి దీవెనలు ఈ విధంగా ఆ పరమశివుని ఆశీస్సులు గ్రామం అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలని ఐక్యమత్యంతో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో ఆదర్శ గ్రామంగా వెలుగొందుతోందని ఆశీర్వదించారు ఓం నమశ్శివాయ, శ్రీరామ జయరామ జయ జయ రామ, మృత్యుంజయ మంత్రము ఏకాత్మక మంత్రం పఠించారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు , యువతి, యువకులు, చుట్టుపక్కల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# భక్తులతో కిటకిటలాడిన మానస దేవాలయం



**నేటి సాక్షి,గన్నేరువరం, ( బుర్ర అంజయ్య గౌడ్) :** గన్నేరువరం మండలంలోని కాసింపేట గ్రామంలో వెలసిన స్వయంభు మానస దేవి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించి, మానస దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం శివ నామస్మరణలతో మారుమ్రోగింది. కార్తీక దీపాలు వెలిగించి ముక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏలేటి చంద్రరెడ్డి, ప్రధాన అర్చకుడు అమర్నాథ్ శర్మ భక్తులు పాల్గొన్నారు. గన్నేరువరం ఎస్సై జి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం అవాంఛనీయ ఘటనలు కలగకుండా పోలీసు సిబ్బంది ఏర్పాటు చేశారు.

# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..




## వైభవోపేతంగా యోగులపర్వతం కార్తీక దీపోత్సవం

**దివ్య వైభవంతో విజయవంతంగా నిర్వహణ**



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** పూజ్యశ్రీ ప్రతాప్ స్వామి దివ్య ఆశీస్సులతో, పవిత్ర యోగులపర్వతం వద్ద నవంబర్ 5, 2025 న నిర్వహించబడిన కార్తీక దీపోత్సవం మహత్తర వైభవంతో, భక్తిశ్రద్ధల నడుమ విజయవంతంగా పూ-ర్తయింది. ఉదయం నుండే అభిషేకాలు, హోమాలు, పూజలు, దీపారాధన, భజనాలు ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిర్వహించబడ్డాయి. భక్తులు తొలినుండి చివరిదాకా భక్తి, నియమం, ఆనందం నిండిన వాతావరణంలో పాల్గొన్నారు. ఈ సంవత్సరం దీపోత్సవానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది ు 6 అడుగుల ఎత్తైన దివ్య దీపం (కొప్పెర). దీనికై 1503 కిలోల నెయ్యి మరియు 2000 మీటర్ల ఒత్తు వినియోగించి సజీవ జ్యోతిగా ప్రతిష్ఠించబడింది. ఆ జ్యోతి వెలుగులో యోగులపర్వతం మొత్తం ప్రకాశించి, భక్తుల హృదయాలలో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపింది. ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆహారం, త్రాగునీరు, విశ్రాంతి కేంద్రాలు, మరియు ఇతర అవసరమైన సదుపాయాలు సమగ్రంగా అందించబడ్డాయి. భక్తులు ఎటువంటి అసౌకర్యం లేకుండా దీపోత్సవ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో అనుభవించారు. ఈ పవిత్ర దీపోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని, ప్రకృతి పరిరక్షణ, లోకశాంతి, ప్రజల శ్రేయస్సు, సమాజ సౌభ్రాతృత్వం కోసం ప్రార్థనలు చేశారు. ఆ జ్యోతి వెలుగులో యోగులపర్వతం ఆధ్యాత్మిక క్షేత్రంగా మారి, ప్రతి భక్తుడి హృదయంలో భక్తిజ్యోతి వెలిగించింది. "దీపం ఒకటి వెలిగితే చీకటి తొలగుతుంది, భక్తి వెలిగితే లోకం ప్రకాశిస్తుంది. ధర్మజ్యోతి మన హృదయంలో వెలిగినపుడు, అది యుగయుగాల వెలుగుకి మూలం అవుతుంది."

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ సభ్యులుకి ప్రమాద బీమా

**ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కును కుటుంబంకు అందజేత**



**నేటి సాక్షి, బాపట్ల జిల్లా (కర్లపాలెం) :** కర్లపాలెం పంచాయతీలోని టీడీపీ పార్టీ కార్యకర్త కనమర్లపూడి అజయ్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా నామిని అయిన వారి అమ్మగారికి 5 లక్షలు రూపాయిల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ పార్టీ మండల అధ్యక్షులు ఏపూరి భూపతిరావు మాట్లాడుతూ పార్టీకి వెన్నంటి ఉండి నడిచిన వారిని కష్టకాలంలో టీడీపీ పార్టీ ఆదుకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షేక్ బాజి, ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాష, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, కుమ్మరికుంట దాస్, బుల్లియ్య, పిట్ల వసంతరెడ్డి, కట్టా సుజాత, బొద్దుకురి విజయ తదితరులు పాల్గొన్నారు.

## నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యం గా మసున రవికుమార్

**జూబ్లీహిల్స్ లో భారీ మెజార్టీతో గెలుస్తాం నల్లంకి ధనరాజ్ గౌడ్**



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం నవంబర్ 05 :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో భాగంగా యూసుఫ్ గూడ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు జూబ్లీ హిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం విస్తృతంగా పర్యటించి ప్రచారం చేసిన. చేనేత విభాగం కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మసున రవికుమార్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ , ఎస్ సి సెల్ అధ్యక్షులు సంతోష్ కుమార్, సరూర్ నగర్ జనరల్ సెక్రెటరీ ఇమ్రాన్ అలీ, జిల్లా నాయకులు హబీబ్, మహిళా నాయకురాలు రవళి తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లుల్లో 'రహస్య' తనిఖీల మర్మమేంటో.!?

- 'ఆ-మూడు' రైస్ మిల్లులపై విజిలెన్స్-ఎన్ ఫోర్స్ మెంట్ అధికారుల దాడులు.?
- 'రూ.కోట్ల ధాన్యం-గల్లంతు'పై ఫిర్యాదుల ప్రభావమేనా.?
- గతంలోనూ 'రహస్య తనిఖీలే'..ఇప్పుడూ 'గుట్టుచప్పుడు' కాని దాడులే.? ఎందుకని.?
- 'అధికారులూ-రైస్ మిల్లుల యజమానుల' కుమ్మక్కు కోసమే కావొచ్చన్న ఆరోపణలు
- 'వివరణ' కోరిన 'నేటి సాక్షి'పై 'డిసిఎస్ఓ' ఫైర్



**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** కోరుట్లకు చెందిన బడా వ్యాపారులకి చెందిన మూడు రైస్ మిల్లుల్లో మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు 6-7 వాహనాల్లో వచ్చి 'రహస్యంగా' తనిఖీలు నిర్వహించినట్టు స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ దాడుల విషయం బయటకు పొక్కకుండా 'రహస్యంగా' ఉంచేసి..ప్రెస్ కు వివరాలు వెల్లడించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇదే విషయంపై జగిత్యాల డిసిఎస్ఓ జితెందర్ రెడ్డిని 'నేటి సాక్షి' వివరణ కోరగా 'వివరాలు' ఇవ్వకుండా 'విజిలెన్స్' అధికారులపై నెపంపెట్టి ఫైరయ్యారు. దీంతో ప్రజల అనుమానాలకు బలం చేకూరినట్లైంది.!

### ఇంతకూ ఈ తనిఖీలు ఎక్కడ .?

కోరుట్ల పట్టణంలోని ఓ పెద్ద రైస్ మిల్లుతో పాటు..కథలాపూర్ మండలంలోని సిరికొండలో మరో రెండు రైస్ మిల్లుల్లో విజిలెన్స్ అధికారులతోపాటు.. ఎన్ఫోర్స్మెంట్ అధికారులు కూడా 6-7 వాహనాల్లో వచ్చి దాడులు చేసినట్టు సంబంధిత వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశమైంది. తొలుత నూతనంగా నిర్మించిన రైస్ మిల్లుల్లో తనిఖీలతోపాటు.. జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు 'రైస్ మిల్లుల్లో' జరుగుతున్న 'అవినీతి దందా'పై బిజెపి కిసాన్ మోర్చ రాష్ట్ర నాయకులు 'ఆకుల రంజిత్' ఫిర్యాదు చేసిన రైస్ మిల్లులో కూడా తనిఖీలు నిర్వహించినట్టు సమాచారం.

### కోట్ల రూపాయల ధాన్యం గల్లంతు నిజమేనా.?

ఇటీవల రైస్ మిల్లుల్లో రూ.70-80 కోట్ల ధాన్యం గల్లంతైనట్టు కోరుట్ల 'బియ్యం వ్యాపార' వర్గాల్లో గుప్పుమంది. ఇదే క్రమంలో 'ఓ-రేషన్ బియ్యం లారీ' గల్లంతు వ్యవహారం కూడా తీవ్ర చర్చనీ యాంశమైంది. కోరుట్ల రైస్ మిల్లుల్లోనే గాక.. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా చాలా రైస్ మిల్లుల్లో వందల కోట్ల విలువైన ధాన్యం గల్లంతైందని.. ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ నుంచి మొదలుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు సంబంధిత శాఖాధికారులందరికి 'ఆకుల రంజిత్' ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వెంటనే స్పందించిన అధికారులు విచారణ చేపట్టినట్టు సమాచారం. తొలుత కోరుట్ల నుంచి దాడులు చేసి వివరాల కూపీ లాగుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

### ఇంత రాత్రి ఫోన్ చేస్తే.. వివరాలు చెప్పాల్నా.!? ( జగిత్యాల డిసిఎస్ఓ జితెందర్ రెడ్డి )

కోట్ల రూపాయల విలువైన ధాన్యం డబ్బులు కొల్లగొట్టిన రైస్ మిల్లుల్లో మంగళవారం అధికారులు 'మెరుపు దాడులు' చేశారటన్న సమాచారం అందుకున్న 'నేటి సాక్షి' సమగ్ర వివరాల కోసం జగిత్యాల జిల్లా డిసిఎస్ఓ జితెందర్ రెడ్డిని 'వివరణ' కోరింది. దానికి ఆయన ఒక్కసారిగా 'బీపీ' పెంచుకుని ఇంత రాత్రి ఫోన్ చేసి వివరాలు అడిగితే ఇవ్వాలా.?(అప్పుడు టైం రాత్రి 8-40) అంటూ ఫైరయ్యారు. మీరు దాడులు చేసిన విషయం తెలిసింది.! అధికారిక సమాచారం కోసం మిమ్మల్ని సంప్రదించాం..ఐనా 'ప్రెస్'కు రిలీజ్ చేయలేదు కదా.? మిమ్మల్ని అడిగింది వివరాలే కదా.? ఎప్పుడైనా 'ప్రెస్ వాళ్లు' అడగొచ్చు అంటే..దానికాయన విసుక్కుంటూ.. వెటకారంగా.. సరే! సార్.. మీరు అర్ధరాత్రి 12 గంటలకు ఫోన్ చేసి అడిగినా వివరాలు ఇస్తాం..సరేనా.? దాడులు చేసిన 'విజిలెన్స్' అధికారులు ఇంకా మాకు రిపోర్ట్ ఇవ్వలేదు ..వాళ్లు ఇచ్చినంక చెప్తామని అర్ధాంతరంగా ఫోన్ కాల్ కట్ చేసేశారు.!

### రైస్ మిల్లుల్లో అసలేం జరుగుతోంది?

జగిత్యాల జిల్లాలో 100 కు పైగా రైస్ మిల్లులుండగా.. ఇందులో చాలా రైస్ మిల్లుల్లో 'గోల్ మాల్' జరుగుతున్నట్టు దుమారం రేగుతోంది. రైస్ మిల్లుల యజమానులు 'అక్రమ రేషన్ బియ్యం' దందా 'డీలర్ల'తో కుమ్మక్కై గుట్టుచప్పుడు కాకుండా యధేచ్ఛగా నడిపిస్తున్నారన్న ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. అదేవిధంగా ప్రభుత్వానికి ధాన్యం పెండింగ్ బకాయిల వ్యవ్వారం కూడా శృతిమించిందన్న ఆరోపణలున్నాయి. 'సివిల్ సప్లై అధికారులు - రైస్ మిల్లర్ల యజమానులకు' మధ్య రహస్య ఒప్పందాలేవో ఉన్నాయి కాబట్టే ఏ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారని చర్చించుకుంటున్నారు. ఇప్పుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జరిగిన 'విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్' అధికారుల దాడుల వ్యవహారం 'ప్రెస్'కు వెల్లడించకపోవడం.. వివరాలు అడిగిన 'నేటి సాక్షి'పై 'డిసిఎస్ఓ' ఫైర్ కావడంపై ప్రజలు చర్చించుకుంటున్న అనుమానాలకు బలం చేకూరినట్లైంది.!

## కమీషనర్ సార్..మీరు వాడే కారు వివరాలు కావాలి.!

- మాకు అనుమానంగా ఉందంటూ.. ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకున్న యువకుడు



**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవిందర్ గౌడ్ వ్యవహారశైలీపై మాకు అనుమానంగా ఉంది..వివిధ అంశాలపై మేం ఎన్నిసార్లు ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకున్నా..'థర్డ్ పార్టీ' అని..చేతులు దులిపేసుకునేలాంటి 'మొక్కుబడి' సమాధానాలు ఇస్తున్నరని..ఆయన వాడే 'వెన్యూ వైట్ కలర్ కారు' వివరాలు..అతని డ్రైవర్ గురించి కోరుట్లకు చెందిన ఒక యువకుడు 'సమాచారు హక్కు చట్టం' కింద మంగళవారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ వ్యవహారం పట్టణంలో చర్చానీయాంశమైంది. గత జూన్ నెల 27 నుంచి మీరు కోరుట్ల మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి.. ప్రజావసరాల కోసం వాడుతున్న 'వెన్యూ వైట్ కలర్ కారు'కు సంబంధించిన వివరాలు కావాలని కోరుట్ల పట్టణానికి చెందిన కట్కం. చంద్రశేఖర్ ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకున్నారు. ఆయన వాడుతున్న కారు ప్రభుత్వ వాహనమా.? మీ స్వంత వాహనమా.? లేక కాంట్రాక్టు వాహనమా.? ఆ కారుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ నెంబర్..దాని యజమాని వివరాలు కావాలని ఆ దరఖాస్తులో కోరారు. అలాగే.. మీరు వాడుతున్న కారు డ్రైవర్ సానిటరీ వర్కరా.? లేక కాంట్రాక్టు టెండర్ కు సంబంధించిన వ్యక్తా.? అతని పూర్తి వివరాలు కావాలని..వీటితో పాటు ఆ డ్రైవర్ జీత-భత్యాల గురించిన వివరాలు కావాలని చంద్రశేఖర్ ఆ దరఖాస్తులో కోరారు. ఇప్పుడు కమిషనర్ ఎలాంటి వివరాలు ఇస్తారో.? సరైన వివరాలు ఇస్తారో.? లేక ఇది కూడా 'థర్డ్ పార్టీ'అనో.. 'ఇవ్వకూడని' వివరాలనో ఎప్పటిలాగే చేతులు దులుపుకుంటారో వేచిచూడాల్సిందే.!

## జగిత్యాల లో ఘనంగా గురునానక్ జయంతి వేడుకలు



**నేటి సాక్షి జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో గురునానక్ జయంతి సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ACS రాజు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ సిక్కు మత స్థాపకులు గురునానక్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు, సిక్కు సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. వినయం, సేవాభావంతో జీవితాన్ని గడపాలని చెప్పిన గురునానక్ సందేశం సదా అనుసరణీయమని అన్నారు. గురునానక్ ప్రవచించిన ప్రేమ, కరుణ, మానవతా సందేశాలు అందరినీ సరైన మార్గంలో నడిపిస్తాయని ఆయన ఆకాంక్షించారు. శ్రమ గౌరవాన్ని, సంపాదించిన దానిని ఇతరులతో పంచుకోవాలని గురునానక్ బోధించారని ప్రజలు సోదరభావం, సామరస్యం, ఆత్మగౌరవంతో జీవించాలనే చింతనను ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. గురునానక్ జీవితం, ఆయన బోధనలు మానవాళికి నిరంతరం ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ACS రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీ నాదం, జిల్లా కార్యదర్శి సింగం గంగాధర్, సమరసత వేదిక అధ్యక్షుడు గంగాధర్, నారేందులా శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బొందుకూరు శ్రీనివాస్, వేముల దేవ రాజం, గాదాసు భూమన్న, కొత్తకొండ బాలన్న, మాజీ కౌన్సిలర్ బండారి మల్లికార్జున్, తునికి అంజన్న, చిలుక రాజన్న, బా శెట్టి ప్రభాకర్, ఎడమల వెంకటరెడ్డి, సిరిపురం గంగారం, గణపతి నరేందర్ రాజు, ఆర్ఎస్ఎస్ వీరన్న, చిలుక సత్యం తదితరులు పాల్గొన్నారు.

## డబిల్ గూడ ప్రధాన రహదారి గుంతల మయం

**బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా.**



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం నవంబర్ 05:** మహేశ్వరం మండలంలోని డబిల్ గూడ గ్రామ ప్రధాన రహదారి గుంతల మయమై గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ మహేశ్వరం మండల శాఖ ఆధ్వర్యంలో, మండల ప్రధాన కార్యదర్శి బత్తుల ఉపేందర్ అధ్యక్షతన డబిల్ గూడ చౌరస్తాలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ:-డబిల్ గూడ గ్రామంపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ కావాలనే మా గ్రామ రోడ్డు పనులను నిలిపివేశారు అని ఆరోపించారు. ముఖ్య అతిథి కుండే వెంకటేష్ మాట్లాడుతూ తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించకపోతే, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని మహేశ్వరం మండలంలో ప్రతి చోట అడ్డుకుంటాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బుగ్గని శంకర్, జిల్లా కార్యదర్శి యాదయ్య గౌడ్, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు దేశ్య నాయక్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్ యాదవ్, మంత్రి ముత్యం, గోపాల్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి శ్రావణ్, ఉపాధ్యక్షులు రూప్ సింగ్, కంది శ్రీను, బొమ్మ దేవేందర్, కాసాని ఆనంద్, బీజేవైఎం జిల్లా నాయకులు బొర్రా సాయిలు, భారత్, మాధవ్, బొర్రా మహేష్, ప్రకాష్, దేవేందర్, జనార్ధన, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ హైవే రోడ్డు నాసిరకం- పైపైనే ఎన్ హెచ్ అధికారులు తనిఖీలు



**నేటి సాక్షి:నంద్యాల బ్యూరో నవంబర్ 05 :** కర్నూల్ జిల్లా నుంచి నేషనల్ హైవే 340సి రహదారి రూ.1200 కోట్లతో నాలుగు లైన్లు రహదారి విస్తరణ మొదలుపెట్టారు. జాతీయ రహదారి నిర్మాణం ఏర్పాటయితే ఆ దారి వెంబడి ఉండే గ్రామాల ప్రజలు, వాహనదారులు ఎంతో సంతోష పడతారు. ప్రయాణ కాలం తగ్గడంతో పాటు ప్రమాదాలకు చోటు ఉండకపోవడమే కారణం, అయితే ఇందుకు విరుద్ధంగా ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా వెళ్తున్న కర్నూలు -గుంటూరు ప్రధాన రహదారి 340సీ జాతీయ రహదారి నిర్మాణం సాగుతోంది. చినుకు పడితే ఫ్లైఓవర్లు పై వాహనాలు నిలుపుదల చేసి సర్వీస్ రోడ్డు గుండ వాహనాలను పంపిస్తున్నారు. ఎందుకంటే నందికొట్కూరు పట్టణంలోని మిడుతూరు ఫ్లై ఓవర్ బయటకు ఉబ్బుతుంది. కొన్ని నెలల క్రితం ఉబ్బుతున్న వాటికి రాడ్లు ఏర్పరిచి సమస్యను మూసివేశారు. అబద్ధం ఎంత దాచిన ఏదోక రూపంలో బయటికి వస్తుంది అనే సామెతలో ఉన్నట్లు, క్వాలిటీని ఎంత దాచినప్పటికీ, ఇప్పుడు మెల్ల మెల్లగా ఫ్లైఓవర్ బాగోతం బయటకు వస్తుంది. రాడ్లు ఏర్పరచినప్పటికీ ఫ్లైఓవర్ ముందుకు ఉబ్బుతూనే బయటకు వస్తుంది. అప్పుడు ఫ్లైఓవర్ కి ఒక సైడు నుంచి రాడ్ల మరమ్మతులు చేసి వదిలేశారు. ఇప్పుడు ఫ్లైఓవర్ పై రాడ్లు దింపేందుకు ఫ్లవర్ పై ఓల్స్ ప్రయత్నాలు చేస్తున్నట్టు కనిపిస్తుంది. వీటికి కారణం అతి త్వరగా పూర్తి చేయాలని ఉద్దేశం అలాగే నాణ్యత లోపించి కూడా వీటికి కారణమని ప్రయాణికుల నుంచి విమర్శనాలు వస్తున్నాయి. ఫ్లైఓవర్ ఎప్పటికైనా ప్రమాదమని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్లు ఇష్టారా జ్యంగా వ్యవహరిస్తుండటంతో ఒక మనిషి విలువైన ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనీ ఓ వైపు నాసిరకం పనులు.. మరో వైపు రాజకీయ మలుపులతో రోడ్డు మన్నికపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2014 లో మంజూరైన ఈ రహదారి 2025 నాటికి కూడా పూర్తిగా పనులు జరగలేదు. నేషనల్ హైవే పై నాసిరకప్పు రోడ్డు వేసి అక్కడక్కడ రోడ్లపై పగుళ్లు ఏర్పడుతున్నాయి. ఏ ఫ్లైఓవర్లు చూసిన ముక్కున వేలేసుకుంటున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో చేసిన పనులనే మళ్లీ చేయాల్సి వస్తోంది. శ్రీశైలం ప్రధాన కుడిగట్టు ఎస్ఆర్ఎంసి ( తెలుగు గంగా ) లో జరిపిన తవ్వకాలలో బయట పడిన బిలుకు (స్పయిల్) ను గుట్టలుగా పేరుకుని ఉంది. ఈ బిలు కును అక్కడే ఒక క్రషర్ నెల కొల్పి సన్నని ముక్కలుగా చేసి అలా తయారైన కంకరను 340సీ జాతీయ రహదారి అడుగు పాటుకు వినియోగించారు. రోడ్డు మాత్రమే కాదు అక్కడక్కడ రోడ్డు భద్రతకు సైడ్ కు కూడా వాడారు. నేషనల్ హైవే ఫ్లైఓవర్ సైడ్ (పక్కనే) ఎర్ర రాయి వాడటం సాధారణంగా అనుమతించబడదు. నేషనల్ హైవేల పరిధిలో ఫ్లైఓవర్ సైడ్ వైపు సాధారణంగా డోరైన రోడ్డు రక్షణ కోసం గ్రానైట్ రాయి, తెల్లటి రాయినే వాడాలి. అంతే కాకుండా, రహదారుల నిర్మాణంలో సైడ్ రాయి క్రష్డ్ లైమ్ స్టోన్ వంటివి ఉపయోగించడం మంచిదనీ ఎందుకంటే ఇవి తక్కువ ఖర్చుతో ఎక్కువ కాలం నిలిచే నిర్మాణాన్ని ఇవ్వగలవని నేషనల్ హైవేలకు సైడ్ కు క్రష్డ్ స్టోన్, ముఖ్యంగా క్రష్డ్ లైమ్ స్టోన్ లేదా గట్టి రాళ్ళను వాడాలి అని తెలిసిన ఎర్ర రాయి రహదారి సైడ్ కు బేర్చారు. వాటిని అధికారులు చూసిన చూడనట్టు వ్యవహరిస్తున్నారు. జూపాడు బంగ్లా ఫ్లైఓవర్ రహదారిపై గుంతలు గుంతలుగా ఏర్పడిన వాటికి మరమ్మతులు మొదలుపెట్టారు. కృష్ణరావుపేట ఫ్లవర్ పై గుంతలను సన్నటి కంకర ద్వారా కనిపించకుండా పూర్తి వేశారు. ఒకవైపు గుంతల ద్వారా ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అప్రమత్తం అవ్వాల్సిన నేషనల్ హైవే అధికారులు గుంతలు పడితే ప్యాచ్ వర్క్ చేస్తారు కదా అనే ఆలోచన ఉన్నారు కానీ. ఒక గుంత వల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే కుటుంబాలను రోడ్డున పడతారనే విషయాన్ని మరిచారు. ఇటువంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా చూడావాల్సిన బాధ్యతను మర్చిపోయారంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### బన్నూరు పాత బ్రిడ్జి స్థితిగతులు :

బన్నూరు గ్రామం వద్ద పాత బ్రిడ్జి పైన హైవే పనులు పూర్తి చేశారు. బ్రిడ్జిని కూల్చి వాటి స్థానంలో కొత్తగా బ్రిడ్జి నిర్మించి వాటిపైన నేషనల్ హైవే రహదారి విస్తరణ పనులు జరిగే విధంగా అధికారులు చేయాలి. కానీ పాత బ్రిడ్జి పైనే మరమత్తులతో పూర్తి చేశారు. పాత బ్రిడ్జి కూల్చాల్సిన అవసరం లేదని వాటిపైనే రహదారులు ఏర్పాటు చేయాలని అధికారులు వెల్లడిస్తున్నారు. పాత బ్రిడ్జి క్రింద నెర్రలు కొట్టి, అడుగు భాగాన స్లాప్ పేక్కులు పెక్కులుగా రాలి, కడ్డీలు నాణ్యతను కోల్పోయి కింద పడుతున్నాయి. పాత బ్రిడ్జి 10 సంవత్సరాలు కూడా వుంటుందో లేదో కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చే దిశలో అధికారులు ఉన్నట్లు విమర్శలను వస్తున్నాయి. కాంట్రాక్టర్లను మెయింటెనెన్స్ 15 నుంచి 20 సంవత్సరాల వరకు మాత్రం ఉంటుంది అంతవరకు పనికి వస్తే చాలన్నట్లు అధికారులు అభిప్రాయంగా ఊహించు కుంటున్నట్లు వాహనదారులు చర్చించుకుం టున్నారు. వాటి స్థానంలో కొత్త బ్రిడ్జి ఏర్పాటు చేస్తే 30 నుంచి 40 సంవత్సరాల వరకు బ్రిడ్జిపై వాహనదారులు సుఖవంతంగా ప్రయాణం కొనసాగించవచ్చు. ఇన్ని ప్రధాన సమస్యలు ఉన్నప్పటికీ నేషనల్ హైవే పిడీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లపై ఏదైనా ప్రమాదం సంభవిస్తే పిడి నిర్లక్ష్యంలే వీటికి ప్రధాన కారణం అని వాహనదారుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.

# జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం

- శశికాంత్ ఆధ్వర్యంలో గుడిపాలలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం
- కూటమి ఐక్యతను చాటి చెప్పిన జనసేన పార్టీ..
- ఐక్యంగా పని చేద్దామని పిలుపునిచ్చిన జనసైనికులు
- ప్రజాసేవే మా పరమావధి అని ఉద్ఘాటించిన కూటమి ప్రజా ప్రతినిధులు



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) చిత్తూరు, గుడిపాల :**ఉన్నత ఆశయంతో.. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు, మంత్రి నాదెండ్ల మనోహర సూచనల మేరకు బుధవారం చిత్తూరు నియోజకవర్గం గుడిపాలలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని.., ఆ పార్టీ సీనియర్ నేత పగడాల శశికాంత్ ఆధ్వర్యంలో పండుగ వాతావరణంలో నిర్వహించారు.జనసేన పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు ఈ కార్యక్రమంలో చిత్తూరు ఉమ్మడి జిల్లాల జనసేన పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ప్రభుత్వ విప్, కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్ మోహన్ ముఖ్య అతిథులుగా విచ్చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు కార్యక్రమానికి విచ్చేసిన ప్రజాప్రతినిధులు, కూటమి కుటుంబ సభ్యులకు చిత్తూరు జనసేన పార్టీ తరపున చిత్తూరు జిల్లా జనసేన పార్టీ సీనియర్ నాయకులు పగడాల శశికాంత్.., చిత్తూరు జిల్లా జనసేన పార్టీ శ్రేణులు తామశెట్టి నాగేంద్ర, దేవర మనోహర్, కిరణ్ రాయల్, పున్నా యుగంధర్, కవిత,శుభాషిణి, రమాదేవి, కీర్తన.. తదితరులు సాదర స్వాగతం పలికారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలు.. గుడిపాలలో జనసేన పార్టీ పతాకాన్ని చేతబూని భారీ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రేణుల నినాదాలతో గుడిపాల దద్దరిల్లింది. దీంతో కూటమి ఐక్యతను మ-రోసారి చాటి చెప్పింది జనసేన పార్టీ..ఈ సందర్భంగా నిర్వహించిన జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం సభలో చిత్తూరు ఉమ్మడి జిల్లాల జనసేన పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ప్రభుత్వ విప్, కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్ మోహన్ మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పినట్లు మరో పదిహేను సంవత్సరాలు బిజెపి, టిడిపి,జనసేన పార్టీలు సమైక్యంగా పనిచేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రగతి పథంలో పయనిస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదని స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా సీనియర్ జనసేన పార్టీ నేత పగడాల శశికాంత్ లాంటి చిత్తశుద్ధి కలిగిన కార్యకర్త పార్టీకి చాలా అవసరం ఆయన్ను ఈ సందర్భంగా అభినందించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ దేశం ప్రపంచ దేశాలను ఆకర్షిస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు సంయుక్త నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ..ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వైపు దూసుకెళుతోందని వారు తెలియజేశారు. కూటమిలో నాయకులు, కార్యకర్తలు పార్టీలిచ్చిన ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ..పార్టీల బలోపేతానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.. పార్టీ కోసం అంకిత భావంతో పని చేసిన ప్రతి కార్యకర్తను బిజెపి, టిడిపి, జనసేన పార్టీల అధిష్టానాలు గుర్తు పెట్టుకొని తగిన విధంగా గౌరవిస్తాయని తెలిపారు.. ప్రజాసేవే.. పరమావిధిగా ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం పై పనికట్టుకుని బురదజల్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నా.., వైకాపా కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తిరుపతి జనసేన పార్టీ వైస్ ప్రెసిడెంట్ దినేష్, జనసేన పార్టీ నేతలు శ్రీనివాసులు, భాను, రాజారెడ్డి,పుష్పావతి, చిన్న శ్రీ వేలు, మల్లెల శివ , సుమన్, జి.కే.రాయల్, హేమాద్రి నాయిడు, హేమంత్ చెక్కరాల, బాబు యాదవ్,ఆది కేశవులు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు పరిమితి ఎత్తివేయాలి

### సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్




**నేటి సాక్షి, బెజ్జంకి :** పత్తి కొనుగోలులో సీసీఐ విధించిన ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితిని వెంటనే ఎత్తివేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో జరిగిన సీపీఎం సమావేశంలో మాట్లాడిన ఆయన, కిసాన్ కపాస్ యాప్ రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని, గ్రామీణ రైతుల్లో ఎక్కువ మందికి స్మార్ట్‌ఫోన్ వాడకం తెలియకపోవడం వల్ల పంట అమ్మకాలు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు.వర్షాల కారణంగా పత్తిలో తేమ శాతం పెరగడంతో సీసీఐ కేంద్రాలు పత్తి స్వీకరించకపోవడం వల్ల రైతులు ప్రైవేట్ వ్యాపారస్తులకు తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతి పై 11% సుంఖాన్ని ఎత్తివేయడం భారత రైతులకు భారీ నష్టమని పేర్కొన్నారు.పత్తి రైతుల సమస్యలు తీరే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొమ్మిడి సాయి కృష్ణ, సంఘు ఎల్లయ్య, బోనగిరి లింగం తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో శ్రమదానం..!

### స్వచ్ఛత కోసమే శ్రమదానం.. యూత్ అధ్యక్షుడు నాంచారి రాకేష్..



**నేటి సాక్షి ప్రతినిధి, రుద్రంగి : ( కోక్కుల వంశీ ) :** సమాజ శ్రేయస్సు కోసం చేసే ప్రతీ పనిలో ఆనందం ఉంటుందని, స్వచ్ఛత కోసమే శ్రమదానం చేపట్టినట్లు ముదిరాజ్ యూత్ అధ్యక్షుడు నాంచారి రాకేష్ తెలిపారు.బుధవారం మానాల గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆవరణలో శ్రమదానం చేశారు. దాదాపు మూడు గంటల పాటు ముదిరాజ్ యూత్ సభ్యులతో కలిసి ముళ్లపొదలు, చెత్తాచెదారం, గడ్డి, పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు.ఈ సందర్భంగా ముదిరాజ్ యూత్ అధ్యక్షుడు మాట్లాడుతూ... శ్రమదానంతో శారీరక వ్యాయామంతో పాటు పరిసరాలు పరిశుభ్రం అవుతాయన్నారు. గ్రామ ప్రజలు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ ఉప అధ్యక్షుడు ఇండ్ల అజయ్, పిసరి రవీందర్, జంగిలి మహేష్,గుర్రపు చందు, మడవేని రాజు, నీలం గణేష్, పండుగు గణేష్,ఓలవేని శ్రీనివాస్,నాంచారి సిద్దు, ముదిరాజ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# వేడుకగా సామూహిక వడిబియ్యం.

### సుమారు 4 వేల మంది మహిళలకు సామూహిక వడి బియ్యం



**నేటి సాక్షి:నంద్యాల నవంబర్ 05 :** నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన సామూహిక వడిబియ్యం వేడుకగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల పుల్లయ్య స్వామి, నారాయణస్వామి, వీరస్వామి, కార్యనిర్వాహణాధికారి రామక్రిష్ణ ఆధ్వర్యంలో పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్సై నరేంద్రనాథ్ రెడ్డి, గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో సంతానలేని మహిళలకు సామూహిక వడి బియ్యం కార్యక్రమము పండుగలా నిర్వహించారు.రాష్ట్ర నలుమూలల నుండి యేగాక ఇతర రాష్ట్రాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చారు, వచ్చిన భక్తులందరూ శ్రీవల్లి సహిత సుబ్రహ్మణ్యం స్వామివార్లను దర్శించుకుని అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం కళ్యాణ మంటపము నందు సంతాన లక్ష్మి పూజ నిర్వహించి సంతానము లేక హాజరైన సుమారు 4 వేలు మందికి చీర, సారెతో ఉచితంగా ఇవ్వబడిన బియ్యము పోసి సంతాన లక్ష్మి పూజ చేయించి వేదమంత్రములతో ఆశీర్వదించారు. అనంతరం హాజరైన భక్తులందరికీ అన్న ప్రసాదము వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, పురుషోత్తం రెడ్డి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, ఎన్సిసి విద్యార్థులు, వివిధ సేవకులు, గ్రామ ప్రజలు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలకు పంట నష్టం రైతులను వెంటనే ఆదుకోవాలి

### రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ సాంస్కృతిక శాఖ కో కన్వీనర్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి



**నేటి సాక్షి ప్రతినిధి మహేశ్వరం నవంబర్ 5:** అకాల వర్షాలకు రైతుల పంట నష్టాన్ని వ్యవసాయ శాఖ వారు వెంటనే గుర్తించి వారికి నష్టపరిహారం చెల్లించే విధంగా చూడాలని కర్రెడ్ల నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తే రైతులకు కొంతవరకు మేలు జరిగేదని పేర్కొన్నారు.ఇప్పటికే రైతుబంధు ఇవ్వాల్సింది ఇవ్వకపోవడంతో పెట్టుబడి సాయం కింద అప్పులు తెచ్చి రైతులు పంటలు సాగు చేయడం జరిగింది. ఇప్పుడు ఈ అకాల వర్షాలకు రైతులు మరింత నష్టపోయిన అప్పుల బాధలో పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాం అదేవిధంగా రైతుబంధు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..


# మానాలలో ముదిరాజ్ యూత్ నూతన కార్యవర్గం

**నూతన అధ్యక్షుడిగా నాంచారి రాకేష్..**



**నేటి సాక్షి ప్రతినిధి, రుద్రంగి : ( కోక్కుల వంశీ ) :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో ముదిరాజ్ యూత్ నూతన కార్యవర్గాన్ని ముదిరాజ్ యూత్ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం సంఘం సభ్యుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి నూతన అధ్యక్షుడిగా నాంచారి రాకేష్, ఉపాధ్యక్షుడిగా ఇండ్ల అజయ్ లను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు నాంచారి రాకేష్ మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పగించినందుకు ముదిరాజ్ యూత్ సంఘం అభివృద్ధి కోసం సహాయ శక్తుల కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసరి రవీందర్, జంగిలి మహేష్,గుర్రపు చందు, మడవేని రాజు, నీలం గణేష్, పండుగు గణేష్,ఓలవేని శ్రీనివాస్,నాంచారి సిద్దు, ముదిరాజ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు

# వైభవోపేతంగా కార్తీక పౌర్ణమి దీపారాధన

**భక్తి భావంతో సత్యనారాయణ వ్రతం**



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :**కార్తీక పౌర్ణమి దీపోత్సవంలో పురస్కరించుకుని రాయల చెరువు పేట లోని తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి స్వగృహంలో మాధవి తిరుమల రెడ్డి దంపతులచే అత్యంత భక్తి భావంతో బుధవారం అర్చకులు సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు అనంతరం ఉత్సవ విగ్రహానికి కుంకుమ అర్చనలతో పాటు వివిధ రకాల సుగంధ పరిమళ భరిత ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు ఈ వ్రతానికి గ్రామంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు వచ్చిన మహిళా భక్తులకు తిరుమలరెడ్డి దంపతులు పసుపు కుంకుమలతో సారెను అందజేశారు

# ఏఈఓ సాయిరాం సార్ మీకు సలాం..



**నేటి సాక్షి పాలేరు , నవంబర్ 05:** వృత్తి పట్ల నిబద్ధత , రైతులకు న్యాయం చేయాలనే సంకల్పం .. తుఫాన్ వల్ల దెబ్బతిన్న పొలాలను పరిశీలించాలి .. వెళ్ళడానికి దారి లేకపోతే ఏంటి .. పడవలో వెళ్ళాడు రైతుల కోసం ఓ అధికారి.. వివరాలు ఇలా ఉన్నాయి. .కూసుమంచి మండలం పాలేరు క్లస్టర్ ఏఈఓ సాయిరాం తన వృత్తి పట్ల నిబద్ధత చాటారు.. మంగళవారం తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పొలాలను పరిశీలించడానికి ఓ మత్స్యకారుని సహాయంతో చెరువులో పడవ ప్రయాణం చేసి తుఫాన్ కారణంగా నష్టపోయిన ఓ రైతు పొలాలను పరిశీలించాడు.. ఈ ఫోటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారడంతో పలువురు ఏఈఓ సాయిరాం కు అభినందనలు తెలియజేస్తున్నారు. రైతు పొలంకు వెళ్ళడానికి దారి లేకపోవడంతో అప్పటికే ఒకసారి వాయిదా వేసుకున్నారు.. కానీ రైతు నష్ట పోవద్దని ధైర్యం చేసి ఇలా పడవలో వెళ్ళాడు.. అందరూ ఏఈఓ సాయిరాం సార్ సలాం మీకు అంటున్నారు..

# పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం వెంటనే ఇవ్వాలి

- **పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం వెంటనే ఇవ్వాలి**
- **సమావేశంలో రైతు సంఘం నాయకులు**




**నేటి సాక్షి:పాములపాడు నవంబర్ 05 :** ఇటీవల కురిసిన మెంథ భారీ తుఫాను వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం తక్షణమే ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి వెంకటేశ్వరరావు కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి స్వామన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు బుధవారం స్థానిక నెమలి వెంకట రెడ్డి సిపిఎం పార్టీ ఆఫీసులో మాట్లాడుతూ మండలంలో 14 గ్రామపంచాయతీలు తొమ్మిది మజారా గ్రామాలు ఉంటే కేవలం 7 గ్రామపంచాయతీ చెందిన రైతులకు నష్టపరిహారం ప్రకటించడం మిగతా గ్రామాల రైతులకు ఎందుకు ప్రకటించలేదని వారు అధికారులను ప్రశ్నించారు ఖరీఫ్ సీజన్ నుంచి మొదట్లో వర్షాలు పడక వేసిన పంటలు దునివేయడం జరిగిందనీ. మళ్లీ తర్వాత వేసిన మొక్కజొన్న సోయాబీన్ ఉల్లి మిరప పంటలకు అధిక వర్షాలు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు అతివృష్టి అనావృష్టి ప్రకృతితో పోరాడుతూనే రైతులు కౌలు రైతులు పండించిన మొక్కజొన్న పంటకు సరైన గిట్టుబాటు మద్దతు ధర లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు రైతులకు పంటల బీమా పథకం ఉండి ఉంటే ఇబ్బందులకు గురయ్యేవారు కాదన్నారు అలాగే మొక్కజొన్న పంటకు 2400 మద్దతు ధర ఉంటే ప్రైవేటు వ్యాపారస్తులు కేవలం 1750 కొంటున్నారని దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు ప్రభుత్వం తక్షణమే మార్క్ ఫెడ్ ద్వారా మండల కేంద్రాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు పంట నష్టపరిహారం అంచనా వేయడంలో వ్యవసాయ అధికారులు విధుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు వచ్చే రబి సీజన్లో అన్నదాతలకు ఉచితంగా సబ్సిడీ విత్తనాలు ఎరువులు ఇవ్వాలని అలాగే రుణమాఫీ కూడా చేయాలని వారు కోరారు మండలంలోని అన్ని గ్రామాలలో నష్టపరిహారం క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేయాలని వారు సూచించారు ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రజా ప్రతినిధులైన ఎమ్మెల్యే ఎంపీ జోక్యం చేసుకుని రైతులకు పంట నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మేకల రాజు రైతులు శ్రీను రాజన్న పాల్గొన్నారు

# నిరంతరం నియోజవర్గ అభివృద్ధి కి కృషి



- **10 లక్షల 25 వేల రూపాయల LOC ప్రొసీడింగ్స్ అందజేసిన - ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్**

**నేటి సాక్షి (పూరెల్ల బాపు) జగిత్యాల :**జగిత్యాల రూరల్ మండల అంతర్గం గ్రామానికి చెందిన పల్లపు సాత్విక్ హార్మోన్ డెఫిషియన్సీ తో బాధపడుతూ ఉండగా గ్రామ నాయకులు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ దృష్టికి విషయాన్ని తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం 2లక్షల 75 వేల LOC ని అందజేశారు, రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కొదురుపాక కళావతి మెదడు సంబంధిత సమస్యతో బాధపడుతూ ఉండగా నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం మంజూరైన 2 లక్షల 50 వేల LOC నీ ,జగిత్యాల పట్టణ జెండా మైసేహల కి చెందిన యండి మజీద్ కూతురు మజాబాతంకిన్ నరాల సంబంధిత సమస్యతో బాధపడుతూ ఉండగా నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం మంజూరైన 2 లక్షల 50 వేలు,జగిత్యాల పట్టణ హనుమాన్ వాడ కి చెందిన నలువల రమేష్ నరాల సంబంధిత సమస్యతో బాధపడుతూ ఉండగా నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం మంజూరైన 2 లక్షల 50 వేల రూపాయల LOC లను లబ్ధిదారులకు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, మాతా శిశు ఆసుపత్రిలో రోగులకు ఆక్సిజన్ కొరత లేకుండా ,ఆక్సీజన్ ప్లాంట్ ఏర్పాటు చేయటం జరిగింది. పెద్ద సిలిండర్, ఆక్సిజన్ పైపులు మాతా శిశు క్రిటికల్ కేర్ యూనిట్ కు అనుసంధానం చేశామని, నిరంతరం నియోజవర్గ అభివృద్ధి కి కృషి చేస్తామని, త్వరలో జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అభివృద్ధి పనులకు దాదాపు టెండర్ ప్రక్రియ పూర్తిందని , రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దామోదర రాజనర్సింహ,వీలైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కూడా ఆహ్వానించి భూమి పూజ చేస్తానని తెలిపారు. చాలా ఖర్చు తో కూడిన పలు వ్యాధులతో పాటు,అరుదైన వ్యాధులతో బాధ పడుతున్న జగిత్యాల కు చెందిన బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి కి ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు., ఒక డాక్టర్ గా నన్ను గెలిపించిన జగిత్యాల నియోజకవర్గానికి గతంలో ఎప్పుడూ లేని విధంగా కోట్ల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు., గత 2023 కు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు కూడా నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వచ్చిన తర్వాత ఆయన్ను కలవగా కోట్ల రూపాయల పాత బకాయిలు విడుదల చేశారన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే విదంగా కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ ఖాదర్,ముజాహిద్,తోట మల్లికార్జున్,ఖాజిం అలీ,సయ్యద్ గౌస్,మల్లేష్, రవి,సత్తిరెడ్డి,రామకృష్ణ రెడ్డి,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జీళ్ళచెరువు గ్రామంలో రంగరంగ వైభవంగా తెప్పోత్సవం

**నేటి సాక్షి పాలేరు ,నవంబర్ 05 :** కూసుమంచి మండలం, జీళ్ళచెరువు గ్రామంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం ఆధ్వర్యంలో తెప్పోత్సవం కార్యక్రమం అంగరంగవైభవంగా జరిగింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తెప్పోత్సవం ను ప్రారంభించారు. గ్రామంలోని ఊరచెరువులో కనులవింధుగా తెప్పోత్సవం జరగ్గా, వేలాది మంది కనులారా తిలకించారు. ప్రధానార్చకులు ముడుంబ శ్రీమన్నారాయణ చార్యులు, సాయిరామాచార్యులు, చిలకమర్రి స్వామినాథ్, స్వామి వారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగలక్ష్మి సత్యనారాయణ, ఈవో జగన్మోహన్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంచర్ల జీవన్ రెడ్డి, పెంద్ర అంజయ్య, ఐతగాని నాగేశ్వరరావు, ఇంటూరి పుల్లయ్య, కొండా శ్రీనివాస్ రావు, మొక్క ఉపేందర్, శ్రీవెంకటేశ్వర స్వామి అంబాల వెంకటలక్ష్మి, లక్ష్మి నారాయణ, ఐ.రంగయ్య, ఎం. ఉపేందర్, ఐ. ప్రభాకర్, డైరెక్టర్లు



బాలబోయిన శ్రీనివాస్, అంబాల నాగేశ్వరరావు, దంతాల శ్రీను, భక్తులు చెన్నా విజయ్, గోపి, అంజయ్య, రామారావు, లక్ష్మయ్య, జూనియర్ అసిస్టెంట్ మురళీ పాల్గొన్నారు.

# బీసీ జేఏసీ చైర్మన్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ



- **బీసీ జేఏసీ చైర్మన్ రూపునార్ రమేష్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ**
- **ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆసిఫాబాద్ CI బాలాజీ వరప్రసాద్**

**నేటి సాక్షి,కొమరం భీం ఆసిఫాబాద్ :** జిల్లా ఎల్లారం గ్రామస్తులు కార్తీక పౌర్ణమి సందర్భంగా ఎంతో భక్తిశ్రద్ధలతో నియమ నిష్ఠలతో ఆసిఫాబాద్ కేశ్లాపూర్ అభయ ఆంజనేయ స్వామి దేవాలయానికి దేవనామస్మరణలతో భజన కీర్తనలతో పాదయాత్రగా వచ్చి కార్తీక పుణ్య స్నానాలు ఆచరించి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా బీసీ జేఏసీ జిల్లా రూప్నర్ రమేష్ గారు భక్తులందరికీ అన్నప్రసాదన వితరణ చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆసిఫాబాద్ సీఐ బాలాజీ వరప్రసాద్ గారు, ఆసిఫాబాద్ పట్టణ పుర ప్రముఖులు హాజరయ్యారు పలువురు మాట్లాడుతూ రూపునార్ రమేష్ గారు గత దశాబ్ద కాలంగా ప్రతి కార్తీక పౌర్ణమి రోజు భక్తులందరికీ అన్నప్రసాద్ వితరణ చేయడం చాలా అభినందనీయమని రమేష్ గారు సామాజిక సేవలోనూ ముందంజలో ఉంటారన్నారు ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ ఆవిడపు ప్రణయ్, భక్తులు వివిధ సంఘాల నాయకులు ఆలయ కమిటీ సభలు గుండా వెంకన్న, ధర్మపురి వెంకటేశ్వర్లు, వివేక్, దక్షిణమూర్తి, వనం మధుకర్, బాపు గౌడ్, దూడల అశోక్, పొన్నాల నారాయణ, లాహుకుమార్, పర్రె యాదగిరి, దుర్గం,దీనకర్, గోడిసేల కార్తీక్, రవికాంత్, సిరికొండ సాయి కృష్ణ, సోనాజీ, హనుమంత్, శెండే సోమా, తదితరులు పాల్గొన్నారు

# "శివనామస్మరణతో.మారుమోగిన శైవ క్షేత్రాలు"

- ఆలయాల్లో కార్తీక పూర్ణిమ శోభ
- దర్శనాలకు పోటెత్తిన భక్తులు...
- చెర్వుగట్టు దేవాలయంలో కనీస వసతులు లేవంటూ భక్తుల ఆందోళన



**నేటిసాక్షి, నల్లగొండ :** శివునికి ఎంతో ప్రీతిపాత్రమైన కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తులు జిల్లా వ్యాప్తంగా బ్రుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండే ప్రముఖ శైవ క్షేత్రాలు భక్తులు ప్రముఖ దేవాలయాలు చెర్వుగట్టు, ఛాయసోమేశ్వర దేవాలయం, వాడపల్లి, అడవిదేవులపల్లిలోని బౌద్ధమగుళ్ళు, మిర్యాలగూడలోని ఉ మామహేశ్వర, సోమప్ప ప్రముఖ దేవాలయాల్లో భక్తులు ఉదయం నుండే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం చెర్వు గట్టు దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో వొచ్చారు. ఈ నేపధ్యంలో భక్తులకు కనీస వసతులు కల్పించడంలో ఆలయ కమిటీ పూర్తి స్థాయిలో విఫలమైందని భక్తులు ఆరోపిస్తున్నారు. ఎన్నో ఏండ్లుగా భక్తులు ఎప్పుడు రద్దీగా ఉంటున్నా కానీ కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలం చెందారు. జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శివాలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ పరిసరాలన్నీ శివ నామస్మరంతో మారు మోగాయి. వేకువ జాము నుంచే భక్తులు పుణ్య స్థానాలు ఆచరించి, ఆలయాలకు చేరుకొని కార్తిక దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు చేపట్టారు.

# శివరాంపల్లి లో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



- తెల్లవారుజాము నుండి భారీ ఎత్తున భక్తుల సంఖ్య
- ఆలయ అర్చకులు హరి కీర్తి శివరామ ప్రసాద్ శర్మ

**నేటి సాక్షి రాజేంద్రనగర్ :** కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లి పరిధిలోని హనుమాన్ దేవాలయంలో భక్తులు కిటకిటలాడాయి. తెల్లవారుజామున నుంచే భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరి కీర్తి శివరామ ప్రసాద్ శర్మ విలేకరులతో మాట్లాడుతూ 2002 సంవత్సరంలో పూర్వం నుంచి పురాతనమైనది ఆంజనేయస్వామి ఇక్కడ విరజిల్లు తున్నారని చెప్పుకొచ్చారు. శిథిలావస్థలో ఉన్న గుడిని గ్రామ పెద్దలు ప్రజా పొదుపు సంఘం ప్రజలు కలిసి పునర్మించారు. రాజేంద్రనగర్ సర్కిల్ లోని మొట్టమొదటిగా అయ్యప్ప స్వామి గుడి ప్రతిష్టాపన ఈ ప్రాంతంలోనే జరిగిందని అందువలన ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉ ందన్నారు దూర ప్రాంతాల నుండి భక్తులు వచ్చి ఇక్కడ అయ్యప్ప మాల ధరిస్తారని చెప్పుకొచ్చారు.. ఈరోజు హనుమాన్ ఆలయంలో చిన్నారులు భరత నాట్యం చేస్తూ వచ్చిన భక్తులను సంతోషపరచుతూ అలాగే మహిళలు కార్తీక దీపాలు వెలిగించి, శివలింగానికి అభిషేకాలు జరిపి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# శివాలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

**నేటి సాక్షి,నల్లబెల్లి నవంబర్ 5 :** నల్లబెల్లి మండల కేంద్రంలో శ్రీ రాజరాజేశ్వర శివాలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆలయంలో బుధవారం అశేష భక్తజన సందోహంలో విశేష భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయ ప్రధాన పూజారి పెందోట మురళీమోహన్ చారి, పూజారి రాంప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేక, అలంకార, అర్చన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఉసిరి దీపాలతో స్వామివారికి దీపారాధన నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు ఆకాశదీప దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు ఈ పవిత్ర సమయంలో ఆకాశదీప దర్శనం చేసుకొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు గందె శ్రీనివాస్ గుప్తా, ధర్మకర్త తాటిపెల్లి





రవీందర్, పురాం బద్రీనాథ్, మార్తా మార్కండేయ, పాండవుల రాంబాబు, మిట్టగడుపుల సాక్షి సాంబయ్య, ముత్యాల కుమారస్వామి, ఉడత వీరన్న తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మర్రిపల్లిగూడెం గ్రామంలో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



- దేవస్థాన ప్రాంగణంలో వైభవంగా జ్వాలాతోరణ కార్యక్రమం

**నేటి సాక్షిభీకమలాపూర్ :** హన్మకొండ జిల్లా కమలపూర్ మండలం మరిపల్లిగూడెం గ్రామంలో సాంబశివాలయం దేవస్థానంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు గొట్టుముక్కల లక్ష్మీకాంత్ శర్మ వారి ఆధ్వర్యంలో స్వామివారి నిత్య కైంకర్య కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి.ఉదయం నాలుగు గంటలకు స్వామివారికి నమక,చమక పూర్వక రుద్రాభిషేకం నిర్వహించి తదనంతరం భక్తులకు సామూహిక అభిషేక దర్శనాలు కల్పించి అనంతరం స్వామివారికి మధ్యాహ్నం పన్నెండు గంటలకు మహా నివేదన సమర్పించడం జరిగింది .తిరిగి సాయంకాల ప్రదోష వేళలో స్వామివారి సన్నిధిలో ఆకాశ దీపారాధన మరియు దేవస్థాన ప్రాంగణం ముందు జ్వాలాతోరనం కార్యక్రమం నిర్వహించబడి తదుపరి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేయడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో విశేషంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఉప ఎన్నికల ప్రచారంలో...దామరచర్ల నాయకులు

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో...దామరచర్ల నాయకులు



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశానుసరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుకు మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల నాయకులు బుధవారం తాజా మాజీ ఎంపిపి ధీరావత్ నందిని రవితేజ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను వివరిస్తూ, హస్తం గుర్తుకు ఓటు వేసి, నవీన్ యాదవ్ ను అత్యధిక మెజారిటితో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులు చిలుకూరి బాలు, అంజిరెడ్డి, నాగు నాయక్, కిరణ్, పరంగి సురేష్, సిద్దు, శ్రీహరి, శివ, హనుమ, మండల నాయకులు, పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నవీన్ యాదవ్ గెలుపుకు ప్రచారానికి వెళ్లిన బిసి నాయకులు,

## ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఆధ్వర్యంలో...మిర్యాలగూడ టూ జూబ్లీహిల్స్



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినవీన్ యాదవ్ గెలుపు ప్రచారానికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం వ్యాప్తంగా బుధవారం 80 నుంచి 100 వాహనంలో సుమారు 1200 నుంచి 1500 మంది యాదవ్స్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా జూబ్లీహిల్స్ వెళ్లారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం రాష్ట్ర నాయకులు పగిడి రామలింగయ్య యాదవ్, కౌన్సిలర్లు చల్లా నాగమ్మ వెంకన్న, పొదిల వెంకన్న, కట్టెబోయిన రామలింగయ్య యాదవ్, పుట్టపాక శ్రీనివాస్ యాదవ్, డివిజన్ యాదవ్స్ సంగం ప్రధాన కార్యదర్శి కంచుగట్ల లింగయ్య యాదవ్, జంగ లక్ష్మణ్ యాదవ్, చిలకల మురళి యాదవ్, గాలం వెంకన్న యాదవ్, పట్టణ యాదవ సంఘం అధ్యక్షులు కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్, సంద్రాల వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



**నేటి సాక్షి తిరుపతి(బాదూరు బాల) పాకాల :** చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే జయదేవనాయుడు జన్మదిన వేడుకల్లో చంద్రగిరి నియోజక వర్గ వైఎస్ఆర్‌సీపీ సమన్వకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. బుధవారం జయదేవ నాయుడు జన్మదినం కావడంతో పాకాల పట్టణంలోని శ్రీ సత్యమ్మగుడి వద్దనున్న జయదేవ నాయుడు ఇంటికి వెళ్లిన మోహిత్‌రెడ్డి జయదేవ నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాలువతో సత్కరించి ఆయన చేత కేక్ కట్ చేయించారు. ఈ జన్మదిన వేడుకల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితో పాటు పాకాల మండలంకు చెందిన వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైసమ్మ గుట్ట నుండి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



**నేటి సాక్షి,గన్నేరువరం (బుర్ర అంజయ్య గౌడ్) :** మండలం, మైలారం గ్రామములోని మైసమ్మ గుట్ట వద్ద నుండి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ. గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండల ప్రజలకు కరీంనగర్ జిల్లా కేంద్రానికి దూరం ఉన్నందున విద్యా, వైద్య, వెనుకబడినదని. మైలారం గ్రామములో స్వయంభు మల్లిఖార్జున స్వామిదేవస్థానము దేవస్థానం చుట్టు 12 జ్యోతిర్లింగాలను నిర్మించుచున్నాము. కరీంనగర్ నుండి కాకుండా ఇతర జిల్లాలలో నుండి కూడ భక్తులు ప్రతి రోజు వస్తుంటారు. మల్లిఖార్జున స్వామి దేవస్థానము నుండి కరీంనగర్ పట్టణము మొత్తము కనిపిస్తదని, మూడు మండలాల ప్రజల ఇబ్బందులను పరగణలోనికి తీసుకోని మైలారం మైసమ్మ గుట్ట నుండి కరీంనగర్ లోని సప్తగిరి కాలనీలో గల శ్మశాన వాటిక వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలారం మల్లికార్జున ఆలయ కమిటీ చైర్మన్ వరాల పరశురాములు, నూకల గంగరాజు, వరాల మల్లేశం, సుద్దాల రాజమల్లు, గడ్డం బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.